ప్రభాతనవ

SINGIDI
తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

శుక్రవారం 21 ఆగస్టు 2026 | సంపుటి: 1 సంచిక: 65 పేజీలు 12 వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar


## నీట్ నిరసనలపై సుప్రీంకోర్టు
# కీలక నిర్ణయం

**పోలీసుల చర్యలపై ఐదుగురు సభ్యులతో విచారణ కమిటీ**

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి వ్యతిరేకంగా చలో పార్లమెంట్ చేపట్టిన ఆందోళనకారులపై పోలీసులు బలప్రయోగం చేశారనే ఆరోపణలపై విచారణ జరిపేందుకు సుప్రీం కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ఐదుగురు సభ్యులతో కూడిన అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది.

- న్యూఢిల్లీ, ఆగస్టు 20 (సింగిడి)



2




2

పిల్లలపై ఎలాంటి
## ఒత్తిడి పడకూడదు

**సీబీఎస్ఈ త్రిభాషా విధానంపై సుప్రీంకోర్టు**

# హైడ్రామా?

**ఇల్లు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ గూడు ఎక్కడ?**

## పేదల ఇళ్ల కూల్చివేత.. పరిహారంపై ప్రశ్నలు

**ఫాతిమా కాలేజీ విద్యార్థులపై చూపిన శ్రద్ధ**

**పేదల ఇళ్లపై ఎందుకు లేదన్న ప్రశ్న**

**కొందరికి సింహాస్వప్నం.. మరికొందరికి బుల్డోజర్ భూతం**

**పునరావాసంపై ప్రభుత్వ హామీ.. అమలు ఎప్పుడు?**

చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు.. ఇళ్లు కూల్చిన తర్వాత పరిహారం, పునరావాసం మాట వినిపిస్తోంది. ముందే ప్రత్యామ్నాయ గూడు చూపించి చర్యలు తీసుకోవచ్చుగా అన్న ప్రశ్నలు ఇప్పుడు వెంటాడుతున్నాయి. ఫాతిమా కాలేజీలో 10 వేల మంది పేద విద్యార్థుల భవిష్యత్తుపై స్పందించిన అధికారులకు.. బుల్డోజర్ కింద గూడు కోల్పోయిన పేదల పిల్లల భవిష్యత్తు ఎందుకు కనిపించలేదన్న విమర్శలు వస్తున్నాయి. హైడ్రా ఆక్రమణలకు భయం కావచ్చు.. కానీ పేదల బతుకులకు భూతంగా మారకూడదన్నదే అసలు ప్రశ్న.

హైదరాబాద్ బ్యూరో, సింగిడి



### పునరావాసం సంగతేంటి..

ప్రభుత్వం అర్హులైన పేదలను గుర్తించి వారికి పరిహారం, పునరావాసం కల్పించే ప్రక్రియ కొనసాగుతోంది. కానీ ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు ఆ సహాయం ఎప్పుడు అందుతుంది? ప్రత్యామ్నాయ గూడు ఎప్పుడు దక్కుతుంది? అన్న ప్రశ్నలు ఇంకా మిగిలే ఉన్నాయి. ఆక్రమణలు తొలగించడం ప్రభుత్వ బాధ్యతే.. కానీ ఇళ్లు కోల్పోయిన పేదలకు గూడు చూపించడం కూడా అదే ప్రభుత్వ బాధ్యత కాదా?

### పేదల గూడు.. పరిహారం ఎక్కడ?

చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు చర్యలు అవసరమే. కానీ ఆ చర్యల్లో ఇళ్లు కోల్పోయిన పేద కుటుంబాల పరిస్థితి ఏంటి? ఇల్లు కూల్చిన తర్వాత వారికి ప్రత్యామ్నాయ వసతి కల్పించాల్సిన బాధ్యత ఎవరిది? పరిహారం, పునరావాసం విషయంలో ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ చూపించాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

### ఫాతిమా కాలేజీపై ప్రేమ?

ఫాతిమా కాలేజీలో చదువుతున్న 10 వేల మంది పేద విద్యార్థుల అంశం తెరపైకి వచ్చినప్పుడు.. వారి భవిష్యత్తు గురించి ఆందోళన వ్యక్తమైంది. అదే సమయంలో పేదల ఇళ్లు నేలమట్టమవుతున్నప్పుడు.. ఆ కుటుంబాల్లోని పిల్లల పరిస్థితిపై ఎందుకు అదే స్థాయిలో స్పందన లేదన్న ప్రశ్నలు వస్తున్నాయి. చర్యల ఉద్దేశం ఎంత ముఖ్యమో.. వాటి ప్రభావం కూడా అంతే ముఖ్యమన్న వాదన ఉంది.

### కొందరికి రక్ష.. మరికొందరికి శిక్ష

అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై చర్యలు తీసుకుంటున్న హైడ్రా కొందరికి సింహస్వప్నంగా కనిపిస్తోంది. కానీ ఇళ్లు కోల్పోయిన పేదలకు మాత్రం అదే చర్యలు బుల్డోజర్ భూతంలా మారాయని బాధితుల వాదన. అందుకే హైడ్రా చర్యలను కేవలం అక్రమ నిర్మాణాల కోణంలో కాకుండా.. బాధిత కుటుంబాల జీవన కోణంలోనూ చూడాలన్న డిమాండ్ పెరుగుతోంది.



షోకాజ్ నోటీసుకు
# కొండా సురేఖ వివరణ

## నాకు సంబంధంలేని అంశంలో వివరణ కోరడం సముచితం కాదు


2

- **సుస్మితా పటేల్ వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేయటం సరికాదని పేర్కొన్న మంత్రి**
- **కాంగ్రెస్ నాయకత్వం, పార్టీ నియమావళిపై గౌరవం ఉందని స్పష్టం**
- **క్రమశిక్షణ కమిటీ నోటీసును ఉపసంహరించుకోవాలని కోరిన మంత్రి**

తన కుమార్తె చేసిన వ్యాఖ్యలపై తనను వివరణ ఇవ్వాలని కోరడం సముచితంగా లేదన్నారు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ. తనకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన నోటీసుకు ఆమె వివరణ ఇచ్చారు. ఈ మేరకు కమిటీ ఛైర్మన్ మల్లు రవికి లేఖ రాశారు. ఇటీవల జరిగిన ఘటనలపై ఈ లేఖలో వివరణ ఇచ్చారు.

- హైదరాబాద్, ఆగస్టు 20 (సింగిడి)

# లండన్‌లో రేవంత్ సందడి



ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం లండన్‌కు చేరుకున్నారు. ఎంఐఎం నేత, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ కుటుంబంలో జరిగే వివాహ వేడుకకు హాజరయ్యేందుకు సీఎం లండన్ వెళ్లారు. ఈ సందర్భంగా అక్బరుద్దీన్ ఓవైసీతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి సందడి చేశారు.

## రేవంత్ పర్యటన వెనుక దేశ వ్యతిరేక శక్తులు

**రేవంత్ విదేశీ పర్యటనలపై అర్వింద్ విమర్శలు**

**విదేశీ పర్యటనలన్నీ దేశంపై విద్వేషం చిమ్మే వర్గాలతోనే సాగుతున్నాయని ఆరోపణ**

2




మార్గదర్శికి సుప్రీంలో
# భారీ ఊరట

**ఉండవల్లి పిటిషన్ కొట్టివేత**

**మార్గదర్శి కేసులో ఉండవల్లి అరుణ్ కుమార్ పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు**

**డిపాజిటర్లకు రూ.2,500 కోట్లు చెల్లించామని తెలిపిన మార్గదర్శి**

**ఇది వ్యక్తిగత వివాదంలా ఉంది, ప్రజా ప్రయోజనం లేదన్న ధర్మాసనం**

**తెలంగాణ హైకోర్టు తీర్పును సమర్థించడంతో మార్గదర్శిపై క్రిమినల్ కేసులు ముగింపు**

2

# డీలిమిటేషన్‌తో నష్టం జరగకూడదు



2

## దక్షిణాది రాష్ట్రాల సీఎంల డిమాండ్

**అమిత్ షా అధ్యక్షతన**


**దక్షిణ జోనల్ కౌన్సిల్ భేటీ**

**ఏపీ విభజన సమస్యల ప్రస్తావన!**

డీలిమిటేషన్‌తో నష్టం జరుగకూడదు తమిళనాడులో గురువారం కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన దక్షిణ జోనల్ కౌన్సిల్‌లో ముఖ్యమంత్రులు లేవనెత్తిన కొన్ని కీలక అంశాల్లో నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్),దక్షిణ రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్య పరిరక్షణ, నీట్ పరీక్ష, కావేరీ జలాల పంపిణీ, అధిక ఆర్థిక స్వయంప్రతిపత్తి ఉన్నాయి.

- మహాబలిపురం (సింగిడి)





ఉచిత పథకాలపై
# హైకోర్టు ఆగ్రహం

**కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లపై స్టే ఎత్తివేతకు నిరాకరణ**

**రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై డేంజర్ బెల్స్ మోగుతున్నాయన్న తెలంగాణ హైకోర్టు**

**ఉచిత పథకాలకు నిధుల మళ్లింపు వల్ల అత్యవసర రంగాలపై ప్రభావం పడుతోందని వ్యాఖ్య**

2



రూపురేఖలు మార్చే
# జహీరాబాద్ ప్రాజెక్ట్

**2028 నాటికి పూర్తికి తెలంగాణ సర్కార్ ప్లాన్**

**జహీరాబాద్ స్మార్ట్ సిటీతో రూ.15,000 కోట్ల పెట్టుబడులు, 2 లక్షల ఉద్యోగాల లక్ష్యం**

**ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు**

అవినీతి అధికారిపై
# ఏసీబీ కొరడా

**తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఇంట్లో భారీగా ఆస్తులు గుర్తించిన ఏసీబీ - బహిరంగ మార్కెట్‌లో రూ.100 కోట్ల విలువ!**

**ఎమ్మార్వోకి సంబంధించి ఒకేసారి 15 చోట్ల ఏసీబీ అధికారుల సోదాలు**

**ఏసీబీ తనిఖీల్లో 8ప్లాట్లు, 2ప్లాట్లు, పదెకరాల భూమి, కిలో బంగారు గుర్తింపు**

2



హైదరాబాద్‌లో మరో అవినీతి అధికారిపై ఏసీబీ అధికారులు కొరడా ఝుళిపించారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలపై తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి నివాసాలు, కార్యాలయాలలో సోదాలు నిర్వహించారు.

- హైదరాబాద్, ఆగస్టు 20 (సింగిడి)

# 22ఏ సమస్యపై ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం

**కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదు పరిష్కారమే లక్ష్యం**

**ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదు**

**అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం**



22ఏ నిషేధిత భూముల అంశంలో ప్రజలకు పూర్తి భరోసా కల్పించే దిశగా రెవెన్యూ శాఖ చర్యలను మరింత వేగవంతం చేసిందని కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి దరఖాస్తును కేవలం ఒక ఫిర్యాదుగా కాకుండా ఒక బాధ్యతగా తీసుకోవాలని, సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు.

- హైదరాబాద్, ఆగస్టు 20 (సింగిడి)

22ఏ నిషేధిత జాబితా
## ఆధారంగా దోపిడీ

**రాహుల్, ఖర్గే జోక్యం చేసుకోవాలి: బీజేపీ ఎంపీ లక్ష్మణ్**

2

తెలంగాణలో 22ఎ సెక్షన్
## దుర్వినియోగం

**రాహుల్ గాంధీకి హరీష్ రావు లేఖ**

ప్రభాతనవ
SINGIDI | తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం
21 ఆగస్టు 2026

# నీట్ నిరసనలపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయమాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనతో కూడిన ధర్మాసనం ఈ మేరకు నిర్ణయించింది. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్ సుభాశ్ రెడ్డి ఈ కమిటీకి నేతృత్వం వహించనున్నారు. ఆయనతో పాటు పంజాబ్– హరియాణా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఆర్‌కే ఝా, దిల్లీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శలిందర్ కౌర్, సీబీఐ మాజీ డైరెక్టర్ ఆర్‌కే శుక్లా, మేఘాలయ మాజీ డీజీపీ ఎల్‌ఆర్ బిష్ణోయ్ కమిటీ సభ్యులుగా ఉన్నారు.
ఆందోళనకారులపై పోలీసుల చర్యలను విచారించనున్న కమిటీ ఈ కమిటీ ప్రధానంగా రెండు కోణాల్లో సమగ్ర విచారణ చేపట్టనుంది. మొదటగా పోలీసుల చర్యలపై వచ్చిన ఆరోపణలు, నిరసనకారులపై పెల్లెట్ గన్స్, ఎలక్ట్రిక్ లాఠీలు, టియర్ గ్యాస్ ప్రయోగం, లాఠీఛార్జి వంటి తీవ్రమైన చర్యలపై విచారణ జరపనుంది. మహిళా నిరసనకారులపై హింస, పోలీసుల నిఘా వ్యవహారాలు, అల్లర్లను నియంత్రించే క్రమంలో అవసరానికి మించి భద్రతా బలగాలు వ్యవహరించాయా అన్న కోణంలో విచారణ చేయనుంది.
మరోవైపు ఆందోళనకారుల వల్ల విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిపై జరిగిన దాడులు, హింసాత్మక ఘటనలు, నిరసనల పేరుతో జరిగిన ప్రభుత్వ, ప్రజా ఆస్తుల ధ్వంసంపైనా ఉన్నతస్థాయి కమిటీ విచారణ జరపనుంది.
"ఈ అత్యున్నత స్థాయి విచారణ కమిటీని (HPEC) ఏర్పాటు చేసేటప్పుడు సభ్యుల వ్యక్తిగత నైపుణ్యం, అనుభవం, కమిటీలోని వైవిధ్యం వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్నాం. HPEC చేసే సిఫార్సులు ఈ న్యాయస్థానానికి ఎంతో విలువైన సహాయాన్ని అందిస్తాయి. తగిన పరిశీలన అవసరమైన అన్ని అంశాలపై కమిటీ సమగ్ర అంచనాను చేపట్టగలదని మాకు నమ్మకం ఉంది. అదేవిధంగా పోలీసు అధికారులు, భద్రతా సిబ్బంది వల్ల నిరసనకారులకు తీవ్రమైన హాని, గాయాలు కలిగినట్లు వచ్చిన ఆరోపణలపై కూడా HPEC అంచనా వేయవచ్చు. అలాగే, అటువంటి అకృత్యాలకు దారితీసిన పరిస్థితులు, అందుకు బాధ్యులైన వ్యక్తులు, బలాన్ని ప్రయోగించేటప్పుడు ఏవైనా చట్టాలు, నిబంధనలు లేదా ప్రమాణాలు ఉల్లంఘించారా? వంటి అంశాలను కూడా విచారించవచ్చు" అని ధర్మాసనం పేర్కొంది. HPEC చేపట్టే విచారణ ఒక్కసారి మాత్రమే చేసే ప్రక్రియగా పరిమితం కాకూడదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ అంశాలపై నిరంతర, క్రమబద్ధమైన సమీక్షను చేపట్టాలని, అలాగే తమకు మధ్యంతర నివేదికలను ఎప్పటికప్పుడు సమర్పించాలని కమిటీని ఆదేశించింది.
నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఆరోపణలపై అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పరీక్షా విధానంలో విస్తృత సంస్కరణలు కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ (CJP) ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలోనే జూలై 20న దిల్లీలో CJP ఆధ్వర్యంలో పార్లమెంటు వైపు జరిగిన ర్యాలీలో నిరసనకారులు– భద్రతా సిబ్బంది మధ్య ఘర్షణలు జరిగాయి. పార్లమెంటు వైపు వెళ్లడానికి ప్రయత్నించిన గుంపులను చెదరగొట్టడానికి భద్రతా సిబ్బంది లాఠీలు, బాష్పవాయువు షెల్స్‌ను ఉపయోగించారు. ఆ తర్వాత నిరసనకారులను పోలీసు సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నట్లుగా ఉన్న అనేక వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆందోళనల్లో మితిమీరిన బలప్రయోగం జరిగిందనే ఆరోపణలకు దారితీసింది. ఈ క్రమంలోనే దీనిపై పిటిషన్ దాఖలు చేయగా సుప్రీం విచారణ చేపట్టి తాజాగా అత్యున్నత స్థాయి విచారణ కమిటీని నియమించింది.

# అవినీతి అధికారిపై ఏసీబీ కొరడా

హైదరాబాద్‌లో మరో అవినీతి అధికారిపై ఏసీబీ అధికారులు కొరడా ఝుళిపించారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలపై తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి నివాసాలు, కార్యాలయాలకు సంబంధించిన పలు ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. మొత్తం 15 ప్రాంతాల్లో జరిపిన ఈ తనిఖీల్లో కీలక పత్రాలు, ఆస్తులకు సంబంధించిన వివరాలను అధికారులు సేకరించారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలతో అధికారి శ్రీనివాస్ రెడ్డిపై ఏసీబీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.
భారీగా అక్రమాస్తుల గుర్తింపు : ఎమ్మార్వో శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించి ఏసీబీ నిర్వహించిన తనిఖీల్లో అధికారులు భారీ మొత్తంలో ఆస్తులు గుర్తించారు. వీటితో పాటు కిలోకు పైగా బంగారం శ్రీనివాసరెడ్డి 7 బ్యాంకు ఖాతాల్లో రూ.8 లక్షలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 8 ప్లాట్లు, యాచారంలో 10 ఎకరాల భూమితో పాటు హస్తినాపురంలో మూడంతస్తుల భవనం ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. శ్రీనివాసరెడ్డి ఇంట్లో రూ.4 లక్షలు, 3 కార్లు, 3 ద్విచక్రవాహనాలు గుర్తించారు. ఓ బారులో కుమారుడి పేరిట రూ.86 లక్షలు పెట్టుబడి కూడా పెట్టినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. శ్రీనివాసరెడ్డి ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.100 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ప్రస్తుతం ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ రెడ్డి గతంలో మహేశ్వరం, బాలాపూర్, శంషాబాద్ తహసీల్దార్‌గా పనిచేశారు. ఈ క్రమంలో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులు ఇవాళ ఏకకాలంలో 15 చోట్ల సోదాలు చేపట్టారు. హైదరాబాద్‌తో పాటు శ్రీనివాస్ రెడ్డికి సంబంధించిన పలు ప్రాంతాల్లో అధికారులు తనిఖీలు కొనసాగించారు. ప్రస్తుతం ఎమ్మార్వో శ్రీనివాసరెడ్డిని కోర్టు ముందు హాజరుపరిచి తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు ఏసీబీ డీఎస్పీ వివరించారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని హస్తినాపురం డివిజన్ పరిధి సంతోషిమాత కాలనీలో ఉన్న శ్రీనివాస్ రెడ్డి నివాసంలోనూ ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. శ్రీనివాస్ రెడ్డి ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలపై కేసు నమోదు చేసిన ఏసీబీ ఆయనకు సంబంధించిన ఇళ్లు, ఇతర ప్రాంతాల్లో ఆస్తుల పత్రాలు, బ్యాంకు లావాదేవీలు, నగదు, విలువైన వస్తువులకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. ఈ మేరకు శ్రీనివాస్ రెడ్డికి సంబంధించి ఒకేసారి 15 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమంగా సంపాదించిన ప్రభుత్వ ఉద్యోగుల గుండెల్లో ఏడాది కాలంగా అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) గుబులు పుట్టిస్తోంది. ఈ జాబితాలోనే డీఎస్పీ భీంరెడ్డి, టీజీ రెడ్‌కో డివిజనల్ ఇంజనీర్ ముత్యం వెంకటరమణ, ఆర్‌అండ్‌బీ ఈఎన్సీ మోహన్ నాయక్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి రావు, హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బాచు రవీందర్, హైదరాబాద్ జలమండలి జనరల్ మేనేజర్ సగం అనంత లక్ష్మి కుమార్ వంటి అధికారులు వందల కోట్ల అవినీతికి పాల్పడి ఏసీబీకి చిక్కారు. వీరి దగ్గర తవ్వే కొద్ది వందల కోట్లు బయటపడ్డాయి. ఈ క్రమంలో ఈ దాడులు జరుగుతూనే ఉన్నాయి.

# ఉచిత పథకాలపై హైకోర్టు ఆగ్రహం

**హైదరాబాద్, ఆగస్టు 20 (సింగిడి)**

తెలంగాణలో అమలవుతున్న కల్యాణలక్ష్మి , షాదీముబారక్ వంటి పథకాల చట్టబద్ధత, ఉచిత పథకాలకు నిధుల వినియోగంపై దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పథకాల నిధుల విడుదలపై ఉన్న మధ్యంతర స్టేను ఎత్తివేసేందుకు జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ ధర్మాసనం నిరాకరించింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై 'డేంజర్ బెల్స్' మోగుతున్నాయని హెచ్చరించిన ధర్మాసనం... పరిమితి లేకుండా ఉచిత పథకాలకు నిధులు మళ్లించడం వల్ల ఇతర అత్యవసర రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోందని వ్యాఖ్యానించింది. నీటిపారుదల, ఇతర ప్రాజెక్టుల కోసం నిర్బంధంగా భూములిచ్చిన బాధితులకు ఏళ్లకు ఏళ్లు పరిహారం చెల్లించకుండా బకాయిలు పెట్టడంపై కోర్టు నిలదీసింది. భూబాధితులకు పరిహారం ఇవ్వడం ప్రభుత్వ చట్టబద్ధమైన బాధ్యత కాదా? అని ప్రశ్నించింది.అలాగే, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు అందాల్సిన పెన్షన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సమయానికి చెల్లించలేక పోవడంతో వారు న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి వస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజాధనాన్ని ఈ విధంగా వాడటానికి బదులు భూబాధితులకు సకాలంలో పరిహారం ఇచ్చి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తే అసలు ఇటువంటి పథకాల అవసరమే ప్రజలకు ఉండదని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల బాట పట్టించి, ఆ ఆదాయంతో సంక్షేమం చేపట్టవచ్చని సూచిస్తూ, సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# రూపురేఖలు మార్చే జహీరాబాద్ ప్రాజెక్ట్

**హైదరాబాద్, ఆగస్టు 20 (సింగిడి)**

జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ద్వారా తయారీ రంగంలో సుమారు రూ.15,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని, తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 2 లక్షల ఉద్యోగాలు కల్పించాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. 2028 మార్చి నాటికి ఈ ప్రాజెక్టులో కీలకమైన మౌలిక సదుపాయాలను పూర్తి చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఇటీవల వెల్లడించారు. జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, అమలు సంస్థ (నిక్డిట్) సమావేశంలో తెలంగాణ సచివాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్న మంత్రి ఈ వివరాలను తెలిపారు. పెట్టుబడులకు సిద్ధంగా ఉండేలా జహీరాబాద్ పారిశ్రామిక నగరాన్ని తీర్చిదిద్దేందుకు మౌలిక సదుపాయాల కల్పన పనులను వేగవంతం చేస్తున్నట్లు ఆయన వివరించారు. హైదరాబాద్–నాగ్‌పూర్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా సంగారెడ్డి జిల్లాలో మొదటి దశలో 3,245 ఎకరాల్లో జహీరాబాద్ స్మార్ట్ సిటీని అభివృద్ధి చేస్తున్నారు. మొత్తం 17 గ్రామాల్లో 12,635 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ ఇండస్ట్రియల్ నోడ్, జహీరాబాద్ పట్టణానికి 9 కిలోమీటర్ల దూరంలో ఉంది. జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి సంస్థ (ఎన్ఐసీడీసీ) నివేదిక ప్రకారం, మొదటి దశలో రూ.15,000 కోట్ల పెట్టుబడులు, 1,90,031 ఉద్యోగాల కల్పనను అంచనా వేశారు. ప్రాజెక్ట్ మాస్టర్ ప్లాన్ ప్రకారం.. సుమారు 1,939 ఎకరాలను పారిశ్రామిక అవసరాలకు, 55 ఎకరాలను లాజిస్టిక్స్ కోసం, 607 ఎకరాలను పచ్చదనం కోసం కేటాయించారు. మిగిలిన భూమిని రోడ్లు, వాణిజ్య, నివాస భవనాలు, ఇతర ప్రజా సౌకర్యాల కోసం వినియోగించనున్నారు. ఆటోమొబైల్స్, రవాణా పరికరాలు, ఎలక్ట్రికల్ పరికరాలు, లోహాలు, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాలను ఇక్కడ ప్రధానంగా ప్రోత్సహించనున్నారు. జాతీయ రహదారి 65కి సమీపంలో ఉండటం పరిశ్రమలకు రవాణా సౌకర్యాన్ని పెంచనుంది. ఇదే స్మార్ట్ సిటీలో హ్యుందాయ్ గ్రూప్ రూ.8,500 కోట్లతో గ్లోబల్ ఇన్నోవేషన్, రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనుందని శ్రీధర్ బాబు గత జూన్‌లో వెల్లడించిన విషయం తెలిసిందే. అయితే, ప్రస్తుతం ప్రకటించిన రూ.15,000 కోట్ల పెట్టుబడులు, 2 లక్షల ఉద్యోగాలు కేవలం ప్రాజెక్ట్ లక్ష్యాలు మాత్రమేనని, ఇప్పటికే ఖరారైన ఒప్పందాలు కావని అధికారులు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'భారత్ ఉద్యోగిక్ వికాస్ యోజన' (భవ్య) కింద రాష్ట్రంలోని నాలుగు పారిశ్రామిక పార్కులకు ఆర్థిక సహకారం అందించాలని శ్రీధర్ బాబు కేంద్రాన్ని కోరారు. ప్రస్తుతం మౌలిక వసతుల పనుల కోసం ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, నిర్మాణ కాంట్రాక్టును జీవీపీఆర్–ఎస్ఆర్ఆర్ (జేవీ) సంస్థకు అప్పగించడంతో పనులు ప్రారంభమయ్యాయి. ఈ ప్రాజెక్టుతో జహీరాబాద్‌ను ఒక ప్రధాన తయారీ కేంద్రంగా మార్చాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది.

# షోకాజ్ నోటీసుకు కొండా సురేఖ వివరణ

ఆగస్టు 19న తన జన్మదినం సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు, తమ కుటుంబ అభిమానులు పలు చోట్ల వేడుకలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారని మంత్రి కొండా సురేఖ లేఖలో పేర్కొన్నారు. తన స్వస్థలమైన గీసుకొండతో తమ కుమార్తె సుస్మితా పటేల్‌కు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. అందువల్ల అక్కడ నిర్వహించిన వేడుకల్లో ఆమె పాల్గొన్నారని తెలిపారు. ఆమె వ్యక్తిగత అభిప్రాయం : ఆ కార్యక్రమంలో తన కుమార్తె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయమని మంత్రి లేఖలో పేర్కొన్నారు. ఒకరి వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరు రాజకీయంగా బాధ్యత వహించాలనడం, ఆ ప్రాతిపదికన వివరణ కోరడం సముచితం కాదని సురేఖ లేఖలో పేర్కొన్నారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేయడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని వివరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం, పార్టీ క్రమశిక్షణా నియమావళీపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ అంశంలో తన ప్రమేయం లేదని గుర్తించి, తనకు జారీచేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని కోరుతున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

# డీలిమిటేషన్‌తో నష్టం జరుగకూడదు

మహాబలిపురంలో జరిగిన 31వ దక్షిణాది జోనల్ కౌన్సిల్ సమావేశంలో సీఎం చంద్రబాబు చారిత్రక ప్రసంగం చేశారు. ఏపీ విభజన పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని అమిత్‌షాను రిక్వెస్ట్ చేశారు.
తమిళనాడులోని చారిత్రక ప్రాంతమైన మహాబలిపురం వేదికగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అధ్యక్షతన జరిగిన 31వ దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యంత కీలకమైన ప్రసంగం చేశారు. ఈ ప్రతిష్ఠాత్మకమైన సమావేశానికి ఏపీ సీఎంతోపాటు తమినాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరయ్యారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ఈ సదస్సు సాగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ డాక్యుమెంట్ ప్రవేశపెట్టారు. రాష్ట్రాల ప్రయోజనాలతోపాటు దేశ పురోగతిలో దక్షిణాది పాత్రను వివరిస్తూ, పోటీ కంటే రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం అత్యంత అవసరమని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రం– రాష్ట్రాలు, అలాగే వివిధ రాష్ట్రాల మధ్య ఉండే ఘర్షణలు, విభేదాలు దేశాభివృద్ధికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగపడవని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పరస్పర నమ్మకం, నిరంతర సంప్రదింపులు ఇచ్చిపుచ్చుకునే ధోరణి, బలమైన సహకార సమాఖ్య విధానం ద్వారానే ఎంతటి సంక్లిష్ట సమస్యలనైనా పరిష్కరించుకోవచ్చని ఆయన సూచించారు.
దక్షిణాది రాష్ట్రాలు కేవలం పెట్టుబడులు కోసమో, పరిశ్రమల స్థాపన కోసమో లేదా మౌలిక సదుపాయాల కోసమో పరస్పరం పోటీ పడటంతో ఆగిపోకూడదని ఆయన హితువు పలికారు. కొన్ని అత్యంత కీలకమైన రంగాల్లో అన్ని రాష్ట్రాలు కలిసికట్టుగా ఉమ్మడి ప్రణాళికలతో పని చేయాల్సిన సమయం ఆసన్నమైందని ప్రతిపాదించారు.

### 2047 నాటికి ట్రిలియన్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ

భారత్ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాలు దాదాపు 31 శాతం వాటా కలిగి ఉన్నాయని సీఎం చంద్రబాబు వివరించారు. ఈ ప్రాంతానికి ఉన్న సమష్టి ఆర్థిక శక్తి అపారమైందని ఆయన చాటి చెప్పారు.
వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణ భారత్ ఒక ప్రధాన ఆర్థిక శక్తిగా నిలవడానికి మనమంతా సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఈ క్రమంలోనే 2047 నాటికి దక్షిణ భారత్‌ని 10 ట్రిలియన్ డాలర్ల అద్భుత ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యంగా అందరం చేతులు కలపాలని ఆయన ప్రతిపాదించారు.

### రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు

దక్షిణాది రాష్ట్రాల మధ్య వ్యాపార కార్యకలాపాలు వేగవంతం కావడానికి, సరకు రవాణా వ్యయం తగ్గడానికి, ఉపాధి అవకాశాలు మెరుగుపడటానికి బలమైన రవాణా అనుసంధానం ఎంతో అవసరమని చంద్రబాబు సూచించారు.
ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలను వేగంగా అనుసంధానించేలా కుప్పం మీదుగా బులెట్ ట్రైన్ నడపాలనే సరికొత్త ప్రతిపాదనను కేంద్రం ముందు ఉంచారు. దక్షిణాదిలోని మూడు ప్రధాన కేంద్రాలైన అమరావతి, బెంగళూరు, చెన్నై నగరాలను అత్యంత బలమైన వేగవంతమైన రవాణా వ్యవస్థతో అనుసంధానించాలని ఆయన స్పష్టం చేశారు. దీని వల్ల పెట్టుబడులు పెరగడమే కాకుండా రవాణా వ్యవస్థ మరింత సులువు అవుతుందని చెప్పారు.

### నీటి వివాదాలకు శాశ్వత పరిష్కారం

దక్షిణాది రాష్ట్రాల మధ్య తరచూ తలెత్తే నీటి వివాదాలకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక ప్రతిపాదన చేశారు. కేవలం నీటి పంపిణీ గురించి చర్చించుకుంటూ వివాదాలు సృష్టించుకోవడం కంటే నీటి సమర్థ వినియోగం వైపు దృష్టి పెట్టాలని సూచించారు. గోదావరి నదికి వచ్చే మిగులు వరద జలాల నుంచి దాదాపు 500 టీఎంసీలకుపైగా నీటిని కృష్ణా, పెన్నా నదుల మీదుగా కావేరి బేసిన్‌కు తరలించాలని ఆయన ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు శాశ్వత నీటి భద్రత లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు.
ఈ ప్రతిష్ఠాత్మక అనుసంధానం విజయవంతం కావడానికి ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు అత్యంత సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. భవిష్యత్‌లో గంగా–కావేరీ నదుల అనుసంధానానికి సంబంధించి దీర్ఘకాలిక జాతీయ ప్రణాళిక రూపొందించుకోవాలని కోరారు. ఈ నదుల అనుసంధానంపై కాలపరిమితితో కూడిన డీపీఆర్, తగిన అనుమతులను త్వరగా మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



# రేవంత్ పర్యటన వెనుక దేశ వ్యతిరేక శక్తులు

**హైదరాబాద్, ఆగస్టు 20 (సింగిడి)**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనల లక్ష్యంగా నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కార్పొరేట్ పెట్టుబడుల సేకరణ పేరుతో రేవంత్ రెడ్డి నిర్వహిస్తున్న విదేశీ పర్యటనలన్నీ భారత్‌పై విద్వేషం చిమ్మే వర్గాలతోనే సాగుతోందని ఆయన ఆరోపించారు. జార్జ్ సోరోస్ వంటి భారత్ వ్యతిరేక భావజాలం కలిగిన వ్యక్తులు, సంస్థల నిధులతో నడిచే వేదికల వద్దకే సీఎం వెళుతున్నారని విమర్శించారు. దేశవ్యతిరేక ఐడియాలజీ ఉన్న సంస్థలను కలవడంలో అంతర్యం ఏంటని ప్రశ్నించారు. అలాగే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను హెచ్చరిస్తూ... గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో రాజకీయ నాయకుల మాటలు విని పలువురు అధికారులు చివరకు జైలుపాలు కావాల్సి వచ్చిందని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి వల్ల అధికారులకు ఎటువంటి రక్షణ ఉండదని, భవిష్యత్తులో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వచ్చే 2029 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ భారీ మెజారిటీతో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

# తెలంగాణలో 22ఎ సెక్షన్ దుర్వినియోగం

## రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 20 (సింగిడి)**

తెలంగాణలో 22ఎ నిషేధిత జాబితా భూముల సెక్షన్ దుర్వినియోగంపై రాహుల్ గాంధీకి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో ఊఓఆం అనుమతులున్న వేలాది ప్రైవేటు ఆస్తులను 22ం జాబితాలో పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ శాఖలో 30 శాతం వసూళ్ల దందా సాగుతుంది. నిషేధిత జాబితా నుంచి ఆస్తులు తొలగించుకోవడానికి దళారులు 30 కమిషన్లు డిమాండ్ చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. 22ంపై తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. దీనిపై వెంటనే స్వతంత్ర విచారణకు రేవంత్ ప్రభుత్వం ఆదేశించాలి. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదు అని లేఖలో పేర్కొన్నారు.

# 22ఏ నిషేధిత జాబితా ఆధారంగా దోపిడీ

**హైదరాబాద్, ఆగస్టు 20 (సింగిడి)**

తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల జాబితా ఆధారంగా భారీ భూదందాలు, దోపిడీ జరుగుతున్నాయని ఆరోపిస్తూ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. 22ఏ భూముల విషయంలో తప్పులు జరిగాయని ఒప్పుకుని మంత్రి క్షమాపణలు చెప్పడంపై లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం అధికారులపై నెపం తోసి తప్పించుకోలేరని, ఎవరి ఆదేశాల మేరకు లక్షలాది మంది ప్రజల భూములను నిషేధిత జాబితాలో పెట్టారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 22ఏ భూముల కేటాయింపులు, తొలగింపుల్లో వేల కోట్ల రూపాయల దందాలు జరుగుతున్నాయని, దీనిపై సీబీఐతో విచారణ జరిపించాలని కోరారు. ఈ అంశంపై కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలు జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సైతం 22ఏ జాబితాపై బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారని లక్ష్మణ్ గుర్తుచేశారు. ఏకంగా సీఎం రేవంత్ రెడ్డి నివాసం ఉండే ప్రాంతాన్ని కూడా ఈ నిషేధిత జాబితాలోకి చేర్చారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో 22 లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో ఉంటే, కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా కోటి ఎకరాలను ఈ పరిధిలోకి తెచ్చిందని ఆరోపించారు. ప్రభుత్వం ప్రజల ఆస్తులను కాపాడటంలో విఫలమైందని, కాంగ్రెస్ పాలన రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మారిందని మండిపడ్డారు.

# 22ఏ సమస్యపై ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం




విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి గారు స్పష్టం చేశారు. నిజమైన హక్కుదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. 22ఏ ఫిర్యాదులకు సంబంధించి ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు వస్తున్న కాల్స్, వాటి పరిష్కారం, ఏయే సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి, వచ్చిన కాల్స్‌కు ఎలాంటి సమాచారం అందిస్తున్నారు తదితర అంశాలపై బుధవారం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి గారు సమీక్షించారు. నాలుగు జిల్లాల్లో 22ఏ అంశంపై ప్రస్తుత పరిస్థితి, దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సుమారు 400 కాల్స్ వచ్చినట్లు ఈ సందర్భంగా అధికారులు మంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేసి వదిలేయకుండా, దరఖాస్తుదారుడి పూర్తి వివరాలను ఎప్పటికపుడు సంబంధిత తహసీల్దార్, ఆర్డీవో, సబ్‌రిజిస్ట్రార్‌తదితర అధికారులకు పంపించాలని ఆదేశించారు. ఆ సమస్య పరిష్కారమయ్యే వరకు దాని పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. Ö్ఞాల్ సెంటర్ నుంచి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు స్వీకరించిన అధికారులు తక్షణమే స్పందించాలని ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదుపై నిజానిజాలను నిర్ధారించి, దరఖాస్తుదారు పేర్కొన్న సమస్య వాస్తవమా భూమి 22ఏ జాబితాలోకి ఎందుకు వచ్చింది దరఖాస్తుదారుడికి అర్హత ఉందా అనే అంశాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. పరిశీలన అనంతరం స్పష్టమైన కారణాలతో నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యను చెప్పిన తర్వాత పరిష్కారం కోసం మళ్లీ మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఇప్పటికే సబ్‌రిజిస్ట్రార్లు తహసీల్దార్లు, ఆర్డీవోలు, కలెక్టర్ల స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులతో పాటు, గడచిన రెండు మూడు రోజుల్లో కొత్తగా వచ్చిన దరఖాస్తులను కూడా వెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఇకపై కొత్తగా వచ్చే దరఖాస్తులు పెండింగ్‌లో పేరుకుపోకుండా ఎప్పటికపుడు పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. 2ఏ సమస్య పరిష్కారాన్ని ప్రత్యేక టాస్క్‌గా తీసుకుని అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేయాలని మంత్రి ఆదేశించారు. రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన వ్యక్తి తన సమస్య పరిష్కారమవుతుందనే నమ్మకంతో బయటకు వెళ్లాలి. వచ్చిన దరఖాస్తును మరో కార్యాలయానికి పంపించి చేతులు దులుపుకోకండి. చివరి వరకు పర్యవేక్షించండి. మీ పనితీరుతో ప్రజల అభిమానాన్ని చూరగొనండి' అని అధికారులకు సూచించారు. అధికారులు సొంత నిర్ణయాలతో ప్రజలకు ఇబ్బంది కలిగించకూడదని, ప్రభుత్వ ఆలోచనలు, విధానాలకు అనుగుణంగా పనిచేయాలని

# మార్గదర్శికి సుప్రీంలో భారీ ఊరట

## ఉండవల్లి పిటిషన్ కొట్టివేత

**న్యూఢిల్లీ, ఆగస్టు 20 (సింగిడి)**



ఈనాడు గ్రూప్ నకు చెందిన మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసులో ఆ సంస్థకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం కొట్టివేసింది. ఈ కేసులో ప్రజా ప్రయోజనం ఏమీ కనిపించడం లేదని, ఇది వ్యక్తిగత వివాదంలా ఉందని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ మేరకు జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ప్రసన్న బి. వరాలేలతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

### విచారణలో వాదనలు, కోర్టు వ్యాఖ్యలు

గురువారం ఈ పిటిషన్‌పై తుది విచారణ సందర్భంగా మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ్ లూథ్రా, నాగముత్తు వాదనలు వినిపించారు. డిపాజిటర్లకు ఇప్పటివరకు రూ.2,500 కోట్లు చెల్లించామని, క్లెయిమ్ చేయని రూ.5.23 కోట్లను ఎస్క్రో అకౌంట్‌లో ఉంచామని వారు కోర్టుకు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారమే పబ్లిక్ నోటీసు జారీ చేసి, సెటిల్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేశామని వివరించారు.
ఈ సమయంలో ధర్మాసనం పిటిషనర్ ఉండవల్లి అరుణ్ కుమార్‌ను ఉద్దేశించి పలు కీలక ప్రశ్నలు సంధించింది. "ఈ పిటిషన్ వేసి, పోరాడటానికి మీరెవరు?" అని ప్రశ్నించింది. "ఈ కేసు వివరాలు పరిశీలిస్తే ఇది పూర్తిగా వ్యక్తిగత వివాదంలా కనిపిస్తోంది. ఇందులో ఎలాంటి ప్రజా ప్రయోజనం మాకు కనిపించడం లేదు. మీరు వాదించే కొద్దీ మీపైనే అనుమానాలు పెరుగుతున్నాయి" అని జస్టిస్ సుందరేశ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత ధర్మాసనం ఉండవల్లి పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది.

### కేసు నేపథ్యం, తాజా పరిణామాలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయాంలో 2008లో మార్గదర్శి ఫైనాన్షియర్స్ సంస్థ ఆర్‌బీఐ నిబంధనలు ఉల్లంఘించి డిపాజిట్లు సేకరించిందనే ఆరోపణలతో క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఈ కేసులపై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు, 2025 ఆగస్టులో ఆ క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను కొట్టివేసింది. డిపాజిటర్లకు డబ్బులు తిరిగి చెల్లించడం, సంస్థ ఛైర్మన్ రామోజీ రావు మరణం వంటి పరిణామాల నేపథ్యంలో కేసును కొనసాగించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.
తెలంగాణ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఉండవల్లి అరుణ్ కుమార్ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా సుప్రీంకోర్టు ఈ పిటిషన్‌ను కొట్టివేయడంతో తెలంగాణ హైకోర్టు తీర్పునకు ఆమోదం లభించినట్లయింది. దీంతో మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై దశాబ్దాలుగా నడుస్తున్న క్రిమినల్ కేసులకు పూర్తిగా ముగింపు పలికినట్లయింది.

# పిల్లలపై ఎలాంటి ఒత్తిడి పడకూడదు

**న్యూఢిల్లీ, ఆగస్టు 20 (సింగిడి)**

సీబీఎస్ఈ త్రిభాషా విధానంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ విధానం వల్ల పిల్లలపై ఎలాంటి ఒత్తిడి పడకూడదని పేర్కొంది. 9వ తరగతి విద్యార్థులు మూడు భాషలను అభ్యసించడాన్ని తప్పనిసరి చేస్తూ సీబీఎస్ఈ తీసుకొచ్చిన విధానం వల్ల తలెత్తే సమస్యలకు పరిష్కారం కనుగొనాల్సిన అవసరాన్ని ప్రస్తావించింది. త్రిభాషా విధానాన్ని ప్రవేశపెట్టడంలో తప్పు లేదని, అయితే దానిని అమలు చేస్తున్న తీరుపైనే పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేశారని తెలిపింది. ఈ మేరకు సీజేఐ జస్టిస్ సూర్య కాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి. మోహనాలతో కూడిన సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది.
"త్రిభాషా విధానంపై విద్యార్థులకు ఉన్న సమస్యలలో కొన్నింటిని పునఃపరిశీలించాలి. ఎప్పటికైనా త్రిభాషా విధానాన్ని ప్రవేశపెట్టాల్సిందేనన్న విషయంలో ఎలాంటి సందేహం లేదు. అందులో తప్పు కూడా ఏమీ లేదు. కానీ త్రిభాషా విధానం అమలులో ఎదురవుతున్న ఆటంకాలు, సమస్యలకు పరిష్కారం కనుక్కోవడంపై దృష్టి సారించాలి. అందుబాటులో ఉన్న భాషా ఎంపికలకు సంబంధించి తగిన మానవ వనరుల వ్యవస్థను ఎలా నిర్మించాలనేది పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలలో ఒకటి. ఒకవేళ ఆరో తరగతిని త్రిభాషా విధానానికి ప్రారంభ దశగా ఎంచుకున్నట్లయితే ఈ ఏడాది ఆరో క్లాస్ విద్యార్థులకు కొంత వెసులుబాటు కల్పించాలి. వచ్చే ఏడాది నుంచి త్రిభాషా విధానాన్ని ప్రవేశపెట్టాలి. అంతేకాకుండా ఈ విధానాన్ని అసలు 6వ తరగతి నుంచి ప్రారంభించాలా? లేక ప్రాథమిక స్థాయిలోనే 3 లేదా 4వ తరగతి నుంచే అమలు చేయాలా? అనే విషయాన్ని కూడా పునరాలోచించాలి." అని కేంద్రం తరపున వాదిస్తున్న అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటికు ధర్మాసనం తెలిపింది. ఇంగ్లీష్‌ను మాతృభాషగా పరిగణించాలా? విదేశీ భాషగా పరిగణించాలా? అనేది కూడా ఒక ఆందోళనకరమైన అంశమని సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. భారత ప్రభుత్వం తరపున, సీబీఎస్ఈతో పాటు ఇతర విద్యా బోర్డులలో ఏం జరుగుతుందో కూడా మీరు (కేంద్రం తరఫున వాదిస్తున్న ఐశ్వర్య భాటినుద్దేశించి) గమనించాలని కోరింది. సీబీఎస్ఈ త్రిభాషా విధానం అమలు సముచితంగా జరిగేలా చూసుకోవాలని సూచించింది. ఈ విషయంలో పిల్లలపై ఎలాంటి ఒత్తిడి పడాలని తాము కోరుకోవడం లేదన్నారు. జులై 1 నుంచి 9వ తరగతి విద్యార్థులు రెండు భారతీయ భాషలతో సహా మొత్తం మూడు భాషలను తప్పనిసరిగా అభ్యసించాలన్న సీబీఎస్ఈ విధానాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై అత్యున్నత న్యాయస్థానం గురువారం విచారణ చేపట్టింది.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం
21-8-2026



# విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- రూ.47.50 లక్షలతో పాఠశాల ప్రహరీ, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన
- ఖాజిపల్లిలో రూ.13 లక్షలతో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల ప్రారంభం
- కెమ్ టెక్ పరిశ్రమ యాజమాన్యానికి కృతజ్ఞతలు



**పటాన్చెరు, ఆగస్టు 20 (సింగిడి):** విద్యా మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజల భద్రతకు పెద్దపీట వేస్తున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని మంత్రికుంట, చెట్లపోతారం ప్రాంతాల్లో రూ. 47.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పాఠశాల ప్రహరీ గోడ, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు గురువారం ఉదయం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించ డంతో పాటు విద్యా ప్రమాణాల పెంపునకు అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఖాజిపల్లి గ్రామంలో రూ. 13 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను ఎమ్మెల్యే ప్రారంభించారు. సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా ప్రజల భద్రత మరింత మెరుగుపడటంతో పాటు నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధి పనులు, సీసీ కెమెరాల ఏర్పాటుకు అవసరమైన నిధులను కేటాయించిన కెమ్ టెక్ పరిశ్రమ యాజమాన్యానికి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా స్థానిక ప్రాంతాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం తో పాటు పరిశ్రమల సహకారంతో ప్రజలకు మరింత మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో గడ్డపోతారం మున్సిపల్ చైర్మన్ సుష్మ గణేష్, వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, మండల విద్యాశాఖ అధికారి విజయ్ కుమార్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నర్సింహ, ప్రకాష్ చారి, సురేందర్ గౌడ్, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఆధునిక సాంకేతిక విప్లవానికి ఆద్యుడు రాజీవ్‌గాంధీ

దేశం కోసం ప్రాణాలర్పించిన ఘనత ఆ మహనీయుడి సొంతం
నీలం మధు ముదిరాజ్
చిట్కుల్ లో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**పటాన్చెరు, ఆగస్టు 20 (సింగిడి):** ఆధునిక సాంకేతిక విప్లవానికి ఆద్యుడు, టెలికాం రంగంలో సరికొత్త సంస్కరణలు తెచ్చి భారత దేశాన్ని టెక్నాలజీలో పరుగులు పెట్టించిన మహా ఘనత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి దక్కుతుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. మంగళవారం రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని చిట్కుల్ లోని ఎన్ఎంఆర్ క్యాంపు కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ భారతదేశంలో డిజిటల్ విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీ అని అన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీకి పెద్దపీట వేస్తూ పలు సంస్కరణలు తీసుకొని వచ్చి సాంకేతిక విప్లవాన్ని అభివృద్ధి దిశగా నడిపించారని కొనియాడారు. సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధి కోసం విమానయానం టెలి కమ్యూనికేషన్ కంప్యూటర్ల ఉత్పత్తులపై పన్నులు తగ్గించి ఆ రంగాన్ని ప్రోత్సహించాడని తెలిపారు. ఆ మహనీయుడు ప్రవేశపెట్టిన ఆ సంస్కరణలతోనే ప్రస్తుతం దేశం టెక్నాలజీలో ముందుకు దూసుకుపోతుందని వివరించారు. దేశాన్ని మరింత అభివృద్ధి దిశగా నడిపించే ప్రయత్నంలో దేశం కోసం ప్రాణాలర్పించిన ఘనత ఆ మహనీయుడి సొంతమన్నారు. భారత దేశ అభివృద్ధికి ఆయన ప్రవేశపెట్టిన సంస్కరణలు చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. ఆ మహానుభావుడిని ఆదర్శంగా తీసుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణని ప్రపంచంలో అభివృద్ధి లో మేటిగా నిలిపేందుకు కృషి చేస్తున్నాడన్నారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సంగన్నగారి గోపాల్, దస్తగిరి, మన్నే రాఘవేంద్ర, నారాయణదాసు, సంపత్, నాయకులు అశోక్, శ్రీనివాస్, వీరేష్, అనిల్, రాజ్ కుమార్, కాంగ్రెస్ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

# తాపీ మేస్త్రీల సంక్షేమానికి అండగా ఉంటా..

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**అల్వాల్, ఆగస్టు 20 (సింగిడి):** భవన నిర్మాణ రంగంలో తాపీ మేస్త్రీలు, చేస్తున్న కృషి ఎంతో విలువైందని వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. వెంకటాపురండివిజన్‌లోని కనాజిగూడ టెలికం కాలనీలో "ఓం శ్రీ సాయి తాపీ మేస్త్రీ వర్కర్స్ అసోసియేషన్" ఆధ్వర్యంలో నిర్వహించిన గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమానికి మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై తాపీ మేస్త్రీలకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో తాపీ మేస్త్రీలు, కార్మికులు చేస్తున్న కృషి ఎంతో విలువైనదని అన్నారు. సమాజానికి అవసరమైన అందమైన భవనాలు, నిర్మాణాలను తీర్చిదిద్దడంలో భవన నిర్మాణ కార్మికుల పాత్ర కీలకమని, వారి శ్రమను ప్రతి ఒక్కరూ గౌరవించాలని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి భవన నిర్మాణ కార్మికుడు లేబర్ కార్డు తప్పనిసరిగా పొందాలని ఎమ్మెల్యే సూచించారు. లేబర్ కార్డు ద్వారా ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలు, ప్రయోజనాలను కార్మికులు పొందవచ్చని తెలిపారు. లేబర్ కార్డు పొందేందుకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తానని, అర్హులైన ప్రతి కార్మికుడు లేబర్ కార్డు పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్మికులకు వైద్యపరమైన అవసరాలు ఏర్పడినప్పుడు తన అరుంధతి ఆసుపత్రి ద్వారా ఉచిత వైద్య సేవలు పొందవచ్చని ఎమ్మెల్యే మర్రి తెలిపారు. కార్మికుల ఆరోగ్యం, సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, బీఆర్ఎస్ నాయకులు అనిల్ కిషోర్ గౌడ్, నేమూరి శ్రీధర్ గౌడ్, శ్రీనివాసులు, సురేష్, భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర అధ్యక్షుడు కామల్ల ఐలన్న, గ్రేటర్ అధ్యక్షుడు వెంకటయ్య, ఓం శ్రీ సాయి తాపీ మేస్త్రీ వర్కర్స్ అసోసియేషన్ చైర్మన్ పెద్ది నరసింహ, వైస్ చైర్మన్ వెంకట్రావు, ప్రెసిడెంట్ రాఘవులు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు కాంతారెడ్డి, జాయింట్ సెక్రటరీ ఆదాం, ఆర్గనైజింగ్ సెక్రటరీ మాల్యాద్రి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తాపీ మేస్త్రీ సంఘ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ మోసీన్, జనార్ధన్, ప్రభాకర్, ప్రకాష్ గౌడ్, కన్నా, వీరేశం, సురేష్ రెడ్డి, పవన్, రేవంత్ రెడ్డి, రమణారెడ్డి, అమృత, రమాదేవి, సరిత, శ్యామల, ప్రసన్న, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కలిసిన పరిగి ఎమ్మెల్యే



**వికారాబాద్, ఆగస్టు 20 (సింగిడి):** అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ని పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (సర్ ) డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి గురువారం న్యూఢిల్లీలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు,సంస్థాగత వ్యవహారాలు, ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్) ప్రక్రియపై ఖర్గే తో ఎమ్మెల్యే చర్చించారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని, రాబోయే రెండు నెలల్లో అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు జాబితాలో ఉండేలా,ఒక్క అర్హుడి ఓటు కూడా పోకుండా క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేస్తామని తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో జరగనున్న క్యాబినెట్ విస్తరణలో తనకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఢిల్లోని రాజవ్ గాంధీ సమాధి వద్ద రామ్మోహన్ రెడ్డి నివాళ్ళు అర్పించారు.

# ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ చేయాలి

- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి




**వికారాబాద్, ఆగస్టు 20(సింగిడి):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నో మ్యాపింగ్, అనమలిస్ ఓటర్లకు భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చట్టసి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. ఓటరు జాబితా, మండలాల వారీగా గుర్తించిన మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలిస్ వివరాలు, నోటీసులు జారీ చేసి చెక్ చేయాలనీ, 7 రోజు లు టైమిచ్చి పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా నో మ్యాపింగ్, అనమలిస్ ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించేందుకు ఎ. ఈ. ఆర్. ఓ. లను కేటాయించి, వారికి కొత్త లాగిన్లు ఏర్పాటు చేసి, ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని, నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ చేసి, నిర్ణీత విధానంలో విచారణ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు, సమగ్ర సర్వే లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, ఎం పి డి ఓ లు, తహసీల్దార్ లు సమన్వయంతో పని చేసి నోటీసుల జారీ, విచారణ ప్రక్రియను నిర్ణత సమయం లో పూర్తి చేయాలనీ, గురువారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశం హాలు నందు నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ చేసి, నిర్ణీత విధానంలో విచారణ నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం చేయూత పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనపై ఎంపీడీఓలతో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సమీక్ష సందర్భంగా తెలిపారు. జిల్లాలో చేయూత పింఛన్ల పంపిణీ, అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు, అలాగే ఇందిరమ్మ ఇళ్ల కోసం అందిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా చేయూత పింఛన్ల పరిస్థితి, కొత్తగా అర్హత పొందిన లబ్ధిదారుల వివరాలు, పెండింగ్ దరఖాస్తులు తదితర అంశాలపై సమీక్షించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలన చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పింఛన్లకు సంబంధించి అర్హత ఉన్నప్పటికీ వివిధ కారణాలతో ప్రయోజనం పొందని వారి వివరాలను గుర్తించి, నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి మండలాల వారీగా అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హత కలిగిన లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించాలని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులో ప్రక్రియను పూర్తి చేయాలని ఎంపీడీఓలకు సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ, అర్హులైన లబ్ధిదారులకు ప్రాధాన్యత కల్పించాలని, దరఖాస్తుల పరిశీలనలో పూర్తి పారదర్శకత పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామస్థాయిలో ప్రజలకు పథకాలపై సరైన సమాచారం అందించి, వారి సందేహాలను నివృత్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ చేయూత పెన్షన్ ల దరఖాస్తు లు, ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తు ల పై మండలం వారీగా జనాభా ను బట్టి ఎన్ని దరఖాస్తు లు వచ్చాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, జడ్ పి సి ఇ ఓ సుధీర్, డి ఆర్ ఓ స్వర్ణలత, ఆర్ డి ఓ వాసు చంద్ర,సంబంధిత జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆక్రమణలకు గురికాకుండా చూస్తాం

హైడ్రా కమిషనర్ రంగనాథ్



**రాజేంద్రనగర్, ఆగస్టు 20(సింగిడి):** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో 'హైడ్రా' ఇటీవల స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ స్థలాలు భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణలకు గురికాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని 'ఫెడరేషన్ ఆఫ్ ఆల్ కాలనీస్' ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఫెడరేషన్ అధ్యక్షుడు అర్వపల్లి వంశీ, తిరుమల హిల్స్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి గురువారం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. మణికొండలోని తిరుమల హిల్స్, వెంకటేశ్వర కాలనీ తదితర ప్రాంతాల్లో ఆక్రమణల నుంచి విడిపించిన భూములను నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్‌ను కోరారు. అంతేకాకుండా, స్వాధీనం చేసుకున్న ఈ స్థలాలను స్థానిక ప్రజలు, పిల్లల ప్రయోజనార్థం రక్షిత పార్కులుగా అభివృద్ధి చేసేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**కమిషనర్ సానుకూల స్పందన**

కాలనీవాసుల విజ్ఞప్తిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ స్థలాల రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన జరిపి నివేదిక ఇవ్వాలని, ఆక్రమణలు జరగకుండా చూడాలని సంబంధిత హైడ్రా సీనియర్ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. అలాగే అక్కడ పార్కు అభివృద్ధి చేసే అంశాన్ని కూడా తప్పకుండా పరిశీలిస్తామని వెల్లడించారు.

# టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్లో ఘనంగా హర్ ఘర్ తిరంగా ఉత్సవం



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 20 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్ నగర్ డివిజన్లోని టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో మన దేశ త్రివర్ణ పతాక ఔన్నత్యాన్ని తెలియజేసే "హర్ ఘర్ తిరంగా" ఉత్సవ్ ఘనంగా నిర్వహిం చారు. భారతదేశ ప్రధాని ఆదేశాల మేరకు యావత్ భారతదేశం జాతీయ జెండా త్రివర్ణ పతాకం ప్రతి ఇంట ఉండాలని, యువతరంలో, విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలనే ఆశయాన్ని పివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఎంచుకున్నది. అందులో భాగంగా టి వి ఆర్ సత్యవాణి, " ఎన్ సి సి క్యాడేట్" విద్యార్థినిలు, ఫస్ట్ ఆఫీసర్ ప్రతిమ రాణి గోషాల్ సారథ్యంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థిని విద్యార్థులచే దేశభక్తి నినాదాలతో వాడవాడలా ప్రతిధ్వనించాయి. 100 మీటర్ల త్రివర్ణ పతాకాన్ని చేత భూనీ సత్యవాణి విద్యానికేతన్ హై స్కూల్ ( ఎస్ ఆర్ నాయక్ నగర్)విద్యార్థిని విద్యార్థులు 200 మంది, టివిఆర్ మోడల్ హై స్కూల్ (అపురూప కాలనీ) 450 మంది విద్యార్థిని విద్యార్థులు, స్కూల్ క్యాబినెట్ విద్యార్థిని విద్యార్థులు 55 మంది , ఎన్ సి సి స్టూడెంట్స్ 75మంది సుమారు 780 మంది కలసి ముక్తకంఠంతో నినదించారు. క్రమశిక్షణతో, దేశభక్తితో భారతీయ సంస్కృతిని కాపాడవలసిన బాధ్యత సమాజానికి గుర్తు చేసే విధంగా తమ వంతు కర్తవ్యం అన్నట్లు విద్యార్థులు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అందులో భాగంగా" దేశ్ కి రక్షా కౌన్ కరేగా -- హమ్ కరింగే హమ్ కరింగే", విజయ్ విశ్వ తిరంగా ప్యారా -- జండా ఉంచా రహే హమారా, మేరా భారత్ మహాన్ అని గర్వంగా చెప్పగలిగే భారతీయుడుగా జీవించాలని నినాదాల ద్వారా సందేశాన్ని ఇస్తూ ఘనంగా జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెడిసిన్ డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి, వెంకట్ రెడ్డి, ప్రిన్సిపల్ జయరాజు, సీనియర్ ఉపాధ్యాయురాలు సుభద్ర, ఎన్ సి సి ఆఫీసర్ ప్రతిమ రాణి ఘోషాల్ ప్రారంభించారు. ఇంత చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించిన అధ్యాపకులను, విద్యార్థిని విద్యార్థులను టి వి ఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టి కోటి రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సూరా రవిచంద్రారెడ్డి , దీప్తిరెడ్డి అభినందించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానిది నిరంకుశ పరిపాలన

- 22ఏ సెక్షన్‌పై సీబీఐ విచారణ జరపాలి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**కూకట్ పల్లి, ఆగస్టు 20 (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వానిది నిరంకుశ పాలన అని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గురువారం కూకట్ పల్లిలోని శేషాద్రి నగర్ క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన తప్ప ఒక్క మంచి పని కూడా చేయలేదని విమర్శించారు. ప్రజల ఆస్తులను 22ఏ సెక్షన్‌లో చేర్చి నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కైతలాపూర్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ శంకుస్థాపన సందర్భంగానే ఈ సమస్యను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు గుర్తుచేశారు. ఇదంతా అధికారుల తప్పిదం వల్లే జరిగిందంటూ ఇప్పుడు మంత్రులు క్షమాపణ చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. ప్రజల ఆస్తులను 22ఏలో చేర్చి, ముడుపులు సమర్పించిన వారికి ఉపశమనం కలిగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని, దీనిపై కచ్చితంగా సీబీఐ విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. కేపీ హెచ్‌బీ పరిధిలోని వసంత్ నగర్, సర్దార్ పటేల్ నగర్, సీబీసీఐడీ కాలనీ, సాయి నగర్ లతో పాటు ఆల్విన్ కాలనీ, తులసి నగర్ తదితర ప్రాంతాల్లో దాదాపు 50 సంవత్సరాలుగా పట్టా భూముల్లో నివసిస్తున్న ప్రజల ఆస్తులను ఏ ప్రాతిపదికన 22ఏలో చేర్చారో ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు. ప్రజా సంక్షేమ పథకాలను పక్కనబెట్టి, చివరికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలను కూడా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన ఫ్లైఓవర్లు, ఆసుపత్రులను ఇప్పుడు ప్రారంభించడం మినహా కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా చేసిందేమీ లేదన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. రాఘవ కన్స్ట్రక్షన్స్ పేరుతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సొంత ప్రయోజనాలు చూసుకుంటున్నారే తప్ప ప్రజల సంక్షేమం పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రజల పక్షాన నిలబడకపోతే, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తీవ్రస్థాయిలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కేంద్రంలోని బీజేపీ మంత్రులు కూడా ఈ అంశంపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, జూపల్లి సత్యనారాయణ, మాధవరం రంగారావు, సీనియర్ నాయకులు తులసీరావ్ తదితరులు పాల్గొన్నారు.

# గురువులకే గురువు నారాయణ గురు



**కూకట్‌పల్లి, ఆగస్టు 20 (సింగిడి):** దయారు గూడలోని అంబేద్కర్ పార్కులో నారాయణ గురు జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జ్ఞానమాల నిర్వహణ కమిటీ సభ్యులు రాజేష్ పాశ్వాన్ పాల్గొని, మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జ్ఞానమాల కన్వీనర్ సింగూరు పాండు మాట్లాడుతూ కేరళ రాష్ట్రానికి చెందిన ప్రముఖ సంఘ సంస్కర్త నారాయణ గురు సమాజంలోని మూఢనమ్మకాలను, కులతత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించారని తెలిపారు. తమ రాష్ట్రంలో గుడులను విజ్ఞాన కేంద్రాలుగా, బడులుగా తీర్చిదిద్ది ఆయన 'గురువులకే గురువయ్యారు' అని కొనియాడారు. ప్రముఖ కవి రవీంద్ర నాథ్ ఠాగూర్ సైతం నారాయణ గురును కలిసిన అనంతరం ఆయనను మించిన లేదా ఆయనతో పోల్చదగిన ఆధ్యాత్మిక వేత్తను నేను ఎన్నడూ చూడలేదని ప్రశంసించారని గుర్తుచేశారు. అంతటి మహనీయుని ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం సభ్యులు బచ్చలి వినోద్ రావు, జ్ఞానమాల నిర్వహణ కమిటీ సభ్యులు పోతురాజు రమేష్, పసులాది రాములు తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతిక విజ్ఞానాభివృద్ధి చేసిన మహనీయుడు దివంగత రాజీవ్‌గాంధీ

- విద్యార్థులతో కలిసి సద్భావన ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 20 (సింగిడి):** భారతదేశ మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ జయంతిని గిరి నగర్ డివిజన్‌కు చెందిన కట్టే శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో ఐడీపీఎల్ చౌరస్తా వద్ద నిర్వహించిన సద్భావన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఆయన అనంతరం వారిని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ వివిధ పాఠశాలలకు చెందిన రెండు వేల పైచిలుకు విద్యార్థిని విద్యార్థులతో నిర్వహించిన సద్భావన ర్యాలీలో పాల్గొ నడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. దేశ అభివృద్ధికి రాజీవ్ గాంధీ అనేక సంస్కరణలు తీసుకువచ్చారని పేర్కొన్నారు. ముఖ్యంగా టెలికమ్యూనికేషన్, కంప్యూటర్ టెక్నాలజీ వంటి ఆధునిక రంగాలకు ప్రాధాన్యతనిస్తూ భారతదేశాన్ని సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్ గాంధీకి దక్కుతుందని శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. యువత దేశ భవిష్యత్తుకు కీలకమని, వారు సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మాజీ ఎమ్మెల్యే బహుమతులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ గుప్తా, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ జై రామ్, రాములు, సత్యనారాయణ, మహేష్ గౌడ్, శివప్రసాద్ యాదవ్, రవికుమార్ గుప్తా , ఉప్పల్ రావు, నరేందర్ గుప్తా, తిరుపతిరెడ్డి, శ్రీనివాసచారి ప్రైవేట్ పాఠశాలల యజమానులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

Editorial

## నామమాత్రాలైన వయోవృద్ధుల సంక్షేమ చట్టాలు

కన్నవారు, తాము పెంచి పెద్ద చేసిన తమ వారు, బంధు బాంధవులు, కడదాక తమకు వెన్నంటి ఉంటారని అనుకుని, అశక్తత ఆవహించిన ముదిమి వయసులో, అందరూ వదిలి వేస్తుండగా, ఒంటరితనం భరించడం భయంకరమైన వేళ... విధి వంచితులైన ఎందరో వయోవృద్ధులు, పడుతున్న బాధలు వర్ణనాతీతం. వయో వృద్ధుల సంక్షేమార్థం చేసిన చట్టాలు, వాటి అమలుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, కాగితాలకే పరిమితమై, ఆచరణకు నోచుకోలేక మృగ్యాలే అవుతున్నాయి. భారత దేశంలో ప్రస్తుతము 15కోట్లమంది వృద్ధులున్నారు. 2050 నాటికి వీరి సంఖ్య 32.3కోట్లకు చేరుతుందని అంచనా. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని వృద్ధుల సంఖ్య అప్పటికి రెండున్నర కోట్లు దాటే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల మంది వయోవృద్ధులు ఉండగా, వీరిలో 10 శాతంకు మించకుండా ఆర్థికంగా, ఆరోగ్యంగా, తమ తమ పిల్లల, బంధువుల వద్ద ఉంటుండగా, మరికొందరు తమ పిల్లలే చేర్పించిన అనాధ శరణాలయాలు, వృద్ధాశ్రమాలలో తమ దుస్థితిని తామే తిట్టు కుంటూ, కాలం వెళ్లదీస్తున్నారు. ఆకలితో అలమటిస్తూ, అనారోగ్యాలకు బలి అవుతూ, నిరాదరణ నీడలో మగ్గుతూ, ఎందరో తమ దుస్థితికి ఆవేదన చెందుతుండటం హృదయ విదారకమై, గుండెలను పిండి వేస్తున్న సచిత్రం సర్వత్రా సాక్షాత్కార మిస్తున్నది. దేశంలో నెలకొన్న పరిస్థితుల వల్ల సామాన్యులకు నానాటికి బతుకు భారము అవుతున్న రోజులివి. అదేక్రమములో వృద్ధుల పట్ల నిరాదరణ కూడా అంతకంతకు ఎక్కువై పోతోంది. దేశాన్ని పాలిస్తోంది ప్రధానంగా వృద్ధనేతలే అయినప్పటికీ వయోవృద్ధుల సమస్యలకు పరిష్కారం కనబడక పోవడము అసలైన విషాదం. దేశంలోని ప్రతి అయిదుగురి వృద్ధుల్లో ఒకరు ఒంటరిగా జీవిస్తున్నారు. ముగ్గురిలో ఒకరు వేదింపులకు గురవుతున్నారు. 'హెల్పేజ్ ఇండియా' అధ్యయనం నిగ్గుతేల్చిన విషయమిది. వృద్ధాప్యంలో కుటుంబ సభ్యులే వృద్ధుల పాలిట శత్రువులుగా మారుతున్నారు. దూషణలకు పాల్పడటమే కాకుండా కొందరు శారీరక హింసకూ పాల్పడు తుండటం పతనమవుతున్న మానవతా విలువలకు నిదర్శనం. వాస్తవానికి వృద్ధులు జాతి సంపద! వారి అనుభవాలు ముందు తరాలకు అమూల్యమైన పాఠాలు. అందుకే పాశ్చాత్య దేశాలు వృద్ధుల సంరక్షణకు దీటైన చట్టాలు రూపొందించాయి. బతికినంత కాలం వృద్ధులను కుటుంబ సభ్యులు ఆదరణతో చూసుకునే విధంగా పటిష్ఠ నిబంధనలు చట్టంలో పొందు పరచారు. అనేక దేశాలు చట్టాలు చేసిన 50 ఏళ్ళ తర్వాత, "తల్లిదండ్రుల, వయో వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007" మన దేశంలో రూపొదించ బడ్డది. ఐతే దీని గురించి ఎలాంటి అవగాహన సదస్సులు నిర్వహించక పోవడం, సదరు చట్టంపై చాలా మందికి అవగాహన లేకపోవడం, సర్వత్రా కనిపిస్తున్నది. జిల్లాస్థాయిలో అప్పిలేట్ ట్రిబ్యునల్ కు జిల్లా కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్. డి. ఓ. నిర్వహణ అధికారులుగా వ్యవహరిస్తారు. వయోవృద్ధుల సంక్షేమానికి ఒక డైరెక్టరేటును ఏర్పరచి తగిన నిధులను ప్రభుత్వం కేటాయించాల్సి ఉంది. జిల్లాలలో సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ లను నెలకొల్పాలి. తల్లిదండ్రుల, వృద్ధుల పోషణ మరియు సంక్షేమ నియమావళి చట్టం 2011 నిబంధనల మేరకు, జిల్లా కేంద్రాలలో అప్పిలేట్ ట్రిబ్యునళ్ళు, డివిజన్ కేంద్రాలలో ట్రిబ్యునళ్ళు ఏర్పాటు చేసి బాధితుల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించాలి. ఇతర రాష్ట్రాలలో రవాణా సంస్థల బస్సులలో, 30 శాతం రాయితీ ఉండగా, తెలంగాణలో ఇప్పటివరకు లేదు. ఇంటి పన్నులో 30% రాయితీ ఆదాయపు పన్ను పూర్తిగా మినహాయింపు ఇవ్వాలి. కళ్ళజోళ్ళు, వినికిడి తదితర పరికరాలు, వీల్ చైర్స్, వాకింగ్ సాధనాలు అందించాలి. వీరి రక్షణ చర్యలు గైకొనాలి. దేవాలయాలలో ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించాలి.

"సమస్యల పరిష్కారానికి స్వచ్ఛంద సంఘాలు" జగిత్యాల జిల్లాలో 80 వేల మంది వయో వయో వృద్ధుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి, సౌకర్యాల కల్పనకు, "ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్" ఏర్పాటయింది. విద్యాధికులు, అనుభవైక వైద్యులైన, ఉద్యోగ సంఘాల సీనియర్ నేత హరి అశోక్ కుమార్ అధ్యక్షతన అసోసియేషన్ సమర్థ వంతంగా నిర్వహించ బడుతున్నది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

# యువత ఆశలు .. ప్రభుత్వ వైఫల్యాలు!

## నిరసనలను అణచివేయడం సరికాదు

దేశాభివృద్ధికి చలనచిత్రం వంటి అత్యంత కీలకమైన శక్తి మన యువత. ప్రతిష్టాత్మకమైన ఎర్రకోట బురుజుల పైనుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రసంగంలో 'వికసిత్ భారత్' సాధనలో యువత పాత్రను ఆకర్షణీయమైన పదజాలంతో కొనియాడారు. అయితే, ఆ శబ్దాల వెనుక దాగి ఉన్న చేదు నిజాలు, క్షేత్రస్థాయిలోని సామాజిక-ఆర్థిక సవాళ్లు మాత్రం తీవ్రమైన ఆందోళనను కలిగిస్తున్నాయి. విద్యా వ్యవస్థలోని వ్యవస్థాగత లోపాలు, పెరుగుతున్న నిరుద్యోగం, ప్రతిష్టాత్మక పోటీ



పరీక్షలలో విచ్చలవిడిగా సాగుతున్న అక్రమాల వల్ల నేటి యువత తీవ్ర నిరాశానిస్పృహల్లో మునిగిపోయింది. ఈ క్లిష్టమైన సమయంలో, ప్రభుత్వం మూల సమస్యలను పరిష్కరించకుండా కేవలం ఉపరితల ప్రకటనలతో సత్యాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేయడం తీవ్రమైన విమర్శలకు దారితీస్తోంది.

యువత నుంచి వ్యక్తమవుతున్న ఆగ్రహాన్ని, నిరసనలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం కొన్ని సంస్కరణలను, హామీలను తెరపైకి తెచ్చింది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారి కోసం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ సౌకర్యం మరియు కోటి మంది యువతకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×) లో శిక్షణ ఇవ్వడం అందులో ప్రధానమైనవిగా కనిపిస్తున్నాయి. కానీ, లోతుగా విశ్లేషిస్తే ఇవి అసలైన సమస్యను పక్కదారి పట్టించే చర్యలుగానే తోస్తున్నాయి. ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల అధిక రుసుముల భారాన్ని తగ్గించే నెపంతో ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ప్రతిపాదన తెచ్చినప్పటికీ, పరీక్షల నిర్వహణలో రోజురోజుకూ క్షీణిస్తున్న విశ్వసనీయతను ఇది పునరుద్ధరించలేకపోతోంది. పేపర్ లీకేజీలు, ముందస్తు కుంభకోణాలు మరియు ఫలితాల ప్రకటనలో అంతులేని జాప్యం ఉన్నంత కాలం ఎన్ని ఉచిత కోచింగ్ కేంద్రాలు అందుబాటులోకి తెచ్చినా విద్యార్థుల భవిష్యత్తుకు ఎలాంటి భద్రతా ఉండదు. అలాగే కృత్రిమ మేధ (ూ×) లో కోటి మందికి శిక్షణ ఇవ్వడం సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచడానికి మేలు చేస్తుందనడంలో సందేహం లేదు. కానీ, ఇప్పటికే విద్యాభ్యాసం పూర్తి చేసుకుని వీధుల్లో ఉన్న కోట్లాది మంది నిరుద్యోగులకు కొత్తగా ఉద్యోగావకాశాలు కల్పించకుండా కేవలం నైపుణ్యాలు పెంచుతామనడం సమస్యను కాలయాపన చేయడమే అవుతుంది. ప్రభుత్వ విభాగాలు, విద్యా సంస్థలపై పౌరులకు ఉండాల్సిన విశ్వాసం రోజురోజుకూ క్షీణిస్తోంది. పోటీ పరీక్షలు అనేవి కోట్ల మంది యువకుల జీవితాలను, వారి కుటుంబాల భవిష్యత్తును నిర్ణయించే కీలకమైన ఘట్టాలు. అలాంటి ప్రజాసంబంధ వ్యవస్థల నిర్వహణలో జరుగుతున్న బాధ్యతా రాహిత్యానికి సంబంధించి ప్రధాని ప్రసంగంలో స్పష్టమైన జవాబుదారీతనం కానీ, వ్యవస్థల పునర్నిర్మాణానికి స్పష్టమైన ప్రణాళిక కానీ లోపించాయి.

ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరులు, ముఖ్యంగా దేశ మార్పును కాంక్షించే యువత, లోపభూయిష్టమైన విధానాలను ప్రశ్నించడం ఒక సహజమైన మరియు రాజ్యాంగబద్ధమైన హక్కు. ఇటీవల కాలంలో పరీక్షల నిర్వహణలో జరుగుతున్న అక్రమ ధోరణులకు వ్యతిరేకంగా విద్యార్థులు రోడ్లపైకి వచ్చి శాంతియుతంగా నిరసన తెలపడం వారి ప్రజాస్వామ్య చైతన్యానికి స్పష్టమైన నిదర్శనం. తమ భవిష్యత్తు నాశనం అవుతోందని ఆవేదనతో గొంతు ఎత్తిన యువతపై "దిమాగీ నక్సల్స్" అని వ్యాఖ్యానించడం లేదా వారి నిరసన వెనుక కుట్రలు ఉన్నాయని చిత్రీకరించడం భావప్రకటనా స్వేచ్ఛను అణచివేయడమే అవుతుంది. నిరసన తెలిపిన ప్రతి ఒక్కరినీ రాజ్యానికి వ్యతిరేకులుగా ముద్ర వేయడం వల్ల ప్రజాస్వామ్య పునాదులే బలహీనపడతాయి. విమర్శలను సానుకూలంగా స్వీకరించి, అవసరమైన సంస్కరణలు చేయాల్సిన బాధ్యత అధికారంలో ఉన్న పాలకులపై ఉంది.

భారతదేశం 2047 నాటికి 'వికసిత్ భారత్'గా మారాలనే సుదూర లక్ష్యం ప్రశంసనీయమే అయినప్పటికీ, వర్తమానంలో ఎదురవుతున్న తీవ్రమైన సవాళ్లను విస్మరించి సుదూర భవిష్యత్తును చూపించడం సరైన వ్యూహం కాజాలదు. 2026 నాటి వర్తమానంలో దేశ యువత అనుభవిస్తున్న నిరుద్యోగిత, మానసిక ఒత్తిడి, విద్యా వ్యవస్థలోని అవినీతికి తక్షణ పరిష్కారాలు చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వాలు కేవలం ఎన్నికల లబ్ధి కోసం డిజిటల్ హామీలు, తాత్కాలిక పథకాలు ప్రకటించడం మానుకోవాలి. పరీక్షా వ్యవస్థల సమగ్ర ప్రక్షాళన, పారదర్శక నియామక ప్రక్రియలు, ఖాళీగా ఉన్న లక్షలాది ప్రభుత్వ పోస్టుల తక్షణ భర్తీ మరియు విద్యా రంగానికి సరైన బడ్జెట్ కేటాయింపులు మాత్రమే ఈ సమస్యలకు అసలైన, శాశ్వత పరిష్కారాలు కాగలవు.

యువతను కేవలం ఓటు బ్యాంకుగా లేదా ఉచిత పథకాల లబ్ధిదారులుగా చూడటం వారి అపరిమిత సామర్థ్యాన్ని తక్కువ చేసి చూపడమే. యువ శక్తి ఏ దేశ పురోగతికైనా అత్యంత బలమైన వెన్నుముక వంటిది. వారి న్యాయమైన ప్రశ్నలకు సరైన జవాబులు చెప్పకుండా, వారి నిరసనలను భయభ్రాంతులకు గురిచేసి అణచివేయాలని చూస్తే, ఆ అసంతృప్తి భవిష్యత్తులో తీవ్రమైన సామాజిక ఉద్రిక్తతలకు దారితీస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం పగటి కలల నుంచి బయటకు వచ్చి, యువతలో సడలిన విశ్వాసాన్ని మళ్లీ పునరుద్ధరించేలా ఆచరణాత్మకమైన, పారదర్శకమైన చర్యలు చేపట్టి తమ బాధ్యతను నిరూపించుకోవాల్సిన తీవ్ర ఆవశ్యకత ఎంతైనా ఉంది.

**వెంక గారి భూమయ్య సీనియర్ జర్నలిస్ట్**
**విశ్లేషణ 9848559863**



# ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం.. ముగింపు ఎక్కడ?

## మంటల్లో మధ్యప్రాచ్యం... ప్రపంచానికి చమురు ముప్పు

మధ్యప్రాచ్యంలో మొదలైన ఇరాన్--ఇజ్రాయెల్--అమెరికా ఘర్షణ ఇప్పుడు కేవలం మూడు దేశాల మధ్య యుద్ధంగా మిగలలేదు. ఆరు నెలలకు చేరువైన ఈ పోరు ప్రపంచ రాజకీయాలు, అంతర్జాతీయ చమురు మార్కెట్, సముద్ర రవాణా, ద్రవ్యోల్బణం, దౌత్య సంబంధాలపై ప్రభావం చూపుతోంది. ఫిబ్రవరిలో అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో మొదలైన యుద్ధం మధ్యలో కాల్పుల విరమణ, చర్చల ప్రయత్నాలు జరిగినా అవి శాశ్వత పరిష్కారాన్ని అందించలేకపోయాయి.

యుద్ధం ఎందుకు ఆగడం లేదు...? ఇరాన్‌కు ప్రధానంగా తన భద్రత, అణు కార్యక్రమం, సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడం కీలకం. అమెరికా మాత్రం ఇరాన్ అణు సామర్థ్యాన్ని నియంత్రించడంతో పాటు, మధ్యప్రాచ్యంలో తన మిత్రదేశాల భద్రతను కాపాడాలని చూస్తోంది. ఇజ్రాయెల్‌కు ఇరాన్ నుంచి ఎదురయ్యే దీర్ఘకాలిక భద్రతా ముప్పును తగ్గించడం ప్రధాన లక్ష్యం. ఇక్కడే మూడు దేశాల ప్రయోజనాలు ఢీకొంటున్నాయి. ఒక దేశం భద్రతగా భావిస్తున్న చర్యను మరో దేశం దాడిగా చూస్తోంది. ఫలితంగా ప్రతి ప్రతిదాడి మరో దాడికి కారణమవుతోంది.

### హోర్ముజ్ జలసంధి... అసలు యుద్ధ కేంద్రం

ప్రస్తుతం అత్యంత ఆందోళన కలిగిస్తున్న అంశం హోర్ముజ్ జలసంధి. ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలకమైన ఈ మార్గంపై ఇరాన్, అమెరికా పరస్పరం భిన్నమైన ప్రకటనలు చేస్తున్నాయి. అమెరికా జలసంధి తెరిచి ఉందని చెబుతుండగా, ఇరాన్ తన నియంత్రణలో ఉందని ప్రకటిస్తోంది. ఈ అనిశ్చితి కారణంగా నౌకా రవాణా గణనీయంగా తగ్గింది. ఇది యుద్ధానికి మించిన ప్రమాదం. హోర్ముజ్‌లో రవాణా తీవ్రంగా దెబ్బతింటే చమురు ధరలు పెరుగుతాయి. దాని ప్రభావం పెట్రోల్, డీజిల్ నుంచి రవాణా ఖర్చులు, ఆహార ధరలు, పరిశ్రమల ఉత్పత్తి వ్యయం వరకు విస్తరిస్తుంది. ఇప్పటికే బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు సుమారు 92 డాలర్లకు చేరువలో ఉంది. వరుసగా నాలుగు సెషన్లుగా ధరలు పెరగడం మార్కెట్లలో ఆందోళనను స్పష్టంగా చూపుతోంది.



### ఇరాన్‌పై ఒత్తిడి పెరుగుతోంది

యుద్ధంతో పాటు ఆర్థిక ఆంక్షలు కూడా ఇరాన్‌పై ఒత్తిడిని పెంచుతున్నాయి. అమెరికా తాజాగా ఇరాన్‌కు ఆర్థిక సహాయం చేసే దేశాలపై కూడా తీవ్ర ఆర్థిక చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అదే సమయంలో యూఏఈ ఇరాన్‌తో వాణిజ్య, ఆర్థిక లావాదేవీలను నిలిపివేయడం పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. అయితే ఆర్థిక ఒత్తిడి పెరిగినంత మాత్రాన ఇరాన్ వెంటనే లొంగిపోతుందని చెప్పలేం. చరిత్ర చెబుతున్న పాఠం ఏమిటంటే---బాహ్య ఒత్తిడి పెరిగినప్పుడు దేశీయ రాజకీయంగా కఠిన వైఖరి మరింత బలపడే అవకాశం ఉంటుంది.

### అమెరికాకు తప్పని యుద్ధం భారశీ

యుద్ధాన్ని సుదీర్ఘంగా కొనసాగించడం ఇరాన్‌కే కాదు, అమెరికాకు కూడా ఖర్చుతో కూడుకున్న వ్యవహారమే. ఆయుధాలు, సైనిక మోహరింపు, నౌకాదళ నిర్వహణ, మిత్రదేశాల రక్షణ... ఇవన్నీ అమెరికా ఖజానాపై భారాన్ని పెంచుతాయి. అంతేకాదు, చమురు ధరలు పెరగడం అమెరికా వినియోగదారులపై కూడా ప్రభావం చూపుతోంది. తాజా =వప్వతీం/×జూంశీం సర్వేలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మద్దతు 33 శాతానికి పడిపోయిందని =వప్వతీం నివేదించింది. యుద్ధం దీర్ఘకాలం కొనసాగుతుందనే అభిప్రాయం అమెరికన్లలో పెరుగుతున్నట్లు సర్వే సూచిస్తోంది.

### ఇజ్రాయెల్‌కు విజయం అంటే ఏమిటి?

ఇజ్రాయెల్ దృష్టిలో ఇరాన్ సైనిక, క్షిపణి, అణు సామర్థ్యాన్ని దీర్ఘకాలికంగా తగ్గించడం ప్రధాన లక్ష్యం. కానీ ఒక దేశ సైనిక సామర్థ్యాన్ని దెబ్బతీయడం, ఆ దేశ వ్యూహాత్మక సామర్థ్యాన్ని పూర్తిగా నిర్మూలించడం రెండూ వేర్వేరు విషయాలు.

ఇరాన్‌కు ప్రత్యక్ష సైనిక బలం మాత్రమే కాదు, ప్రాంతీయ మిత్ర బలగాలు, క్షిపణి సామర్థ్యం, భౌగోళిక స్థానం వంటి వ్యూహాత్మక ఆస్తులు ఉన్నాయి. అందువల్ల యుద్ధభూమిలో విజయం సాధించినా, రాజకీయ పరిష్కారం లేకపోతే దీర్ఘకాలిక భద్రతా సమస్య కొనసాగుతూనే ఉంటుంది.

### అసలు పరిష్కారం యుద్ధరంగంలో కాదు... చర్చల బల్లపైనే

జూన్‌లో కుదిరిన అమెరికా--ఇరాన్ అవగాహన ఒప్పందం 60 రోజుల వ్యవధిలో శాశ్వత పరిష్కారానికి దారితీయాల్సి ఉన్నా, ఆ ప్రయత్నం విఫలమైంది. హోర్ముజ్ తెరవడం, అమెరికా ఆంక్షలు, సైనిక ఉపసంహరణ, ఇరాన్ అణు కార్యక్రమం వంటి అంశాల్లో ఇరు దేశాల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఆగస్టు 18న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అమెరికా--ఇరాన్ మధ్య చర్చలు ప్రస్తుతం జరగడం లేదని, ఎలాంటి చర్చలు షెడ్యూల్ కాలేదని చెప్పారు. మరోవైపు ఇరాన్ కూడా తిరిగి చర్చలకు రావడంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ప్రకటించింది. ఇదే అత్యంత ప్రమాదకర దశ. చర్చలు ఆగిపోవడం, సైనిక చర్యలు కొనసాగడం, హోర్ముజ్‌పై అనిశ్చితి పెరగడం... ఈ మూడు కలిసి యుద్ధాన్ని అదుపు తప్పే పరిస్థితికి తీసుకెళ్లే అవకాశం ఉంది.

### భారత్‌పై దీని ప్రభావం ఏమిటి?

భారత్‌కు మధ్యప్రాచ్య సంక్షోభం చాలా కీలకం. చమురు దిగుమతులపై ఆధారపడే దేశంగా అంతర్జాతీయ క్రూడ్ ధరలు పెరగడం నేరుగా భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. చమురు ధరలు పెరిగితే రవాణా ఖర్చులు పెరుగుతాయి. దాని ప్రభావం కూరగాయలు, నిత్యావసర వస్తువులు, పారిశ్రామిక ఉత్పత్తులు, ఎరువులు, విద్యుత్ తదితర రంగాలపై పడుతుంది. రూపాయి--డాలర్ మారకపు విలువపై కూడా ఒత్తిడి పెరిగే అవకాశం ఉంటుంది.

అదే సమయంలో గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న భారతీయుల భద్రత, సముద్ర వాణిజ్యం, భారతీయ నౌకల రవాణా కూడా కీలక అంశాలే.

ఇక ముందు మూడు మార్గాలు ఈ యుద్ధానికి ముందున్న మార్గాలను మూడు విధాలుగా చూడవచ్చు. మొదటిది: దీర్ఘకాలిక పరిమిత యుద్ధం. ఇరువైపులా దాడులు కొనసాగుతూనే ఉంటాయి. కానీ పూర్తి స్థాయి భూయుద్ధానికి వెళ్లకుండా, క్షిపణులు, డ్రోన్లు, నౌకాదళం, ఆర్థిక ఆంక్షల స్థాయిలో ఘర్షణ కొనసాగవచ్చు.

రెండోది: మళ్లీ దౌత్యానికి అవకాశం. ఒమన్, పాకిస్థాన్ వంటి మధ్యవర్తుల ద్వారా పరోక్ష చర్చలు తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. యుద్ధం ఇరుదేశాల ఆర్థిక వ్యవస్థలను మరింత దెబ్బతీస్తే, చర్చలకు తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు.

మూడోది: ప్రమాదకర విస్తరణ.

హోర్ముజ్‌లో పెద్ద సైనిక ఘర్షణ, అమెరికా స్థావరాలపై భారీ దాడి, ఇజ్రాయెల్‌పై పెద్ద స్థాయి క్షిపణి దాడి లేదా ఇతర దేశాలు ప్రత్యక్షంగా యుద్ధంలోకి రావడం జరిగితే ఈ సంక్షోభం ప్రాంతీయ యుద్ధంగా మారే ప్రమాదం ఉంది.

ఇరాన్‌ను బలహీనపరచడం ద్వారా సమస్యకు ముగింపు వస్తుందని అమెరికా, ఇజ్రాయెల్ భావిస్తే అది ఒక వ్యూహాత్మక అంచనా మాత్రమే. అదే విధంగా అమెరికాను సైనిక ఒత్తిడితో వెనక్కి తగ్గించవచ్చని ఇరాన్ భావించినా అది కూడా ప్రమాదకరమైన లెక్కే.

ఈ యుద్ధంలో నిజమైన విజేత ఎవరూ ఉండకపోవచ్చు. కానీ ఓడిపోయేది మాత్రం మధ్యప్రాచ్య ప్రజలే కాదు... ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కూడా కావచ్చు.

హోర్ముజ్‌లో ఒక్క తప్పు నిర్ణయం చమురు మార్కెట్లను కుదిపేయగలదు. ఒక్క పెద్ద దాడి మరిన్ని దేశాలను యుద్ధంలోకి లాగగలదు. ఒక్క దౌత్య వైఫల్యం నెలల తరబడి కొనసాగుతున్న యుద్ధాన్ని మరింత పొడిగించగలదు.

అందుకే ఇప్పుడు అవసరం మరిన్ని క్షిపణులు కాదు... మరింత బలమైన దౌత్యం.

యుద్ధంలో ఎవరు గెలుస్తారన్న ప్రశ్న కంటే, ఈ యుద్ధాన్ని ప్రపంచం ఎంత త్వరగా ఆపగలదన్నదే అసలు ప్రశ్న.

**ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9440287170.**



# తెలుగు మహిళల హృదయ నేత్రి మాలతీ చందూర్

## నేడు మాలతీ చందూర్ వర్ధంతి

ప్రపంచం గర్వించదగ్గ తెలుగు స్త్రీవాద రచయిత్రి మాలతీ చందూర్. చదువు ఎక్కువగా చదువక పోయినా, తెలుగు భాషకు, తెలుగు మహిళకు పట్టాభిషేకం చేసి, సాహిత్య అకాడమీ బహుమతి గ్రహీతగా గుర్తింపు పొందిన ప్రతిభాశాలి. రచయిత్రిగా, కాలమిస్టుగా, 1950ల నుండి దాదాపు మూడు దశాబ్దాల పాటు తెలుగువారికి ఆమె సుపరిచితం. మాలతీ చందూర్ (1930 – ఆగష్టు 21, 2013) కృష్ణా జిల్లా లోని నూజివీడులో 1930 లో జన్మించారు. ఊర్లో ఉయ్యూరు రాజావారి దివాణం పక్కనే ఎస్‌ఆర్‌ఆర్ పాఠశాలలో 8వ తరగతి వరకు ఎస్‌ఎస్‌ఆర్ పాఠశాలలోనే చదివారు. 8వ తరగతి పూర్తి కాగానే



ఏలూరు వెళ్ళి, అక్కడ వారి మామయ్య (చందూర్) ఇంట్లో ఉండి చదువు కున్నారు. ఏలూరు లోని వల్లూరు సెయింట్ థెరిస్సా స్కూల్లో ఇంగ్లీషు మీడియంలో చేరారు. అప్పుడు చందూర్ గారి ద్వారా డి. కామేశ్వరి, ఆనందా రామం, అరవిందా చారి, సక్కుబాయి వంటి వారితో పరిచయం ఏర్పరుచు కున్నారు. ఏలూరులో వారున్న ఇంటికి దగ్గరగా 'కథావీధి' అనే సాహిత్య పత్రిక ఉండేది. అక్కడికి శ్రీశ్రీ, విశ్వనాథ సత్యనారాయణ, కృష్ణశాస్త్రి, నండూరి సుబ్బారావు, వెంకటచలం, కావలి లక్ష్మీనరసింగం మొదలైన వారు వచ్చేవారు. 1947లో ఆమె, తన మేన మామ ఎన్. ఆర్. చందూర్ రచయిత, జగతి పత్రిక సంపాదకులు)ను వివాహం చేసుకున్నారు. మద్రాసు చేరుకుని, జార్జిటాన్‌లో అద్దె ఇంటిలో ఉంటూ, మద్రాసులో ప్రైవేటుగా ఎస్‌ఎస్‌ఎల్‌సి పూర్తి చేశారు. 1949లో వారి రచనా వ్యాసంగం ప్రారంభించారు. అప్పట్లో రేడియోలో ఆమె రచనలను చదివి వినిపించేవారు. ఆ రోజుల్లో ఎగ్మూర్‌లో ఉన్న రేడియో స్టేషన్‌కు వెళితే ఒక సాహితీ సభకు వెళ్ళిన అనుభూతిని పొందేవారు. అక్కడే ఆచంట జానకిరాం, బుచ్చిబాబు, జనమంచి రామకృష్ణ, పి. వి. రాజమన్నార్, ముని మాణిక్యం నరసింహారావు వంటి వారిని దగ్గరగా గమనించే అవకాశం ఆమెకు కలిగింది. 1952 నుంచి రచనా వ్యాసంగంలో తీరిక లేకుండా గడిపారు. భర్త చందూర్‌ను ఎప్పుడూ "మామయ్య"గానే సంబోధించే మాలతి అన్యోన్య దాంపత్యలో ఆనందాన్ని పొందారు. సంతానం లేని మాలతీ, చందూర్ దంపతులు రచనలే తమ సంతానంగా, సాహితీ ప్రియులే బంధువులుగా గడిపారు. మద్రాసులో తెలుగు సాహితీ సంస్థలకూ, సామాజిక ప్రముఖులకూ పెద్ద దిక్కుగా నిలిచారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ స్థాపించిన 'ఆంధ్ర మహిళా సభ' నిర్వహణలో, అభివృద్ధిలో దంపతులు ప్రధాన పాత్రలు పోషించారు. 1950లలో 'ఆంధ్రప్రభ' వారపత్రికలో 'ప్రమదావనం' పేరిట స్త్రీల కోసం ప్రత్యేకంగా మాలతీ చందూర్‌తో కాలమ్ ప్రారంభించారు. ప్రమదావనం ద్వారా దశాబ్దాల కాలంగా పాఠకులతో ప్రశ్నలు, జవాబులు శీర్షికను విజయ వంతంగా నడుపుతూ, తెలుగు కాలమిస్టుల చరిత్రలో మాలతీ చందూర్ ఓ అరుదైన ఘనత సాధించారు. ఆ శీర్షికలో వంటలు, వార్పులే కాకుండా ఇంగ్లీషు నవలలను పరిచయం చెయ్యటం, విదేశాలలో తిరిగి వచ్చిన వారి చేత వారి అనుభవాలు రాయించటం మొదలైనవి చేశారు. ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చే వారు. ఎప్పుడూ వంటింటికి దూరంగానే గడిపిన మాలతీ చందూర్ రాసిన 'వంటలు – పిండి వంటలు' రచన తెలుగునాట ఎంతో ప్రసిద్ధం. వంటల పుస్తకాలు కొత్తగా పెళ్ళయిన అమ్మాయిలకు ఉపయోగకరంగా ఉండేవి. మాలతీ చందూర్ రాసే "జవాబులు" ఆడవారితో పాటు మగవారు కూడా చదివేవారు. 'జవాబులు' శీర్షిక పేజీలను వారపత్రిక నుండి చించి, పుస్తకాలుగా బైండింగులు చేసి, చాలామంది అపురూపంగా దాచుకొనేవారు. స్వాతి' మాస పత్రిక ప్రారంభ రోజుల నుండి మూడు దశాబ్దాల పైచిలుకుగా 'పాత కెరటాలు' శీర్షిక నిర్వహించారు.

చంపకం – చెద పురుగులు' (1955 సెప్టెంబర్ లో ప్రథమ ముద్రణ) తో ప్రారంభించి, దాదాపు 150కి పైగా కథలు ఆమె రాశారు. మహిళా ప్రధాన నవలలు రాయటమే కాక 300 కు పైగా రచనలను తెలుగులోకి అనువదించారు. ఇవి 'పాత కెరటాలు' శీర్షికన స్వాతి మాసపత్రికలో ప్రచురించారు. నవలా రచయిత్రిగా, మహిళా కాలమిస్టుగా అనేక పురస్కారాలు అందుకొన్నది. 70వ దశకములో కేంద్ర సెన్సారు బోర్డు సభ్యురాలిగా పనిచేశారు.

అందుకోసం తమిళ తమిళ భాష నేర్చుకుని, రెండేళ్లకే అనువాదాలు ప్రారంభించి, ప్రముఖ తమిళ రచయితలు శివశంకరి, జయకాంతన్, ఎన్. ఎ. పార్థసారథి, పుళమై పిత్తన్, సుజాత, కలైంజర్ కరుణానిధి తదితరులు చేసిన తమిళ రచనలను ఆమె తెలుగులోకి అనువదించారు.

భారత స్వాతంత్ర్య సమర కాలంలో జరిగిన ప్రసిద్ధ చీరాల – పేరాల ఉద్యమ నేపథ్యంతో 'వనిత' మాసపత్రికలో ఆమె రాసిన 'హృదయ నేత్రి' నవలకు 1990వ దశకం తొలి రోజుల్లో కలకత్తాలోని 'భారతీయ భాషా పరిషత్' వారి ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డు వరించింది. కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు లభించింది. పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను పొందారు.

2013 ఆగస్టు 21 న చెన్నైలో మాలతీ కన్ను మూసారు. మృతి చెందడానికి ముందు క్యాన్సర్ వ్యాధి గ్రస్తులయ్యారు. మెడికల్ కాలేజీకి ఆమె శరీర దానం చేశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం 21-8-2026

## మానవత్వం చాటుకున్న శ్రీరాములపల్లి గ్రామస్తులు



- సాంప్రదాయ రీతిలో వానరానికి అంత్యక్రియలు

**జమ్మికుంట, ఆగస్టు 20 (సింగిడి):** మానవత్వం మంటగలుస్తున్న ఈ రోజుల్లో బంధాలను బంధుత్వాలను పట్టించుకోకుండా స్వార్థంగా బతుకుతున్న కొంతమందికి కనువిప్పు కలిగేలా శ్రీరాములపల్లి గ్రామస్తులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. ఇల్లంతకుంట మండలంలోని శ్రీరాముల పల్లి గ్రామం లో అనుకోకుండా మరణించిన వానరానికి గ్రామ సర్పంచ్ గుత్తికొండ రమ్య రవి కుమార్ ఆధ్వర్యంలో వానరానికి హిందూ సాంప్రదాయ పద్ధతుల ప్రకారంగా అంత్యక్రియలు నిర్వహించి మనుషుల్లో మానవత్వం ఉందని మరోసారి నిరూపించారు. కట్టుకున్నోడు కన్నవాళ్ళు చనిపోతే కూడా పట్టించుకోని ఈ రోజుల్లో ఒక వానరం అనారోగ్యంతో మృతిచెందితే సాంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించి పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు వంతడుపుల సారయ్య. రాజు కారొబార్ వీరన్న.. గ్రామ పంచాయతీ సిబ్బంది మల్లేష్. ప్రశాంత్ రామారావు గ్రామ ప్రజలు బిక్షపతి లచ్చుమ్మ లింగయ్య నరేష్ కిరణ్ శ్రీనివాస్ సుధాకర్. మహేంద్ర రవి సంజీవయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.

## టెక్నాలజీ అభివృద్ధిలో రాజీవ్‌గాంధీ పాత్ర అభినందనీయం




- కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్
- ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు

**జమ్మికుంట, ఆగస్టు 20 (సింగిడి):** భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి ఉత్సవాన్ని జమ్మికుంట పట్టణ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరి రమేష్ మాట్లాడుతూ దేశాన్ని ఆధునిక అభివృద్ధి పథంలో ముందుకు నడిపేందుకు దూర దృష్టితో ఆలోచించిన మహా నాయకుడు యువ భారత ఆకాంక్షలకు ప్రతినిధి గా నిలిచిన భారతరత్న మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ అని కొనియాడారు. కంప్యూటర్ టెలి కమ్యూనికేషన్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలను ప్రోత్సహిస్తూ భారతదేశాన్ని 21వ శతాబ్దం వైపు నడిపించేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. యువతకు రాజకీయాల్లో భాగస్వామ్యం కల్పించడం గ్రామీణ భారత అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం దేశ ఐక్యత సమగ్ర అభివృద్ధి ఆయన చేసిన సేవలు స్ఫూర్తిదాయకం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు వీరమనేని పరశురామారావు టి పి సి సి ఎగ్జిక్యూటివ్ నెంబర్ సాయిని రవి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి మార్కెట్ డైరెక్టర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిలు కాంగ్రెస్ పొనగంటి రవీందర్ దొడ్డి శ్రీకాంత్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు పొనగంటి మల్లయ్య కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్స్ శ్రీపతి నరేష్ చందా రాజు పొనగంటి విష్ణు దిడ్డి రామ్మోహన్ ఒగ్గు రమేష్ మాచర్ల రాజు కుతాడి తిరుపతి యాట్ల అశోక్ ఎగిత అశోక్ నాయకులు పూదరి శివకుమార్ గౌడ్ శ్రీనివాస్ యాదవ్ బండి పవన్ ఎండి సలీం మార్కెట్ డైరెక్టర్ నాయినేని రాజేశ్వరరావు బొంగోని వీరన్న పూరెల్ల రాకేష్ పిట్టల రమేష్ పంజాల అజయ్ పాత ప్రసాద్ పాతకాల ప్రవీణ్ శ్రీనివాస్ యాదవ్ యం డి సలీం పాషా గుర్రం ప్రవీణ్ చింట ( కుమార్) రాజు కుమార్ పాతకాల ప్రవీణ్ పిడుగు భాగ్యలక్ష్మి నర్సయ్య తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ చర్చ వేదికను విజయవంతం చేయాలి

### తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో ఆగస్టు 20(సింగిడి):** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు అంశంపై ఈ నెల 23న హనుమకొండలోని వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్న బహిరంగ చర్చ వేదికను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ పిలుపునిచ్చారు. గురువారం భూపాలపల్లిలోని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయం 'బాతాల రాజ్ భవన్'లో బహిరంగ చర్చ వేదికకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీక కిరణ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల గుర్తింపు అంశంపై ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు చైర్మన్‌గా ఉద్యమకారుల కమిటీని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 23న ఉదయం 11 గంటలకు బహిరంగ చర్చ వేదిక నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి టీపీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాచమౌని నాగభూషణం అధ్యక్షత వహించనున్నారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ సబావత్ రాములునాయక్, ఉద్యమకారుల కమిటీ సభ్యుడు శోభన్‌రెడ్డి, ప్రొఫెసర్ చింతకింది కాసిం, టీపీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంథని సంజీవరావు, తుడుం దెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, పీకేఎం రాష్ట్ర అధ్యక్షుడు దండం జాను తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని కిరణ్ తెలిపారు. కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామర గట్టయ్య, టీపీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబాస్ పార్వతి, విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు రాదండి దేవేందర్, తెలంగాణ అసంఘటిత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఐత బాపు, తెలంగాణ రైతు పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ దాసరి రమేష్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపల్ రూపరెడ్డికి కొవ్వొత్తులతో ఘన నివాళి




**జమ్మికుంట, ఆగస్టు 20 (సింగిడి):** నల్గొండ జిల్లాలోని కొండమల్లెపల్లి నాగార్జున స్కూల్ ప్రిన్సిపాల్ రూపా రెడ్డి హత్యకు నిరసనగా జమ్మికుంట ట్రస్మా ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణంలోని ఉంటది గాంధీ చౌక్ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్మా అధ్యక్షుడు పుల్లూరి సంపత్ రావు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను అతిగారాభం చేయడం వల్ల విద్యార్థులు చెడిపోతున్నారని చెడు అలవాట్లకు బానిసలుగా మారుతున్నారని పిల్లలను పాఠశాల లో క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్పించకపోతే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతాయని అందుకు నిదర్శనమే నల్గొండ జిల్లా ఘటనని పేర్కొన్నారు. పాఠశాలకు పంపి తల్లిదండ్రులు పిల్లలను వదిలేస్తున్నారని ఇంటికి వచ్చిన తర్వాత పిల్లలు ఏం చేస్తున్నారు వాళ్ళ ప్రవర్తన ఎలా ఉంది అనే విషయంలో తల్లిదండ్రులు పేరెంట్స్ కనిపెట్టుకుంటూ ఉండాలని తెలిపారు. అన్యాయంగా ఒక ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్ రూప రెడ్డి పై దాడి చేసి హత్య చేయడం హేయమైన చర్య అని నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రైవేటు స్కూల్ సిబ్బందిపై దాడులను నివారించే చట్టం తేవాలని ప్రైవేట్ పాఠశాలలగా ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా బాధ్యులు డా. పుల్లూరి సంపత్ రావు, ముసిపట్ల తిరుపతి రెడ్డి, కే.ఎస్. బెన్నీ, ఏనుగు రమణారెడ్డి, గూడూరి రఘుపతి రెడ్డి, ఫాదర్ షారోను రెడ్డి, నాయినేని సుధాకర్ రావు, సిజ్జు జార్జ్ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రెహమాన్ తో పాటు సుమారు ఎనబై మంది టీచర్లు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు బీఎస్పీ పూర్తి మద్దతు

- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె ప్రశాంత్ గౌడ్...
- ఐదో రోజుకు చేరిన నిరసన దీక్ష..
- నల్ల బెలూన్లు ఎగరేసి జర్నలిస్టుల వినూత్న నిరసన...



**జమ్మికుంట, ఆగస్టు 20 (సింగిడి):** హుజూరాబాద్ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధన కోసం సాగుతున్న న్యాయపోరాటం, సామాజిక ఉద్యమానికి బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. హుజూరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద చేపట్టిన శాంతియుత నిరసన దీక్షలు ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరాన్ని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె ప్రశాంత్ గౌడ్,బి ఎస్పీ నాయకులు,ముదిరాజ్ సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు కొలిపాక సమ్మయ్య సందర్శించి జర్నలిస్టుల పోరాటానికి సంఘీభావం తెలిపారు.

**కలిసికట్టుగా పోరాడితేనే హక్కుల సాధన...**
ఈ సందర్భంగా పల్లె ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ.. హక్కుల సాధనకు ఐక్య పోరాటమే ఏకైక మార్గమని స్పష్టం చేశారు. 'చలి చీమలు ఏకమై పెద్ద పామును సైతం అంతమొందించినట్లుగా' జర్నలిస్టులంతా ఏకతాటిపై నిలిచి పోరాడాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల నిరంతర ప్రజాసేవను గుర్తించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా ఈ ప్లాట్లను మంజూరు చేసిందని, ఇవి ఏ ఒక్క రాజకీయ పార్టీయో ఇచ్చినవి కావని గుర్తుచేశారు. రాజకీయ వైషమ్యాలు ఏవైనా ఉంటే ఎన్నికల బరిలో తేల్చుకోవాలే తప్ప, ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన జర్నలిస్టులను ఇబ్బందులకు గురిచేయడం హేయమైన చర్య అని కాంగ్రెస్ నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కలాలకు ఈ దుస్థితి రావడం విచారకరం...**
నిత్యం ప్రజా సమస్యలపై గళమెత్తి, పాలకుల దృష్టికి తీసుకెళ్లే కలాలే నేడు తమ కనీస హక్కుల కోసం రోడ్డెక్కి దీక్షలు చేయాల్సి రావడం బాధాకరమన్నారు. జర్నలిస్టుల న్యాయమైన సమస్యలపై స్పందించని నాయకులు, రాజకీయ పార్టీల వార్తలను పూర్తిగా బహిష్కరించాలని సూచించారు. జర్నలిస్టుల సహాయ నిరాకరణను ఎదుర్కొని ఏ నాయకుడూ రాజకీయంగా మనుగడ సాగించలేరని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ప్రణవ్ కేవలం ముఖ్యమంత్రికి, అధిష్టానానికి శుభాకాంక్షలు తెలపడానికే పరిమితం కాకుండా, ఈ వివాదాన్ని సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

**జర్నలిస్టుల ఉద్యమాన్ని నీరుగార్చే కుట్ర...**
**- కొలిపాక సమ్మయ్య**
ముదిరాజ్ సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు కొలిపాక సమ్మయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేత గూడూరు స్వామి రెడ్డి జర్నలిస్టుల న్యాయమైన ఉద్యమాన్ని నీరుగార్చేందుకు కృత్రిమ ఉద్యమాలను సృష్టిస్తూ పన్నాగం పన్నుతున్నారని మండిపడ్డారు. ఇప్పల నర్సింగాపూర్, దమ్మక్కపేట గ్రామాల ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ, జర్నలిస్టులకు కేటాయించిన స్థలాలు గ్రామానికి చెందినవంటూ వారిలో విషబీజాలు నాటే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గ్రామాల ప్రజలు ఆయన మాయమాటలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

**హోరెత్తిన నినాదాలు.. నల్ల బెలూన్లతో నిరసన...**
ఐదో రోజు నిరసనలో భాగంగా జర్నలిస్టులు ఆకాశంలోకి నల్ల బెలూన్లను ఎగురవేసి వినూత్న రీతిలో తమ నిరసనను వ్యక్తం చేశారు. డప్పు చప్పుళ్లతో కాంగ్రెస్ నేత గూడూరు స్వామి రెడ్డి వైఖరికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ?తక్షణమే జర్నలిస్టుల స్థలాలపై వేసిన కోర్టు కేసును ఉపసంహరించుకోవాలని, "మా స్థలాలు మాకు ఇవ్వాలి.. మా హక్కులు కాపాడాలి" అంటూ నినదించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కళాకారుల ఆటపాటలు, గేయాలు దీక్షా శిబిరంలో పాల్గొన్న వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు, బీఎస్పీ నాయకులు గిన్నారపు మహేందర్, వేల్పుల మల్లేష్, అంబాల ప్రభాకర్,ఇల్లందుల రమేష్, మంద సమ్మయ్య,దొడ్డ సమ్మయ్య,జేఏసీ నాయకులు వేల్పుల రత్నం , చందుపట్ల జనార్ధన్,ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యాబుద్ధులు నేర్పిన గురువుపై ఇంతటి ఘాతుకమా?

**ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్యపై సామాజిక కార్యకర్త శశిధర్ రెడ్డి తీవ్ర ఆవేదన**

**నిందితులకు కఠినశిక్ష విధించాలి..**

**పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టిపెట్టాలి**



**జమ్మికుంట , ఆగస్ట్ 20( సింగిడి ):** నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలోని నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ శ్రీమతి రూపారెడ్డిపై జరిగిన దారుణ హత్య తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని వీణవంక మండలానికి చెందిన సామాజిక కార్యకర్త ఎలుక శశిధర్ రెడ్డి అన్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువునే హతమార్చడం అత్యంత దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జల్సాలు, వ్యసనాల కోసం విద్యార్థులు ఇలాంటి పాశవిక చర్యకు పాల్పడినట్లు వస్తున్న ఆరోపణలు సమాజం మొత్తం తలదించుకునేలా చేస్తున్నాయని అన్నారు. ఈ ఘటన విద్యారంగానికే తీరని మచ్చగా మారిందని పేర్కొంటూ, హత్యకు పాల్పడిన నిందితులను చట్ట ప్రకారం కఠినంగా శిక్షించి, బాధితురాలి కుటుంబానికి తక్షణ న్యాయం చేయాలని శశిధర్ రెడ్డి డిమాండ్ చేశారు.

**పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి**
తల్లిదండ్రులు పిల్లల మార్కులు, ర్యాంకులపైనే కాకుండా వారి ప్రవర్తన, స్నేహాలు, అలవాట్లపై కూడా నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. చిన్నవయసు నుంచే నైతిక విలువలు, బాధ్యత, జీవన నైపుణ్యాలను నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు.

**మత్తు పదార్థాలపై ఉక్కుపాదం**
గంజాయి, ఇతర మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని శశిధర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలు యువతకు చేరకుండా ప్రభుత్వం మరింత కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**పాఠశాలల్లో లైఫ్ స్కిల్స్ విద్య తప్పనిసరి చేయాలి**
పుస్తక జ్ఞానంతో పాటు భావోద్వేగాల నియంత్రణ, సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, మంచి-చెడుల మధ్య విచక్షణ వంటి అంశాలను విద్యార్థులకు బోధించేలా పాఠశాల స్థాయి నుంచే లైఫ్ స్కిల్స్ ఎడ్యుకేషన్‌ను పకడ్బందీగా అమలు చేయాలని శశిధర్ రెడ్డి కోరారు. ఇలాంటి హృదయవిదారక ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వం, విద్యా సంస్థలు, తల్లిదండ్రులు, సమాజం సమష్టిగా బాధ్యత తీసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఇండియన్ బ్యాంక్ కస్టమర్లకు అవగాహన కార్యక్రమం

**సైబర్ నేరాలు, ఖాతాల భద్రత, ఏటీఎం కార్డులు, రుణాలపై అవగాహన**



**జమ్మికుంట, ఆగస్టు 20, (సింగిడి):** జమ్మికుంట పట్టణంలోని ఇండియన్ బ్యాంక్ శాఖ ఆధ్వర్యంలో కస్టమర్లకు గురువారం విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ హరినాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బ్యాంకింగ్ సేవలు, ఖాతాల నిర్వహణ, సైబర్ నేరాల నివారణ, ఏటీఎం కార్డు వినియోగం, వివిధ రకాల రుణాలు, గోల్డ్ లోన్లపై ఖాతాదారులకు వివరించారు.

బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, ఓటీపీ, పాస్‌వర్డ్, సీవీవీ వంటి రహస్య సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు చెప్పకూడదని అధికారులు సూచించారు. బ్యాంకు అధికారులు ఫోన్ ద్వారా ఓటీపీ, పిన్ లేదా పాస్‌వర్డ్ అడగరని, అలాంటి కాల్స్ వస్తే అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయడం, గుర్తుతెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం, బ్యాంకింగ్ వివరాలను తెలియని వ్యక్తులతో పంచుకోవడం వల్ల సైబర్ మోసాలకు గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.

**ఖాతాల భద్రతపై ప్రత్యేక సూచనలు**
ఖాతాదారులు తమ మొబైల్ నంబర్‌ను బ్యాంకు ఖాతాతో అనుసంధానం చేసుకుని లావాదేవీలకు సంబంధించిన సందేశాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ఖాతాలో అనుమానాస్పద లావాదేవీ గుర్తించిన వెంటనే బ్యాంకును సంప్రదించాలని తెలిపారు. ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ వినియోగించే సమయంలో బలమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించాలని, వాటిని ఇతరులతో పంచుకోకూడదని వివరించారు.

**ఏటీఎం కార్డు వినియోగంలో జాగ్రత్తలు**
ఏటీఎం కేంద్రాల్లో నగదు తీసుకునే సమయంలో ఇతర వ్యక్తుల సహాయం తీసుకోవద్దని, పిన్ నమోదు చేసే సమయంలో ఇతరులకు కనిపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏటీఎం కార్డును ఇతరులకు ఇవ్వకూడదని, కార్డు పోయిన వెంటనే బ్యాంకుకు సమాచారం అందించి కార్డును బ్లాక్ చేయించుకోవాలని తెలిపారు. ఏటీఎం కార్డు, పిన్ వివరాలను ఒకే చోట రాసి ఉంచకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. రుణాలు, గోల్డ్ లోన్లపై అవగాహన బ్యాంకు అందిస్తున్న వివిధ రకాల రుణాల గురించి కూడా ఖాతాదారులకు వివరించారు. అవసరానికి అనుగుణంగా రుణాలను తీసుకోవాలని, రుణం తీసుకునే ముందు వడ్డీ రేటు, ప్రాసెసింగ్ ఛార్జీలు, తిరిగి చెల్లింపు కాలపరిమితి, నెలవారీ వాయిదాలు తదితర వివరాలను పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. అదేవిధంగా గోల్డ్ లోన్ సదుపాయం గురించి ఖాతాదారులకు వివరించారు. బంగారు ఆభరణాలను బ్యాంకులో తాకట్టు పెట్టి అర్హతకు అనుగుణంగా రుణం పొందే అవకాశం ఉంటుందని, రుణం తీసుకునే ముందు వడ్డీ, కాలపరిమితి, తిరిగి చెల్లింపు నిబంధనలు, ఇతర ఛార్జీలను స్పష్టంగా తెలుసుకోవాలని సూచించారు. రుణాన్ని నిర్ణీత గడువులో చెల్లించడం ద్వారా అదనపు భారాన్ని నివారించుకోవచ్చని తెలిపారు. 2018లో జమ్మికుంటలో ప్రారంభమైన ఇండియన్ బ్యాంక్ శాఖ ప్రస్తుతం రూ.200 కోట్లకు పైగా ఖాతాల ద్వారా లావాదేవీలు నిర్వహిస్తూ ఖాతాదారులకు సేవలు అందిస్తోందని తెలిపారు. ఖాతాదారులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించడంతో పాటు ఆర్థిక భద్రతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంత్, గణేష్, శ్రీకాంత్, హర్షతో పాటు పలువురు బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

# నేర నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి





- కాళేశ్వరం జోన్ డీఐజీ అంబర్ కిశోర్ ఝా
- కొయ్యూరు, మహాదేవపూర్ పోలీస్ కార్యాలయాల్లో డీఐజీ వార్షిక తనిఖీలు

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, ఆగస్టు 20 (సింగిడి):** వార్షిక తనిఖీల్లో భాగంగా కాళేశ్వరం జోన్ డీఐజీ అంబర్ కిశోర్ ఝా గురువారం భూపాలపల్లి జిల్లాలోని కొయ్యూరు పోలీస్ స్టేషన్, మహాదేవపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాలను సమగ్రంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, డీఐజీకి స్వాగతం పలికారు. తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, మాల్ఖానా, ఆయుధాగారం, వివిధ విభాగాల పనితీరు, సిబ్బంది టర్న్‌అవుట్, క్రమశిక్షణ, యూనిఫాం నిర్వహణ తదితర అంశాలను డీఐజీ పరిశీలించారు. పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి విధి నిర్వహణ, పనితీరు, సంక్షేమానికి సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు. అనంతరం సీసీటీవీ కెమెరాల పనితీరును పరిశీలించి, నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రతను మరింత బలోపేతం చేసేందుకు సీసీటీవీ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించాలని సూచిం చారు. ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన, జవాబుదారీతనంతో కూడిన పోలీస్ సేవలు అందించడం ప్రతి పోలీస్ అధికారి బాధ్యత అని డీఐజీ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, విజిబుల్ పోలీసింగ్, నిఘా పెట్రోలింగ్, కమ్యూనిటీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని సూచించారు. ముఖ్యంగా డిజిటల్ ఫోరెన్సిక్స్, సైబర్ దర్యాప్తు, సోషల్ మీడియా మానిటరింగ్ అంశాల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు. పెండింగ్ కేసులను సకాలంలో పరిష్కరించడంతో పాటు నేరస్తుల కంటే ఒక అడుగు ముందుండేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియంత్రణతో పాటు రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై నిరంతర నిఘా కొనసాగించాలని డీఐజీ ఆదేశించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వేగంగా పరిష్కరించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కొయ్యూరు పోలీస్ స్టేషన్, మహాదేవపూర్ సీఐ కార్యాలయ ఆవరణలో డీఐజీ అంబర్ కిశోర్ ఝా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, కాటారం సీఐ నాగార్జునరావు, మహాదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సేవాలాల్, మేరమయాడి ఆలయ నిర్మాణానికి భూమిపూజ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో ఆగస్టు 20 (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బానోతు వీధి, హనుమాన్‌నగర్‌కు చెందిన స్థానిక లంబాడీ గిరిజనులు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్, గిరిజనుల ఆరాధ్యదైవమైన మేరమయాడి దేవాలయ నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహించారు. ఇరు తండాల పెద్దమనుషులు, మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రసాదం స్వీకరించి, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా తండాల పెద్దలు మాట్లాడుతూ.. దేవాలయ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో పాటు జిల్లా ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ఆలయ నిర్మాణానికి తమవంతు సహాయ సహకారాలు అందించి గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తండా పెద్దలు ఇస్లావత్ రవీందర్, పూజారులు బానోత్ రాజునాయక్, ఇస్లావత్ రాజునాయక్, ఇస్లావత్ దేవన్, అజ్మీర జంపన్న, గుజురోత్ రాజునాయక్, 21వ వార్డు కౌన్సిలర్ ధరావత్ శారద, బానోత్ సేవానాయక్, అజ్మీర రాజునాయక్, బానోత్ రాజునాయక్, నగవత్ ప్రతాప్‌సింగ్, నగవత్ ప్రభాకర్‌తో పాటు పలువురు తండా పెద్దలు, మహిళలు, యువత పాల్గొన్నారు.

## ఉద్యమి సాధకుల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలి



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో ఆగస్టు 20 (సింగిడి):** తెలంగాణ జనసేన పార్టీ ఆధ్వర్యంలో మంచిర్యాల వేదికగా నిర్వహించనున్న ఉద్యమి సాధకుల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని మంథని నియోజకవర్గ జనసేన నాయకులు పిలుపునిచ్చారు. మంథని పట్టణంలోని మహాలక్ష్మి గార్డెన్‌లో మాయ రమేష్ ఆధ్వర్యంలో గురువారం మంథని నియోజకవర్గ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జనసేన పార్టీ జాయినింగ్ కమిటీ సభ్యుడు, పెద్దపెల్లి--ఆదిలాబాద్ పార్లమెంట్ కోఆర్డినేటర్ గొట్టిముక్కల నరేష్‌రెడ్డి, మంథని సంపత్, సైదల శ్రీనివాస్, వీర మహిళ నాయకురాలు జ్యోతి తదితరులు హాజరై నియోజకవర్గ నాయకులకు దిశానిర్దేశం చేశారు. మంచిర్యాల వేదికగా జరగనున్న ఉద్యమి సాధకుల ఆత్మీయ సమావేశానికి జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై ఉద్యమాలు, భవిష్యత్ కార్యాచరణపై నాయకులతో చర్చించారు. అలాగే మంథని మండలంలో ఆత్మీయ సమావేశం విజయవంతానికి మండల కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులుగా విజ్జగిరి రమేష్, పిట్టల రాజేందర్‌లను నియమించారు.

ప్రభాతవన సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం 21-8-2026

# ఫీజు బకాయిల కోసం విద్యార్థుల భారీ ర్యాలీ

- రూ.12 వేల కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు

**కరీంనగర్, ఆగస్టు 20(సింగిడి):** ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో కరీంనగర్‌లో గురువారం భారీ విద్యార్థి ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ చౌక్ నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు వందలాది మంది విద్యార్థులు, బీజేవైఎం నాయకులతో కలిసి 'విద్యార్థి మార్చ్' చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ వద్ద 'ఫీజుల బకాయి--బీజేపీ లడాయి' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థులకు చెల్లించాల్సిన సుమారు రూ. 12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలు విడుదల కాకపోవడంతో కళాశాలలు విద్యార్థుల ధ్రువపత్రాలను నిలిపివేస్తున్నాయని, దీంతో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల విషయంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్




ప్రభుత్వం చేసే దానం కాదని, అది విద్యార్థుల హక్కు అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను విస్మరించిందని, విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. శాంతియుతంగా నిరసన తెలిపే విద్యార్థులపై ఆంక్షలు విధించకుండా పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేయకపోతే విద్యార్థుల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుండే గణేష్ మాట్లాడుతూ విద్యార్థి ర్యాలీ విషయంలో పోలీసులు అతిగా వ్యవహరించి విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలను నోటీసులతో బెదిరించారని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించే వరకు ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బాస సత్యనారాయణ రావు, పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్‌రావు, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరెడ్ల ప్రవీణ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సంగ నరేష్, బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్పొరేటర్లు, వివిధ మోర్చాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్, ఆగస్టు 20,(సింగిడి):** జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, తొలి విడతలో మంజూరైన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గురువారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఎంపీడీవోలు, ఇతర అధికారులతో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో గుడిసెల్లో నివసిస్తున్న 407 మంది పేదలకు ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. వారికి వెంటనే మంజూరు ఉత్తర్వులు అందించి నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి 1,500 ఇళ్లు మంజూరు కానున్న నేపథ్యంలో అర్హులైన లబ్ధిదారుల ప్రతిపాదనలను ఇందిరమ్మ కమిటీల ద్వారా వెంటనే పంపించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో లబ్ధిదారుల ఎంపికపై మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే ప్రతి నియోజకవర్గం నుంచి 500 మంది లబ్ధిదారులకు పైకప్పు మార్పిడి కోసం ప్రభుత్వం రూ. 2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇళ్ల నిర్మాణంలో జాప్యం లేకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచి, లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, గృహ నిర్మాణ శాఖ పీడీ గంగారం, ఎంపీడీవోలు, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత సంఘంలో 35 నామినేషన్లు



**మిర్యాలగూడ ఆగస్టు 20 (సింగిడి):** మిర్యాలగూడ సహకార సంఘం ఎన్నికల్లో మొత్తం 35 నామినేషన్లు స్వీకరించామని ఎన్నికల అధికారి మహ్మద్ అలీ తెలిపారు. బుధవారం చివరి రోజు ఏకంగా 24 నామినేషన్లు దాఖలు అయ్యాయి. మొత్తం జనరల్ కేటగిరీలో 28, మహిళా క్యాటగిరిలో 7 నామినేషన్లు దాఖలు అయ్యాయని, 20వ తారీఖున స్క్రూటీ్ని, 21న నామినేషన్ల విరమణ మరియు గుర్తుల కేటాయింపు, 25న పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

# కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు బీజేపీకి లేదు

- బీజేపీ నేతల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం
- విద్యార్థుల సమస్యలపై మొసలి కన్నీరు కారుస్తున్నారు
- మాజీ సూడా చైర్మన్ కోమిటిరెడ్డి నరేందర్‌రెడ్డి




**కరీంనగర్, ఆగస్టు 20(సింగిడి):** సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గేపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం తన శిబిర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1950లో భారత జాతీయ కాంగ్రెస్ 'వందేమాతరం' గీతాన్ని జాతీయగీతంగా ఆమోదించిందని, 1951లో జనసంఘ్ ఆవిర్భవించగా, 1980లో భారతీయ జనతా పార్టీగా అవతరించిందని పేర్కొన్నారు. స్వాతంత్ర్యోద్యమంతో సంబంధం లేని బీజేపీకి కాంగ్రెస్‌ను, కాంగ్రెస్ నాయకులను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన గాంధీ కుటుంబంపై బురదజల్లే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. సోనియా గాంధీకి రెండుసార్లు ప్రధానమంత్రి అయ్యే అవకాశం వచ్చినా సున్నితంగా తిరస్కరించారని, మల్లికార్జున ఖర్గే నిబద్ధత కలిగిన ప్రజా నాయకుడని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలపై బీజేపీ నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతో బీజేపీ పదేళ్లపాటు సన్నిహితంగా వ్యవహరించిందని, రాష్ట్రంపై రూ. 8 లక్షల కోట్ల అప్పు భారం పెరగడంలో ఆ రెండు పార్టీలదే బాధ్యత అని ఆరోపించారు. అప్పట్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై బీజేపీ ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఏమైందని ప్రశ్నించారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే 70 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని తెలిపారు. సమావేశంలో పర్వతం మల్లేశం, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, కుర్ర పోచయ్య, జీడి రమేష్, ముక్క భాస్కర్, లయక్, మూల కృష్ణారెడ్డి, పెద్దిగారి తిరుపతి, మేకల నర్సయ్య, మామిడి సత్యనారాయణరెడ్డి, తోట అంజయ్య, గుడిపాటి రమణారెడ్డి, షెహెన్షా, ఖలీల్, బత్తుల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబ సభ్యులకు టీపీటీఎల్ఏ పరామర్శ



**జమ్మికుంట, ఆగస్టు 20 (సింగిడి):** జమ్మికుంట పట్టణానికి చెందిన దాసరి రామ్మూర్తి ఇటీవల ట్రైన్ కిందపడి ఆత్మహత్య చేసుకోవడం అందరికి తెలిసిన విషయం. డిష్ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న రామ్మూర్తి వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకోగా రామ్మూర్తి సతీమణి దాసరి సుజాత పట్టణంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. కాగా తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ అసోసియేషన్ సభ్యులు వి జగన్ రామ్మూర్తి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంతేకాకుండా వ్యక్తిగతంగా ఆ కుటుంబానికి తనకు తోచిన విధంగా ఆర్థిక చేయూతను అందించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, టి పి టి ఎల్ ఎ ఆ కుటుంబానికి అండగా ఉంటుందని భవిష్యత్తులో టిపిటిఎల్ఏ నుండి మరింత సహాయం అందించడానికి ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. రామ్మూర్తి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు అండగా ఉండాలని ఆ దేవుడిని వేడుకుంటున్నట్లు తెలిపారు.

## బంజారాల సంస్కృతికి ప్రతీక తీజ్ పండుగ

### డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు



**కరీంనగర్, ఆగస్టు 20,(సింగిడి):** బంజారా సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానానికి తీజ్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. ప్రకృతిని దైవంగా భావించి ఆరాధించే తీజ్ పండుగ తెలంగాణ విశిష్ట సంస్కృతికి అద్దం పడుతుందని పేర్కొన్నారు. కరీంనగర్‌లోని కోతిరాంపూర్, చింతకుంట ప్రాంతాల్లో నిర్వహించిన తీజ్ వేడుకల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, యాదగిరి సునీల్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గోధుమ మొలకల నారు పందిరి వద్ద సంప్రదాయబద్ధంగా కొబ్బరికాయ కొట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లంబాడీ మహిళలతో కలిసి సునీల్‌రావు నృత్యాల్లో పాల్గొని ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను, సంస్కృతిని భావితరాలకు అందిస్తూ ప్రకృతిని ఆరాధించడం అభినందనీయమని ఆయన అన్నారు. గిరిజన సోదర సోదరీమణులకు తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో పలువురు కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు, తీజ్ ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక లంబాడీ గిరిజనులు, డివిజన్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హెచ్‌సీఏ వన్డే టోర్నీకి కోదాడ క్రీడాకారుడి ఎంపిక



**కోదాడ,ఆగస్టు 20 (సింగిడి):** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నిర్వహిం చనున్న సి-డివిజన్ వన్డే లీగ్ కమ్ నాకౌట్ టోర్నీకి ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టులో కోదాడ క్రికెట్ అకాడమీ క్రీడాకారుడు గొర్రె చాణిక్య ఎంపిక య్యాడు. చిన్న వయసు నుంచే క్రికెట్‌పై ఆసక్తితో శిక్షణ పొందుతున్న చాణిక్య ప్రతిభను గుర్తించి జిల్లా జట్టుకు ఎంపిక చేయడం పట్ల అకాడమీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అకాడమీ కోచ్ షేక్ సిద్ధిఖ్ చాణిక్యను అభినందించి, టోర్నీలో రాణించి కోదాడకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా జట్టుకు ఎంపిక కావడం కోదాడ క్రికెట్ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. చాణిక్య మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కోదాడ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

## బీఆర్ఎస్‌లో చేరికలు




**నల్లగొండ ప్రతినిధి ఆగస్టు 20 (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని, అందుకే బీఆర్ఎస్‌లోకి వలసలు ప్రారంభమయ్యాయని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నల్లగొండ మండలం చందన పల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సుమారు 200 మంది మాజీ సర్పంచ్ సురిగి మణెమ్మ రమేష్, మాజీ ఎంపీటీసీ పెద్ది వెంకటయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. కంచర్ల భూపాల్‌రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సాధించిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రస్తుతం ప్రజలకు అందడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన అభివృద్ధి పనులకు ప్రస్తుత పాలకులు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తూ తమ ఖాతాలో వేసుకుంటున్నారని విమర్శించారు. మర్రిగూడ బైపాస్ రహదారి పనుల విషయంలోనూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారం జరుగుతోందని ఆరోపించారు. నల్లగొండ అభివృద్ధికి అదనంగా రూ. 1,000 కోట్లు మంజూరు చేయించాలని మంత్రి ని డిమాండ్ చేశారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను అర్థం చేసుకున్నారని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ఇటీవల ధర్వేశిపురం, తాజాగా చందనపల్లి నుంచి పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరికలు జరగడం ప్రజల్లో మార్పుకు సంకేతమని కంచర్ల పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడేలా పార్టీ శ్రేణులు ప్రజలతో మమేకమై పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో కటికం సత్తయ్యగౌడ్, దేప వెంకట్‌రెడ్డి, బోనగిరి దేవేందర్, నారాబోయిన బిక్షం, తుమ్మల లింగస్వామి, ధోటి శ్రీనివాస్, మేకల పల్లవి అరవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

# 'బాబు' అనే ఒక్క మాటతో వీడిన హత్య మిస్టరీ

- పాఠాలు చెప్పిన టీచర్‌ను హతమార్చిన విద్యార్థులు
- రూ.1.54 లక్షల నగదు, ఐఫోన్, కత్తి, సెల్‌ఫోన్లు స్వాధీనం
- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్




**నల్లగొండ ప్రతినిధి ఆగస్టు 20 (సింగిడి):** నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ కల్లు రూపారెడ్డి హత్య అదే పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు బాలురు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. 'బాబు' అనే ఒక్క మాట ఆధారంగా దర్యాప్తును ముందుకు తీసుకెళ్లిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నామని జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవార్ తెలిపారు. స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవరకొండ డీఎస్పీ ఆధ్వర్యంలో ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఫోరెన్సిక్ ఆధారాలు, ఫింగర్‌ప్రింట్లు, డాగ్‌స్క్వాడ్, సీసీ కెమెరా ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, అనుమానితుల కదలికలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. హత్య జరిగిన ప్రాంతంతో పాటు సుమారు 30 కిలోమీటర్ల పరిధిలోని దాదాపు 70 సీసీ కెమెరాల ఫుటేజీలను రాత్రింబవళ్లు విశ్లేషించారు. సుమారు 40 మంది పోలీసు అధికారులు, సిబ్బంది కలిసి 80 మందికి పైగా అనుమానితులను విచారించారు. 'బాబు' మాటతో కీలక మలుపుహత్యకు ముందు రూపారెడ్డి తన చిన్నమ్మతో ఫోన్‌లో మాట్లాడుతున్న సమయంలో చివరిగా 'బాబు' అని పలికినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో ఆ మాట ఎవరిని ఉద్దేశించి చెప్పారనే కోణంలో విచారణ చేపట్టారు. రూపారెడ్డి పాఠశాల విద్యార్థులను సాధారణంగా 'బాబు' అని పిలిచేవారని తెలుసుకున్న పోలీసులు దర్యాప్తును విద్యార్థుల వైపు మళ్లించారు. పాఠశాలకు ఆరు రోజులపాటు సెలవులు ప్రకటించడంతో విద్యార్థుల విచారణలో కొంత ఆలస్యం జరిగింది. పాఠశాల పునఃప్రారంభమైన తర్వాత విద్యార్థులను ఒక్కొక్కరినీ విచారించారు. ఈ క్రమంలో రెండు రోజులుగా పాఠశాలకు హాజరుకాని కొందరు విద్యార్థులపై ప్రత్యేక నిఘా పెట్టారు. వారిలో ఇద్దరు విద్యార్థుల కదలికలు, సీసీ కెమెరా దృశ్యాలు అనుమానాస్పదంగా ఉండటంతో పోలీసులు వారిపై దృష్టి సారించారు. బుధవారం ఉదయం 11.30 గంటల సమయంలో పెండ్లిపాకల 'ఎక్స్' రోడ్డు నుంచి మల్లేపల్లి వైపు వస్తున్న ఇద్దరు పదో తరగతి విద్యార్థులను దొనియాల 'ఎక్స్' రోడ్డు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. తనిఖీల్లో వారి వద్ద దాచిన సుమారు రూ. 1.54 లక్షల నగదు లభించింది. స్వాధీనం చేసుకున్న రూ. 500 నోట్లలో మూడు నోట్లపై రక్తపు మరకలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నగదు ఎక్కడి నుంచి వచ్చిందని విచారించగా ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య అనంతరం ఇంటి నుంచి నగదును అపహరించినట్లు బాలురు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.

**మందలించడంతో కక్ష**

పోలీసుల వివరాల ప్రకారం, ఇద్దరు బాలురు ఒకే పాఠశాలలో పదో తరగతి చదువుతూ హాస్టల్‌లో ఒకే గదిలో ఉండేవారు. జల్సాలకు, చెడు వ్యసనాలకు అలవాటు పడిన వారు తల్లిదండ్రులకు తెలియకుండా సెల్‌ఫోన్లు ఉపయోగిస్తూ సోషల్ మీడియా, యూట్యూబ్‌లో సులభంగా డబ్బు సంపాదించే మార్గాల కోసం వెతికేవారు. గత నెలలో డబ్బు విషయంలో ప్రిన్సిపల్‌కు పట్టుబడటంతో ఆమె వారి తల్లిదండ్రుల సమక్షంలో మందలించారు. దీంతో ఆమెపై కక్ష పెంచుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. ప్రిన్సిపల్ వద్ద పెద్ద మొత్తంలో నగదు ఉంటుందని భావించిన ఇద్దరూ హత్యకు వారం రోజుల ముందు నుంచి రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వెళ్లి బ్యాగులో నుంచి దుస్తులు తీసుకుని వచ్చారు. అనంతరం కొండమల్లేపల్లిలో కత్తి, గ్లౌజులు కొనుగోలు చేసినట్లు వెల్లడైంది.

**పక్కా ప్రణాళికతో హత్య**

రూపారెడ్డి ఇంటి సమీపంలోని వాటర్ ట్యాంక్ వద్దకు చేరుకున్న ఇద్దరిలో ఒకరు బయట ఎవరైనా వస్తున్నారా అని గమనించగా, మరొకరు ఇంటి వెనుక భాగం నుంచి లోపలికి ప్రవేశించినట్లు పోలీసులు తెలిపారు. తెరిచి ఉన్న వంటగది ద్వారా ఇంట్లోకి ప్రవేశించి రూపారెడ్డిపై కత్తితో దాడి చేసినట్లు దర్యాప్తులో తేలింది. అనంతరం బెడ్‌రూమ్‌లో ఉన్న సుమారు రూ. 2.50 లక్షల నగదును తీసుకుని ఇంటి వెనుక గోడ దూకి నిర్మానుష్య ప్రాంతం నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. హత్యకు ఉపయోగించిన కత్తి, గ్లౌజులు, మాస్క్, సెల్‌ఫోన్‌ను చెట్ల పొదల్లో పడేసి, కొంత దూరంలో దుస్తులు మార్చుకున్నట్లు వెల్లడైంది. ఎరుపు రంగు హుడీని డ్రైనేజీలో పడేసినట్లు పోలీసులు తెలిపారు.

**పోలీసు బృందాలకు ఎస్పీ అభినందనలు**

కేసు ఛేదనలో విశేష ప్రతిభ కనబరిచిన దేవరకొండ డీఎస్పీ ఎం.వి. శ్రీనివాసరావు, మల్లేపల్లి సీఐ ఎ. నవీన్ కుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం. జితేందర్ రెడ్డి, మల్లేపల్లి ఎస్ఐ ఎ. రమేష్, చింతపల్లి ఎస్ఐ ఎం. రామ్మూర్తి, గుడిపల్లి ఎస్ఐ డి. నరసింహులు, గుర్రంపోడు ఎస్ఐ ఎన్. వెంకన్న, సీసీఎస్ ఎస్ఐ యు. సురేష్‌తో పాటు పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించి రివార్డులు ప్రకటించారు.

## ఉద్యోగుల సమస్యలకు 'ఉద్యోగుల గొంతుక' వేదిక

### వార్షిక పుస్తకాన్ని కలెక్టర్ చిత్రా మిశ్రాకు అందజేసిన టీఎన్జీవో నాయకులు



**కరీంనగర్, ఆగస్టు 20,(సింగిడి):** ఉద్యోగుల సమస్యలు, సందేహాలకు సమాధానాలు అందించడంతో పాటు వారి సంక్షేమానికి సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు 'ఉద్యోగుల గొంతుక' పుస్తకం ఉపయోగపడుతుందని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. టీఎన్జీవోల ఆధ్వర్యంలో ఇటీవల ఆవిష్కరించిన వార్షిక పుస్తకాన్ని ఆయన నేతృత్వంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాకు అందజేశారు. ఈ సందర్భంగా దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పుస్తకంలో రాష్ట్రవ్యాప్తంగా టీఎన్జీవోలు నిర్వహించిన కార్యక్రమాలు, ఉద్యోగుల సందేశాలు, సమస్యలు, సందేహాలు--సమాధానాలు, అనుభవజ్ఞులైన ఉద్యోగులు, సంఘ నాయకుల సూచనలు, అనుభవాలను పొందుపరిచినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వారికి అవసరమైన సమాచారాన్ని అందించడమే పుస్తక ప్రధాన ఉద్దేశమన్నారు. కలెక్టర్ చిత్రా మిశ్రా టీఎన్జీవో ప్రతినిధులను అభినందిస్తూ ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా ఉద్యోగుల ఆరోగ్య పథకంపై చర్చించగా, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఆరోగ్య కేంద్రాల్లో అనుభవజ్ఞులైన వైద్యులను అందుబాటులో ఉంచి నాణ్యమైన వైద్యం అందించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం లక్ష్మణరావు, కాళీచరణ్, సర్దార్ అర్మీందర్‌సింగ్, రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్‌రెడ్డి, రాజు, డాక్టర్ అరవింద్‌రెడ్డి, గంగారపు రమేష్, మామిడి రమేష్, పూర్ణచందర్‌రెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# కోదాడలో నకిలీ హెచ్‌పీసీఎల్ ఆయిల్ పట్టివేత

- ఆటోమొబైల్ దుకాణంలో సీసీఎస్ పోలీసుల తనిఖీలు..
- 20 నకిలీ ఆయిల్ టిన్లు స్వాధీనం



**కోదాడ,ఆగస్టు 20 (సింగిడి):** కోదాడ పట్టణంలో నకిలీ హెచ్‌పీసీఎల్ హైడ్రాలిక్ ఆయిల్ విక్రయిస్తున్నారన్న సమాచారంతో సీసీఎస్ పోలీసులు, హెచ్‌పీసీఎల్ కంపెనీ ప్రతినిధులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. మేళ్లచెరువు రోడ్డులోని ఓ ఆటోమొబైల్ దుకాణంలో చేపట్టిన తనిఖీల్లో నకిలీదిగా అనుమానిస్తున్న 20 ఆయిల్ టిన్లు బయటపడటంతో పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. హెచ్‌పీసీఎల్ బ్రాండ్ పేరుతో నకిలీ హైడ్రాలిక్ ఆయిల్‌ను విక్రయిస్తున్నారనే సమాచారం అందడంతో కంపెనీ ప్రతినిధులు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. దీంతో సీసీఎస్ పోలీసులు దుకాణంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కంపెనీకి చెందిన అసలైన ఉత్పత్తులకు భిన్నంగా ఉన్నట్లు గుర్తించిన 20 ఆయిల్ టిన్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆయిల్ టిన్లను కంపెనీ ప్రతినిధుల సమక్షంలో పరిశీలించిన పోలీసులు.. వాటి నాణ్యత, తయారీ వివరాలు, ప్యాకేజింగ్, సరఫరా మార్గాలపై ఆరా తీస్తున్నారు. కంపెనీ ప్రతినిధి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా దుకాణ యజమానులను పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. నకిలీ ఆయిల్ ఎక్కడి నుంచి దుకాణానికి వచ్చింది? దీని వెనుక సరఫరాదారులు ఎవరైనా ఉన్నారా? ఇతర ప్రాంతాలకు కూడా ఈ నకిలీ ఆయిల్‌ను సరఫరా చేశారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. స్వాధీనం చేసుకున్న ఆయిల్ నమూనాలను పరీక్షలకు పంపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. విచారణ పూర్తయిన తర్వాత కేసు నమోదు, తదుపరి చర్యలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. నకిలీ ఆటోమొబైల్ ఉత్పత్తుల విక్రయాలపై పోలీసులు దృష్టి సారించడంతో కోదాడలో ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# రాఖీ కట్టి.. మహిళల భద్రత కోరిన విద్యార్థినులు

- మిట్స్ కళాశాల విద్యార్థినుల చేత ఎస్పీ నరసింహకు రాఖీ
- 'మై ఆటో ఈజ్ సేఫ్' కార్యక్రమంలో ఆటోడ్రైవర్లకు ఎస్పీ సూచనలు



**కోదాడ,ఆగస్టు 20 (సింగిడి):** మహిళలు, విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ కోదాడలో నిర్వహించిన 'మై ఆటో ఈజ్ సేఫ్' కార్యక్రమంలో భావోద్వేగ దృశ్యం చోటుచేసుకుంది. కాశీ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్‌కు, కోదాడ డి.ఎస్.పి శ్రీనివాస్ రెడ్డికి మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ అన్నాచెల్లెళ్ల అనుబంధం, ఆత్మీయతకు ప్రతీక అని ఎస్పీ పేర్కొన్నారు. మహిళలు, విద్యార్థినులకు సురక్షిత ప్రయాణం కల్పించడమే 'మై ఆటో ఈజ్ సేఫ్' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ఆటోల్లో ప్రయాణించే మహిళలను తోబుట్టువులుగా భావించి, వారి భద్రతకు బాధ్యతగా వ్యవహరించాలని ఆటోడ్రైవర్లకు సూచించారు. ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడంతో పాటు మహిళల పట్ల గౌరవంగా మెలగాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆటోడ్రైవర్లకు కూడా విద్యార్థినులు రాఖీలు కట్టి భద్రతపై సందేశం ఇచ్చారు.



## అలియా భట్
# గ్లోయింగ్ స్కిన్ కేర్ సీక్రెట్

అలియా భట్ అందంలో ప్రత్యేకంగా ఆకట్టుకునేది ఆమె చర్మంపై కనిపించే సహజమైన కాంతి. సినిమాల్లో విభిన్నమైన లుక్స్‌లో కనిపించినా, సాధారణ సందర్భాల్లో మాత్రం మినిమల్ మేకప్‌తో ఫ్రెష్‌గా కనిపించడానికే ఆమె ఎక్కువగా ఇష్టపడుతుంది. రోజంతా షూటింగ్‌లు, మేకప్, ప్రయాణాలు ఉన్నా చర్మాన్ని నిర్లక్ష్యం చేయకుండా తనకు సరిపోయే స్కిన్‌కేర్ రొటీన్‌ను పాటిస్తానని అలియా గతంలో పంచుకుంది. బిజీ లైఫ్‌లోనూ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి అలియా పాటించే ఈ సింపుల్ బ్యూటీ రొటీన్ ఏమిటో ఈ స్టోరీలో చూద్దాం..

సినిమాల్లో అలియా భట్ లుక్ ఎంత నేచురల్‌గా, ఫ్రెష్‌గా కనిపిస్తుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మేకప్ ఉన్నా, లేకపోయినా ఆమె ఫ్రెష్ గ్లోయింగ్ స్కిన్ అభిమానులను ఆకట్టుకుంటుంది. అయితే ఆ గ్లో వెనుక ఖరీదైన ట్రీట్‌మెంట్లు మాత్రమే కారణం అని అనుకుంటున్నారేమో. అయితే ఆ లుక్ కోసం కేవలం మేకప్‌పై ఆధారపడకుండా, రోజువారీ స్కిన్‌కేర్‌కు అలియా చాలా ప్రాధాన్యం ఇస్తుంది. అలియా తన స్కిన్‌కేర్ విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటూ, రోజువారీ రొటీన్‌లో తనకు నచ్చిన కొన్ని ప్రాథమిక ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇస్తుంది. తన యూట్యూబ్ వీడియోలో ఆమె స్వయంగా తన స్కిన్‌కేర్ రొటీన్‌ను షేర్ చేసుకుంది. బిజీ షెడ్యూల్, తక్కువ నిద్ర వంటి కారణాలతో చర్మంపై ప్రభావం పడే అవకాశం ఉన్నప్పటికీ, దాన్ని క్రమంగా సంరక్షించుకోవడానికి ఆమె కొన్ని స్టెప్పులను పాటిస్తుంది. మరి అలియా భట్ తన వానిటీలో తప్పనిసరిగా ఉంచుకునే ఈ బ్యూటీ ఎసెన్షియల్స్ ఏవి? ఆమె స్కిన్‌కేర్ రొటీన్ ఎలా ఉంటుందో తెలుసుకుందాం..

### జేడ్ రోలర్‌తో ఫేస్ మసాజ్

అలియా తన స్కిన్‌కేర్ రొటీన్‌ను జేడ్ రోలర్, స్కిన్ మసాజర్‌తో స్టార్ట్ చేస్తుంది. చెంపలు, దవడ ప్రాంతంలో జేడ్ రోలర్‌తో సన్నితంగా మసాజ్ చేస్తుంది. ఫేస్ మసాజ్ చేయడం వల్ల చర్మానికి ఫ్రెష్ లుక్ వస్తుంది. జేడ్ రోలర్ చర్మాన్ని టైట్‌గా చేస్తుంది, వృద్ధాప్య ఛాయలు త్వరగా రాకుండా చూసుకుంటుందని జీజణ అధ్యయనం పేర్కొంది. జేడ్ రోలర్‌ను ఉపయోగించేటప్పుడు ముఖంపై ఎక్కువ ఒత్తిడి పెట్టకుండా సున్నితంగా మసాజ్ చేయాలి.

### కళ్ల చుట్టూ ఐ క్రీమ్

తన బిజీ షూటింగ్ షెడ్యూల్ కారణంగా నిద్ర తక్కువగా ఉండే సందర్భాల్లో కళ్ల కింద డార్క్ సర్కిల్స్ కనిపిస్తాయని అలియా చెప్పింది. అందుకే ఆమె ఐ క్రీమ్‌ను రొటీన్‌లో చేర్చుకుంది. కళ్ల చుట్టూ చర్మం చాలా సున్నితంగా ఉంటుంది కాబట్టి ఏ ఉత్పత్తినైనా మెల్లగా అప్లయ్ చేయడం మంచిది. అలాగే నియాసినామైడ్ సీరమ్

అలియా రొటీన్‌లో మరో ముఖ్యమైన ప్రొడక్ట్ నియాసినామైడ్ ఉన్న సీరమ్. నియాసినామైడ్‌ను సాధారణంగా చర్మ బ్యారియర్‌ను మెరుగుపరచడం, చర్మాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది. అయితే ప్రతి ఒక్కరి చర్మానికి ఒకే ఉత్పత్తి సరిపోదు.

మాయిశ్చరైజర్ మర్చిపోదు

స్కిన్‌కేర్‌లో మాయిశ్చరైజింగ్ చాలా ముఖ్యమైన స్టేజ్ అని అలియా చెబుతుంది. షూటింగ్ సమయంలో ఎక్కువసేపు మేకప్‌లో ఉండాల్సి రావడంతో చర్మం పొడిబారకుండా ఉండేందుకు ఆమె మాయిశ్చరైజర్‌ను కచ్చితంగా అప్లై చేస్తుంది. ముఖంతో పాటు మెడ, చేతులకు కూడా మాయిశ్చరైజర్ రాసుకుంటుంది. అలియా రొటీన్‌లో ముఖ్యమైన స్టేజ్ సన్‌స్క్రీన్. ఆమె 50 ఉన్న సన్ స్క్రీన్‌ను ఉపయోగిస్తుంది. ముఖం, మెడకు సన్‌స్క్రీన్ అప్లై చేసి ఆ తర్వాత మేకప్ చేసుకుంటుంది. సూర్యుడి ఖఎ కిరణాల నుంచి చర్మాన్ని రక్షించుకోవడానికి సన్‌స్క్రీన్‌ను ఉపయోగించడం ముఖ్యం. అలియా భట్ స్కిన్‌కేర్ రొటీన్ చూస్తే ఎక్కువ ఉత్పత్తులు వాడటం కంటే, క్లెన్సింగ్, హైడ్రేషన్, మాయిశ్చరైజింగ్, సన్ ప్రొటెక్షన్ వంటి ప్రాథమిక దశలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనిపిస్తుంది. అయితే సెలబ్రిటీ ఉపయోగించే ఉత్పత్తులు అందరికీ సరిపోవాల్సిన అవసరం లేదు.

## స్టాక్ మార్కెట్
Stock Market



## రిటైర్మెంట్ టైమ్‌లో రూ.2 కోట్లు
# పొందాలనుకుంటున్నారా?

**పదవీ విరమణ తర్వాత ప్రశాంతమైన జీవితం గడపాలని ప్రతి ఉద్యోగి కలగంటాడు. ఈ నేపథ్యంలో రూ.2 కోట్ల రిటైర్మెంట్ నిధి అనేది చాలా మందికి సాధారణ లక్ష్యంగా మారింది.**

అయితే కేవలం బ్యాంకులో డబ్బు పొదుపు చేయడం ద్వారా ఈ లక్ష్యం సాధ్యం కాదని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. దీర్ఘకాలిక ప్రణాళిక, క్రమబద్ధమైన పెట్టుబడులు, ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకున్న వ్యూహం అవసరం. ప్రస్తుతం నెలకు రూ. 50,000తో కుటుంబ ఖర్చులు నిర్వహించగలిగినా, వచ్చే 20 సంవత్సరాల్లో అదే జీవనశైలి కొనసాగించాలంటే మరింత పెద్ద నిధి అవసరం అవుతుంది. ద్రవ్యోల్బణం కారణంగా వస్తువుల ధరలు పెరుగుతుండటంతో, ఈ రోజు సరిపడే మొత్తం భవిష్యత్తులో తక్కువగా మారే అవకాశం ఉంది. అందుకే త్వరగా పెట్టుబడులు ప్రారంభించడం కీలకం.

ముఖ్యంగా సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌లు (సిప్‌లు) దీర్ఘకాలంలో కాంపౌండింగ్ ద్వారా పెద్ద మొత్తాన్ని సృష్టించడంలో సహాయపడతాయి. పెట్టుబడుల విషయంలో ఒకే మార్గాన్ని ఎంచుకోవడం ప్రమాదకరం. కేవలం సురక్షిత మార్గాలైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు లేదా పూర్తిగా స్టాక్ మార్కెట్‌పై ఆధారపడటం రెండూ రిస్క్‌ను పెంచుతాయి. అందుకే పెట్టుబడులను విభజించడం ముఖ్యమైనది. ఈక్విటీ, డెట్, ఇతర సురక్షిత ఆస్తుల మధ్య సమతుల్యత ఉండేలా పోర్ట్‌ఫోలియోను రూపొందించుకోవాలి. ఇది మార్కెట్ హెచ్చుతగ్గుల ప్రభావాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.

మరోవైపు స్టాక్ మార్కెట్ స్థిరంగా ఉండదు. పదవీ విరమణకు సమీపంలో మార్కెట్ పడిపోతే, పెద్ద నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఉదాహరణకు 30 శాతం పతనం జరిగితే రూ. 2 కోట్ల నిధి రూ. 1.6 కోట్లకు తగ్గిపోవచ్చు. ఈ రిస్క్‌ను తగ్గించేందుకు వయసు పెరుగుతున్న కొద్దీ ఈక్విటీ పెట్టుబడులను తగ్గించి, డెట్ ఫండ్‌లు



లేదా ఫిక్స్‌డ్ డిపాజిట్ల వాటాను పెంచడం అవసరం. నిపుణుల ప్రకారం ద్రవ్యోల్బణాన్ని పట్టించుకోకపోవడం, మొత్తం డబ్బును ఒకే ఆస్తి వర్గంలో పెట్టడం, పెట్టుబడులను సమీక్షించకపోవడం వంటి పొరపాట్లు రిటైర్మెంట్ ప్రణాళికను దెబ్బతీస్తాయి. సరైన క్రమశిక్షణతో, ముందస్తు ప్రణాళికతో పెట్టుబడులు కొనసాగిస్తే, 20 ఏళ్లలో రూ. 2 కోట్ల నిధి నిర్మించడం సాధ్యమేనని వారు సూచిస్తున్నారు.

## బ్యారెల్ చమురు 100 డాలర్లు కొనసాగితే
# వడ్డీ రేట్ల పెంపు తప్పదు

### హెచ్ఎస్‌బీసీ

ముడిచమురు ధర బ్యారెల్‌కు 100 డాలర్ల పైన ఎక్కువకాలం కొనసా గితే, దేశంలో రిటెయిల్ ద్రవ్యోల్బ ణం భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గరిష్ఠ లక్ష్య పరిమితి 6 శాతాన్ని దాటుతుం దని, ఫలితంగా వడ్డీ రేట్ల పెంపు అనివార్యమవుతుం దని విదేశీ బ్రోకరేజీ సంస్థ హెచ్ ఎస్‌బీసీ అంచనా వేసింది. ముడి చమురు ధరల సగటు బ్యారెల్‌కు 100 డాలర్ల దిగువన వినియోగిస్తుందా అన్న ఊహాగానాల మధ్య హెచ్ఎస్‌బీసీ నివేదిక ప్రాధాన్యం సంతరించు కుంది. 'చమురు ధరల పెరుగు దల వల్ల, వృద్ధిపై ప్రతికూల ప్రభావం అధికంగా ఉన్నప్పుడు, రూపాయి రక్షణ కోసం వడ్డీ రేట్లను పెంచడం చాలా ఖరీదైన వ్యవహా రంగా మారుతుంది' అని నివేదిక స్పష్టం చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో ద్రవ్య పరపతి, ఆర్థిక



ఉంటే, భార త్‌లో వినియోగదారుల ధరల సూచీ(సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బ ణం 6% లోపే ఉంటుందని హెచ్ఎస్ బీసీ ఆర్థికవేత్తలు తమ గణాంకాల ఆధారంగా పేర్కొన్నా రు. ముడిచమురు ధర దీర్ఘకాలం పాటు 100 డాలర్లపైనే కొనసాగితే మాత్రం ద్రవ్యోల్బణం 6 శాతాన్ని అధిగమించి, కచ్చితంగా వడ్డీ రేట్ల పెంపునకు దారితీస్తుందని వారు విశ్లేషించారు. మార్చి నెలలో బ్రెంట్ ముడిచమురు సగటు ధర 100 డాలర్లుగా నమోదు కావడం తో ప్రస్తుతం మనం ఒక 'కూడలి' వద్ద ఉన్నా మని వారు అభిప్రా యం వ్యక్తం చేశారు.

ఈనెల 6-8 వరకు ఆర్‌బీఐ పరపతి విధాన సమీక్ష జరగనుంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ మరీ క్షీణించకుండా కాపాడేం దుకు.. వడ్డీ రేట్లను ఆర్‌బీఐ ఒక సాధనంగా విధానాల పరంగా తటస్థ వైఖరి అవలంబిం చడమే మేలని హెచ్ఎస్‌బీసీ ఆర్థిక వేత్తలు సూచించారు. మార్కెట్లో సరఫరా వ్యవస్థలు ఇంకా పూర్తిగా మెరు గుపడనందున, డిమాండ ను పెంచే ప్రయత్నాలు చేస్తే, అది మళ్లీ ద్రవ్యోల్బణానికే దారి తీస్తుం దని పేర్కొన్నారు. ఆర్థిక లోటును 2025-26 ఆర్థిక సంవత్సరం స్థాయిలకు దగ్గరగా ఉంచాలని, లోటును కట్టడి చేసేందుకు పెట్రోలు, డీజిల్ ధరలు పెంచాలని సూచించారు. ద్రవ్యవిధానం వైపు చూస్తే, ప్రస్తుతం ఉన్న సరళమైన విధానం.. ద్రవ్యోల్బణాన్ని 2 నుంచి 6 శాతం పరిధిలో ఉండేలా అనుమతిస్తుం దని వివరించారు. అయితే ఇంధన సంక్షోభం మరి కొన్ని వారాల పాటు కొనసాగితే, ద్రవ్యోల్బణాన్ని మించి, వృద్ధి క్షీణత ముప్పు తీవ్రంగా మారొచ్చని హెచ్ఎస్‌బీసీ అంచనా వేసింది.

ఓటర్ల జాబితా పరిశీలన.. నోటీసుల జారీ ప్రక్రియను

# వేగవంతం చేయాలి

## కలెక్టర్ నారాయణరెడ్డి

ఉమ్మడి రంగారెడ్డి బ్యూరో, ఆగస్టు19 (సింగిడి):

**ఓటర్ల జాబితా పరిశీలన మరియు నోటీసుల జారీ ప్రక్రియను సాయంత్రం నుంచే ప్రారంభించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని, గురువారం నుంచి ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తామని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో తదుపరి దశలో చేపట్టాల్సిన చర్యలపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.**




కలెక్టర్ మాట్లాడుతూ నోటీసుల జారీ అనంతరం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, సంబంధిత వివరాలను నిశితంగా పరిశీలించి, పునఃపరిశీ లన ప్రక్రియలను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని అధికా రులను ఆదేశించారు. జిల్లాలో అధిక సంఖ్యలో కేసులు ఉన్న మహేశ్వరం, ఇబ్రహీంపట్నం తదితర నియోజకవర్గాలపై ప్రత్యే క దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. అధిక కేసులు నమోదైన ప్రాంతాల్లో ముందుగా తగిన చర్యలు చేపట్టి, అవసరమైన వివరాలను వీలైనంత త్వరగా సేకరించి సంబంధిత అధికారులకు అందజేయాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలోని కేసులను క్షుణ్ణంగా గుర్తించి, సంబంధిత అధికారులకు స్పష్టమైన బాధ్యతలు అప్పగించాలని కలెక్టర్ తెలిపారు. నిర్ణీత గడువులోగా నోటీసుల జారీతో పాటు తదుపరి పరిశీలన, సర్వే, పునఃపరిశీలన, వెరిఫికేషన్ ప్రక్రియలను సమన్వ యంతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రతి కేసుకు సంబంధించి నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలన జరగాలని పేర్కొన్నారు. వాస్తవ వివరాలను నిర్ధారించిన అనంతరం తగిన చర్యలు తీసుకోవా లని అధికారులకు సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా ఉండేలా, ఓటర్ల జాబితా అత్యంత పారదర్శ కంగా, తప్పులు లేకుండా ఉండే విధంగా అధికారులు పూర్తి సమన్వ యంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి శారదా దేవి, ఎన్నికల విభాగం అధికారి రవీంద్ర గుప్తా, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# భూములను లాక్కునే కుట్ర..




పైసా పైసా కూడబెట్టిన సొమ్ము కాంగ్రెస్ ఖాతాలోకి..

**తప్పు రేవంత్ సర్కార్ చేసి.. అధికారులపై నిందలా..?**

22ఏ నిషేధిత జాబితా ఉచ్చులో పేదల ఆస్తులు

## తెలంగాణ భవన్‌కు పోటెత్తిన అమీన్ పూర్ బాధితులు

బాధితుల కోసం తెలంగాణ భవన్ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్న బీఆర్ఎస్

**అమీన్ పూర్, (సింగిడి)**కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 22ఏ నిషేధిత భూముల జాబితా ల్యాండ్ వివాదం తీవ్ర రూపం దాల్చింది. అమీన్ పూర్ మున్సిపాలిటీకి చెందిన వందలాది మంది బాధితులు మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం భారీ ఎత్తున తెలంగాణ భవన్‌కు తరలివచ్చారు. దశాబ్దాలుగా నివాసముంటున్న ఇండ్లు, ప్లాట్లు రాత్రికి రాత్రే 22ఏ నిషిద్ధ జాబితాలోకి చేరడంతో తాము తీవ్రంగా నష్టపోయామని, తమ ఆవేదనను ఎవరికి చెప్పుకోవాలో తెలియక గోడు వెళ్లబోసుకున్నారు. పిల్లల చదువులు, బిడ్డల పెళ్లిళ్లు లేదా అత్యవసర వైద్య ఖర్చుల కోసం పైసా పైసా కూడబెట్టి కొనుగోలు చేసిన స్థలాలు, కట్టుకున్న ఇండ్లు ఇప్పుడు దేనికీ పనికిరాకుండా పోయాయని బాధితులు వాపోయారు. అమ్మడానికి, తాకట్టు పెట్టడానికి వీల్లేకుండా సర్కార్ ఆంక్షలు విధించిందని మండిపడ్డారు. పరిపాలనాపరమైన తప్పులు ప్రభుత్వం చేస్తూ, రాజకీయ ప్రయోజనాల కోసం భూములను నిషేధిత జాబితాలో చేర్చి, చివరికి ఆ నిందను అధికారు లపై తోసేసేందుకు కాంగ్రెస్ సర్కార్ ప్రయత్నిస్తోందని తీవ్రంగా విమర్శించారు. సాధారణ పేద, మధ్యతరగతి కుటుంబాల భూములను రకరకాల నిబంధనల పేరుతో గద్దల్లా తన్నుకుపోయేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తోందని అమీన్ పూర్ బాధితులు ఆరోపించారు.

**బాధ్యులకు అండగా బీఆర్ఎస్..**

బాధిత ప్రజలకు తెలంగాణ భవన్ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని, 22ఏ పేరుతో పేదల పొట్టకొట్టే కాంగ్రెస్ నిర్ణయాలపై అసెంబ్లీలోనూ, క్షేత్రస్థాయిలోనూ పోరాటం చేస్తామని బీఆర్ఎస్ నాయకత్వం స్పష్టం చేసింది. అమీన్ పూర్ వంటి శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణ ప్రాంతాల్లో ఇటువంటి నిషేధాలు విధించడం వల్ల వేలాది కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ప్రభుత్వం తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, నిజమైన ప్రైవేట్ భూ యజమానులకు 22ఏ జాబితా నుంచి విముక్తి కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# పాడి రైతులకు అండగా ఉంటాం..

. కరీంనగర్ డైరీ చైర్మన్ రాజేశ్వరరావు

**తోటపల్లిలో కంటైనర్ తో ఏర్పాటు చేసిన సేవ కేంద్రాన్ని ప్రారంభించిన చైర్మన్**



**హుస్నాబాద్ (సింగిడి):** హుస్నాబాద్ మండ లంలోని తోటపల్లి గ్రామంలో కరీంనగర్ డైరీ పాల ఉత్పత్తి దారుల సేవా కేంద్రాన్ని కరీంనగర్ డైరీ చైర్మన్ రాజేశ్వరరావు ప్రారంభించారు. జికా నిధుల కింద ఏర్పాటు చేసిన కంటైనర్ సేవా కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయం ప్రకృతి, కాల పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని, ఒక్కోసారి పంటలు ఆశించిన స్థాయిలో పండక రైతులు ఇబ్బందులు పడుతుంటారని అన్నారు. అయితే పాడి పరిశ్రమ రైతులకు నిరంతర ఆదాయాన్ని అందించే రంగంగా నిలుస్తోందని పేర్కొన్నారు. పాడి రైతులు ఎన్నో కష్టాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ పశువులను పోషిస్తూ కుటుంబాలను నడిపిస్తున్నారని, వారి కష్టాన్ని గుర్తించి కరీంనగర్ డైరీ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. పాల ఉత్పత్తిని పెంచడంతో పాటు పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి అవసరమైన సహకారం, సేవలను మరింత




చేరువ చేసేందుకు డైరీ తరఫున చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోనే సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా రైతులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా డైరీకి సంబంధించిన సేవలను సులభంగా పొందే అవకాశం కలుగుతుందని అన్నారు. పాడి రైతులు నాణ్యమైన పశువుల పెంపకం, పశువుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పాల ఉత్పత్తిని పెంచుకోవాలని సూచించారు. తోటపల్లిలో సేవా కేంద్రాన్ని ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని చైర్మన్ రాజేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బంక లక్ష్మీ చందు, స్థానిక డైరీ అధ్యక్షులు ఆంజనేయులు, వైస్ చైర్మన్ బోనాల కుమార్ డైరెక్టర్లు పంపరి రాజు, దొంతరబోయిన మహేష్, చాతబోయిన రమేష్, మానుక కుమార్, దొంతరబోయిన సంపత్ పూలు కిష్టయ్య డైరీ సెక్రటరీ రాజ్ కుమార్, మేనేజర్ నాగయ్య, సూపర్వైజర్ వీరస్వామి, పాడి రైతులు, గ్రామస్తులు, కరీంనగర్ డైరీ సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

దోమల నివారణతోనే

# ప్రజారోగ్య పరిరక్షణ

**పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి**

**పాలెం వైద్యాధికారి డాక్టర్ ఎం. ప్రియాంక**



**బిజినపల్లి (సింగిడి):**దోమల నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకో వడం ద్వారా దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టవచ్చని పాలెం వైద్యాధికారి డాక్టర్ ఎం. ప్రియాంక తెలిపారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 20న ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడం దీని ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు దోమల ద్వారా వ్యాపించే అవకాశం ఉందన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, నీటి తొట్టెలు, కూలర్లు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, ప్లాస్టిక్ గ్లాసుల్లో నీరు నిల్వ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం పొడి దినంగా పాటిస్తూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను తొలగించాలని కోరారు. దోమల నియంత్రణ కేవలం ఆరోగ్యశాఖ బాధ్యత కాదని, ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నివారణ సాధ్యమవుతుందని డాక్టర్ ప్రియాంక అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తే కుటుంబంతో పాటు సమాజాన్ని దోమల వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చని తెలిపారు.

న్యూ గడ్డిఅన్నారం కాలనీలో స్ట్రామ్ వాటర్

## నాలా కనెక్టివిటీ పనులు ప్రారంభం



**ఎల్బీ నగర్, (సింగిడి):** గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని న్యూ గడ్డిఅన్నారం కాలనీ కమ్యూనిటీ హాల్ వద్ద స్ట్రామ్ వాటర్ నాలా నిర్మాణం పూర్తయినప్పటికీ, కనెక్టివిటీ పనులు పెండింగ్‌లో ఉండటంతో ఈ సమస్యపై బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం ఏ.ఈ సాయి తో కలిసి నాలా కనెక్టివిటీ పనులను మాజీ కార్పొరేటర్ బద్దం ప్రారంభించి, పనుల పురోగతిని పరిశీలించారు. బద్దం మాట్లాడుతూ.. వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో నాలా కనెక్టివిటీ పనులను ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. ప్రతిరోజూ పనులను అధికారులు పర్యవేక్షిస్తూ నాణ్యతతో పాటు పనుల వేగం పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నాలా కనెక్టివిటీ పనుల సమయంలో ప్రజలకు, వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి కృషి చేస్తామని బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి తెలిపారు.


### సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



**ఆమనగల్లు, (సింగిడి)**తలకొండపల్లి మండలం చీపునుంతల గ్రామానికి చెందిన మేడమోని రమణికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని సర్పంచ్ తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో గ్రామంలో పలువురికి ఆర్థిక సాయం అందిందని పేర్కొంటూ నేతలు కృతజ్ఞతలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండి రఘుపతి, మాజీ ఉపసర్పంచ్ చెన్నకేశవులు, వార్డు సభ్యులు వంకూరి శ్రీరామ్, శారద, నాయకులు శ్యామ్లాల్, వేంకటయ్య, పెంటయ్య, శ్రీశైలం, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహేష్ రియల్ ఎస్టేట్ కార్యాలయాన్ని

## ప్రారంభించిన దొడ్ల



**కూకట్ పల్లి, (సింగిడి)**ఆల్విన్ కాలనీ డివిజన్, ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్ నగర్ కాలనీలో నూత నంగా ఏర్పాటు చేసిన "మహేష్ రియల్ ఎస్టేట్, కార్ రెంటల్" కార్యాలయాన్ని బుధవారం ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉత్తమమైన రియల్ ఎస్టేట్ సేవలు అందిస్తూ, వ్యాపారంలో మరింత అభివృద్ధి చెంది ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సంద ర్భంగా కార్యాలయ యజమాని మహేష్‌కు ఆయన ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్ర మంలో పట్వారీ శశిధర్, గుడ్ల శ్రీనివాస్, సంగమేశ్, ఆగ్ర వాసు, ఖలీమ్, తరుణ్, ధనుంజయ్, గోపాల్, వాసు,మల్లేష్, శేఖర్, నాగయ్య గౌడ్, వాసు తదితరులు పాల్గొన్నారు.

### కులం పేరుతో దూషించినందుకు వీడియో ద్వారా క్షమాపణ



**రేవల్లి,ఏదుల (సింగిడి)** చీర్కపల్లి గ్రామానికి చెందిన జమ్మిమల్లేష్ యాదవ్ సోషల్ మీడియా వాట్సాప్ గ్రూపులో కులం పేరుతో దూషిస్తూమాట్లాడిన ఘటనపై వీడియో ద్వారా క్షమాపణలు తెలిపారు. తన మాటల వల్ల దళితసంఘాల నాయకులు, సభ్యుల మనోభావాలు దెబ్బతిని ఉంటే క్షమించాలని కోరారు. ప్రస్తుతం తాను గ్రామంలో లేనందున ప్రత్యక్షంగా కలుసుకోలేకపోతు న్నానని తెలిపారు. ఇకపై ఇలాంటి పొరపాటు జరగకుండా జాగ్రత్తగా ఉంటానని వీడియోలో పేర్కొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యత

బీరంగూడ సాయికృపా కాలనీలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పర్యటన

**అసంపూర్తి కల్వర్టు పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం..**

నూతన సీసీ రోడ్లు, యూజీడీల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచన



**అమీన్పూర్, (సింగిడి):** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలోనే తెలుసుకొని, వాటికి శాశ్వత పరిష్కారం చూపడమే తన ప్రధాన లక్ష్యమని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ సాయికృపా కాలనీలో బుధ వారం ఉదయం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఈ సంద ర్భంగా కాలనీ ప్రజలతో నేరుగా సమావే శమై, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించారు. కాలనీలో నిర్మాణంలో ఉన్న కల్వర్టు పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై స్పందిం చిన ఎమ్మెల్యే జీఎంఆర్.. కల్వర్టు నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పెరుగుతున్న జనాభా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని కాలనీలో నూతన సీసీ రోడ్లు, యూజీడీ వ్యవస్థల నిర్మాణానికి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కాలనీలో చేపట్టిన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను సైతం త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలు తెలుసుకో వడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని, స్థానిక సమస్యలను ప్రాధాన్యత క్రమంలో





పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. ఈ పర్యటనలో అమీన్పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ కౌన్సిలర్ మల్లేష్, సీనియర్ నాయకులు జగదీష్, గోపాల్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

మస్తిపురం జెడ్పి హెచ్ఎస్‌లో

## ఖాళీ పోస్టులతో ఇబ్బందులు

**ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కే. రాఘవ**

**అమరచింత, (సింగిడి):** అమరచింత మండలం మస్తిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న సమస్యలనుపరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు కే రాఘవప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధ వారం ఆ పాఠశాలను ఎస్ఎఫ్ఐ నాయకులతోకలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రాఘవ మాట్లా డుతూ పాఠ శాలలో హిందీ ఉపాధ్యాయ పోస్టు ఖాళీగా ఉం దని, వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు క్రీడలు నిర్వహించడానికి పి ఈ టి ఉపాధ్యాయుడు లేడని, పోస్టును కూడా భర్తీ చేయాలని కోరారు. పాఠశాలలో కంప్యూటర్లు ఉన్నా వాటిని బోధించేం దుకు కంప్యూటర్ ఉపాధ్యాయులు లేకపోవడంతో ఉపయో గించడం లేదని తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన మెనూ సరిగా పాటించడం లేదని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. అనంతరం విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పాఠశాల విద్యార్థులతో ఎస్ ఎఫ్ ఐ నూతన కమిటీనిఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సంజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# గచ్చిబౌలిలో భారీ డ్రగ్స్ రాకెట్ భగ్నం

రూ.16.40 లక్షల విలువైన ఎండీఎంఏ, ఓజీ కుష్ స్వాధీనం.. ముగ్గురు వ్యక్తులు అరెస్ట్



**ఉమ్మడి రంగారెడ్డి బ్యూరో, (సింగిడి)**సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని గచ్చిబౌలిలో పోలీసులు భారీ డ్రగ్స్ రాకెట్‌ను భగ్నం చేశారు. గచ్చిబౌలి పోలీసులు, ఎస్ఓటీ సైబరాబాద్ బృందాలు సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో ముగ్గురు అంతరాష్ట్ర డ్రగ్ విక్రేతలను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 16.40 లక్షల విలువైన 95.41 గ్రాముల ఎండిఎంఏ, 50 గ్రాముల ఓజీ కుష్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో మొత్తం 16 మంది డ్రగ్ వినియోగదారులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను శేరిలింగంపల్లి డీసీపీ సీ హెచ్. శ్రీనివాస్, ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్ లు బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. వట్టినాగులపల్లి కింగ్డమ్ పబ్ రోడ్డు వద్ద గచ్చిబౌలి పోలీసులు, ఎస్ఓటీ బృందాలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాయి. ఈ క్రమంలో డ్రగ్ వ్యాపారి కొరి పెల్ల యశ్వంత్, సాయి షణ్ముఖ్‌ను 16 మంది వినియోగదారులతో కలిసి పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో యశ్వంత్‌కు కేరళకు చెందిన మహ్మద్ రజల్ అబ్దుల్ గఫూర్, బెంగళూరుకు చెందిన నవీనా కేడీలు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు తేలింది. దీంతో ప్రత్యేక పోలీసు బృందాలను కేరళ, బెంగళూరుకు పంపించి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఆగస్టు 18న కేరళలోని త్రిస్సూర్‌లో మహ్మద్ రజల్ అబ్దుల్ గఫూర్‌ను అరెస్ట్ చేశారు. ఇతను యశ్వంత్‌కు 44.41 గ్రాముల ఎండిఎంఏ సరఫరా చేశానని, ఆ డ్రగ్‌ను 'సామ్' అనే నైజీరియన్ వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్లు అంగీకరించాడని తెలిపారు. అదే రోజు బెంగళూరులోని బేగూర్‌లో నవీనా కేడీని అరెస్ట్ చేసి ఆమె నివాసంలో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 51 గ్రాముల ఎండిఎంఏ, 50 గ్రాముల ఓజీ కుష్ లభించినట్లు తెలిపారు. ఈ డ్రగ్‌ను కేరళకు చెందిన తన స్నేహితుడు అనేశ్వర్ నుంచి పొందినట్లు నవీనా విచార ణలో వెల్లడించిందన్నారు. మొత్తంగా ఈ ఆపరేషన్‌లో 95.41 గ్రాముల ఎండిఎంఏ, 50 గ్రాముల ఓజీ కుష్‌తో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ విలువ మార్కెట్లో రూ. 16.40 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై సైబరాబాద్ పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరిస్తారని డీసీపీలు స్పష్టం చేశారు. యువత భవిష్యత్తును నాశనం చేసే డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థుల కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని హెచ్చరించారు. డ్రగ్స్ లేదా గంజాయి అక్రమ రవాణాకు సంబంధించిన ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే డయల్-100కు లేదా సైబరాబాద్ పోలీసుల వాట్సాప్ నంబర్ 8712663061కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లు, వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని వారు తెలిపారు.

# కార్యకర్తలే నా బలం నా బలగం





**నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి**
**కొల్చారంలో బారాస కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం**
**ఎలాంటి ఆపద వచ్చినా అండగా ఉంటా**

**కొల్చారం (సింగిడి):** కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా అండగా ఉంటానని, అవసరమైతే అర్ధరాత్రి అయినా వారి వద్దకు వచ్చి సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. "మీరే నా బలం.. మీరే నా ధైర్యం" అన్నారు. మండల కేంద్రమైన కొల్చారం లోని స్థానిక ఆ బాబా ఫంక్షన్ హాల్ లో బుధవారం నాడు కార్యకర్తల విశిష్ట సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ.... తాను ఎమ్మెల్యేగా కొనసాగుతున్నానంటే అందుకు బీఆర్ఎస్ కార్యకర్తలే ప్రధాన కారణమని అన్నారు. కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా అండగా ఉంటానని, అవసరమైతే అర్ధరాత్రి అయినా వారి వద్దకు వచ్చి సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. "మీరే నా బలం.. మీరే నా ధైర్యం" అని కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎలక్షన్ సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం లో పూర్తిస్థాయిలో విఫలమైందని అన్నారు. 420 హామీలను, కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుందన్నారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్, రైతు బీమా లాంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాలను ప్రజలకు అందించడంలో ప్రభుత్వం పూర్తిస్థాయిలో విఫలమైందన్నారు. సంగారెడ్డిలో ముఖ్యమంత్రి 24 గంటల కరెంటు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చెబితే మండలంలో విద్యుత్ అధికారి మాత్రం 12 గంటల ఇస్తున్నామని తెలియజేశారు. యథా ముఖ్యమంత్రి తథా కాంగ్రెస్ కార్యకర్తలు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కాలేశ్వరం కూలిపోయింది అన్న కాంగ్రెస్ ఇప్పుడు అదే కాలేశ్వరం నుండి నీళ్లు ఎత్తిపోస్తున్నది. ఆడబిడ్డల వసురు కాంగ్రెస్ వాళ్లకి తగులుతుందన్నారు. అనంతరం మాజీ జెడ్పిటిసి సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఆ హామీని నెరవేర్చలేదని అన్నారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొల్చారం మండల బారాస పార్టీ అధ్యక్షుడు రాంపల్లి గౌరీ శంకర్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రవితేజ రెడ్డి, యువత విభాగం అధ్యక్షుడు తుంకులపల్లి సంతోష్ రావు, మాజీ జెడ్పిటిసి ముత్యం గారి మేఘమాల సంతోష్ కుమార్, మాజీ ఎంపీపీ మంజుల కాశీనాథ్, సర్పంచులు దొడ్ల ఆంజనేయులు, స్వామి, దేవి సింగ్, వినోద్ నాయక్, గీతా రమేష్, లక్ష్మీ పెంటయ్య, ఉప సర్పంచ్లు పోరంపల్లి రాణి గోపి, ఆరె రవీందర్, శ్రీనివాస్ రెడ్డి, పార్టీ కార్యకర్తలు నరేందర్ రెడ్డి, అరిగ రమేష్, గౌరీ శంకర్, రాజు, కొమ్ముల సురేష్, కరెంట్ రాజా గౌడ్, ఆశన్న గారి ఆంజనేయులు, పాండ్ర వెంకట్, మంగలి శ్రీనివాస్, పాలాటి దుర్గాప్రసాద్, కొల్చారం గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ జీవనోపాధి పెంపునకు అధిక ప్రాధాన్యత

**కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి**
**పలు అంశాలపై అధికారులతో**
**మంత్రి వీడియో కాన్ఫరెన్స్**



**భూపాలపల్లి ప్రతినిధి, (సింగిడి):** దేశంలో బొగ్గు గనుల తవ్వకాలతో పాటు పర్యావరణ పరిరక్షణ, గని మూసివేత అనంతరం భూమి సుస్థిర వినియోగం, స్థానిక సమాజ అభివృద్ధి, ప్రత్యామ్నాయ జీవనోపాధి అవకాశాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. బుధవారం ఢిల్లీ నుండి భారత ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పలు అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శాస్త్రీయ గని మూసివేత, గని పునర్వినియోగం గని మూసివేత అనంతరం భూముల సుస్థిర వినియోగాన్ని ప్రోత్సహించే అంశాల పై చర్చించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ స్వాతం త్ర్యం అనంతరం తొలిసారిగా దేశంలో 42 బొగ్గు గనులను శాస్త్రీయ పద్ధతిలో మూసివేయడం అతిపెద్ద మైలురాయని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో మొత్తం 105 బొగ్గు గనులను శాస్త్రీయంగా మూసివే యడం లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ రూపొందించిన వార్షిక నివేదికను ఆవిష్కరించడం ద్వారా దేశంలో శాస్త్రీయ గని మూసివేతకు సంబంధించిన పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై సమగ్ర వివరాలను అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గని మూసివేత అనేది కేవలం తవ్వకాలను నిలిపివేయడం కాదని మూసివేసిన ప్రాంతాల్లో పర్యావరణ పునరుద్ధరణ, భూముల సుస్థిర వినియోగం, స్థానిక ప్రజలకు ప్రత్యామ్నాయ జీవనోపాధి అవకాశాల కల్పన, సమాజ అభివృద్ధి వంటి అంశాలను సమగ్రంగా అమలు చేయాల్సిన ప్రక్రియ అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. స్థిరమైన అభివృద్ధితో పాటు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు దీర్ఘకాలిక ప్రత్యామ్నాయ జీవనోపాధి ప్రణాళికలు రూపొందించి అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. భారత ప్రభుత్వం జనవరి 31, 2025న జారీ చేసిన నూతన మార్గదర్శకాల ప్రకారం దేశంలోని కోల్ కంపెనీలు గని మూసివేతకు సంబంధించిన ప్రక్రియను 2028–29 నాటికి పూర్తి చేయాలని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. అంతర్జాతీయ సాంకేతిక సహకారం మూసివేసిన బొగ్గు గనులపై సాంకేతిక సహకారం అందించేందుకు బొగ్గు మంత్రిత్వ శాఖ మరియు మధ్య కుదిరిన అంగీకరంపై సంతకాలు చేయడం ద్వారా అంతర్జాతీయ సాంకేతిక పరిజ్ఞానం, ఉత్తమ విధానాలను గని మూసివేత ప్రక్రియలో వినియోగించుకునే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. అలాగే కోల్ ఇండియా. లిమిటెడ్ ఏర్పాటు చేసిన కోల్ నీర్ ప్లాంట్స్ ప్రారంభించడం ద్వారా గని ప్రాంతాల్లో వనరుల సుస్థిర వినియోగం, పర్యావరణ పరిరక్షణకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి కలెక్టరేట్ నుంచి రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ జీఎం రాజేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీలు, శిశువుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**




**నిర్మల్ ప్రతినిధి, (సింగిడి):** జిల్లాలో గర్భి ణులు, బాలింతలు, శిశువుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, వైద్యారోగ్య శాఖ 'అంకురం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గర్భం దాల్చిన నుంచి ప్రసవం అయ్యే వరకు తప్పనిసరిగా పర్యవేక్షణ ఉంచాలన్నారు. గర్భిణుల్లో ఆరోగ్య సమస్యలు ఉంటే వారిపై ప్రత్యేక శ్రద్ధ ఉంచి, వారిని సంరక్షించాలన్నారు. ఎన్ఎంఆర్ సంఖ్యను సింగిల్ డిజిట్ కి పరిమితం చేయడమే అంకురం కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. ప్రత్యేక ప్రణాళికల ద్వారా గర్భిణులు, బాలింతలు, శిశువుల రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు గర్భిణులకు అవసరమైన అన్ని పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారిగా వైద్యాధికారులు గర్భిణులు తప్పనిసరిగా సంబంధిత చికిత్సలు తీసుకునేలా పర్యవేక్షణ ఉంచాలని అన్నారు. సంకల్ప్ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టి, నవజాత శిశువుల మరణాలు గత సంవత్సరంతో 50 శాతం తగ్గించాలన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన గోడ ప్రతులను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, వైద్యులు, వైద్యాధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రైతన్న ఎంటర్ప్రైజెస్‌కు మంత్రుల శ్రీకారం..!

**రైతు సేవలో సరికొత్త అడుగు..**
**ఘనంగా ప్రారంభమైన**
**రైతన్న ఎంటర్ప్రైజెస్**



**సుల్తానాబాద్, (సింగిడి):** సుల్తానాబాద్ పట్టణంలో పెద్దపల్లి గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత, వారి కుమారులు అంతటి సాగర్ గౌడ్, అంతటి లక్ష్మణ్ గౌడ్ లు నూతనంగా ఏర్పాటు చేసిన రైతన్న ఎంట ర్ప్రైజెస్ షాప్‌ను రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. రైతు లకు అవసరమైన వ్యవసాయ ఉత్పత్తులు, సే వలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావడంలో రైతన్న ఎంటర్ప్రైజెస్ కీలకంగా నిలవాలని మంత్రులు, ఎమ్మెల్యే ఆకాంక్షించారు. రైతులకు నాణ్యమైన ఉత్పత్తులు, మెరుగైన సేవలు అంది స్తూ సంస్థ మరింత అభివృద్ధి చెందాలని సూచిం చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, వ్యాపారవేత్తలు, రైతులు, అభిమా నులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ స్థాయి ఫోటో పోటీలో వీరేశం సత్తా..





**ఫ్రీ వెడ్డింగ్ విభాగంలో ద్వితీయ బహుమతి**
**రూ.5 వేల నగదు పురస్కారం**



**సుల్తానాబాద్, (సింగిడి):** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్స వాన్ని పురస్కరించుకు ని కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యం లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి ఫోటో కాంపిటీషన్‌లో పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం జీ లకుంట గ్రామానికి చెందిన ప్రముఖ ఫోటోగ్రాఫర్ ఇరుకుల్ల వీరేశం తన ప్రతిభను చాటుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఫోటోగ్రాఫర్లు పాల్గొ న్న ప్రతిష్మాత్మక పోటీలో ఫ్రీ వెడ్డింగ్ విభాగంలో ద్వి తీయ బహుమతి సాధించి తన ఫోటోగ్రఫీ ప్రతిభ కు మరోసారి గుర్తింపు తెచ్చుకున్నారు. బహుమ తితో పాటు రూ. 5 వేల నగదు పురస్కారాన్ని అం దుకున్నారు. ఫోటోగ్రఫీ రంగంలో సృజనాత్మకత, నైపుణ్యం కలిగిన ప్రతిభను ప్రోత్సహించడంతో పాటు నూతన ఆలోచనలను వెలుగులోకి తీసు కురావాలనే ఉద్దేశంతో ఈ రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించారు. కల్చర్, వెడ్డింగ్, ఫ్రీ వెడ్డింగ్ తది త ర విభాగాల్లో పోటీలు నిర్వహించగా తెలంగాణ లోని వివిధ జిల్లాలకు చెందిన ఫోటోగ్రాఫర్లు ఉత్సాహంగా పాల్గొని తమదైన శైలిలో చిత్రాలను ప్రదర్శించారు. ఈ పోటీలో ఫ్రీ వెడ్డింగ్ విభాగంలో ఇరుకుల్ల వీరేశం సమర్పించిన ఫోటోకు న్యాయ నిర్ణేతల ప్రశంసలు లభించడంతో పాటు ద్వితీయ బహుమతికి ఎంపికైంది. సాధారణ ఫోటోను అ ద్భుతమైన జ్ఞాపకంగా మలచడంలో తనకున్న సృజనాత్మకత, క్షణాన్ని ఒడిసిపట్టే నైపుణ్యం, లై టింగ్--ఫ్రే మింగ్‌పై పట్టును వీరేశం మరోసారి ని రూపించారని తోటి ఫోటోగ్రాఫర్లు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలో బహుమతి సాధించడం పట్ల వీరేశం ఆనందం వ్యక్తం చేశారు. ఫోటోగ్రఫీని వృత్తిగా మాత్రమే కాకుండా ఒక కళగా భావిస్తూ నిరంతరం కొత్తదనాన్ని అందించేందు కు కృషి చే స్తున్నానని తెలిపారు. తన ప్రతిభను గుర్తించి ప్రో త్సహించిన ఫోటోగ్రాఫర్లు, స్నేహితులు, కుటుంబ సభ్యులు, పోటీ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలి పారు. ఈ విజయం తనలో మరింత ఉత్సాహాన్ని నింపిందని, భవిష్యత్తులో మరిన్ని రాష్ట్రస్థాయి, జాతీయస్థా యి పోటీల్లో పాల్గొని మరింత మంచి గుర్తింపు సాధించేందుకు కృషి చేస్తానని పేర్కొ న్నా రు. వీరేశం రాష్ట్రస్థాయిలో బహుమతి సాధించ డంపై జీలకుంటతో పాటు సుల్తానాబాద్, ఓదెల ప్రాంతాలకు చెందిన ఫోటోగ్రాఫర్లు, స్నేహితులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక స్థాయి నుంచి రాష్ట్రస్థాయి పోటీలో సత్తా చాట డం అభినందనీయమని కొనియాడారు. ఫోటోగ్రఫీ రంగంలో ప్రతిభకు కృషి తోడైతే ఉన్నత స్థాయికి ఎదగవచ్చని వీరేశం విజయం నిరూపించిందని పలువురు పేర్కొన్నారు. బహుమతి ప్రదాన కార్యక్రమంలో హుజురా బాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేతుల మీదుగా వీరేశం బహుమతి, రూ. 5 వేల నగదు పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సంద ర్భంగా నిర్వాహకులు, ప్రముఖులు, ఫోటోగ్రాఫర్లు వీరేశంను అభినందించి భవిష్యత్తు లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్య క్రమంలో మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ (దిలీప్), మాజీ మున్సిపల్ చైర్మన్ తకాళ్లపల్లి రా జేశ్వరరావు, ఎస్సై రవి, ఫోటోగ్రఫీ మాస్టర్లు అనిల్ కుమార్, శివకుమార్, పీవీఎస్ నాగరాజు, మండల అధ్యక్షులు ముస్తఫా, రాంబాబు, రమేష్ తదితర లు పాల్గొన్నారు.

# తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యసాధనకు బ్యాంకులు పూర్తి సహకారం అందించాలి

**ఎస్ఎల్‌బీసీ సమీక్షలో**
**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పిలుపు**




**హైదరాబాద్, (సింగిడి):** హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో తెలంగాణ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్–ఎల్‌బీసీ) 50వ త్రైమాసిక సమీక్షా సమావేశం జరిగింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సెర్ప్ సీఈవో డి దివ్య, ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి డి కృష్ణ భాస్కర్, కేంద్ర ఆర్థిక సేవల విభాగం డైరెక్టర్ మానస గంగోత్రి కటా, ఆర్‌బీఐ ప్రాంతీయ డైరెక్టర్ చిన్మయ్ కుమార్, నాబార్డ్ సీజీఎం బి ఉదయ్ భాస్కర్, ఎస్‌బీఐ కన్వీనర్ సతీష్ కుమార్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో ఎస్‌బీఐ సీజీఎం, ఎస్–ఎల్‌బీసీ చైర్మన్ నీలేష్ ద్వివేది బ్యాంకుల పనితీరు నివేదికను సమర్పిస్తూ మాట్లాడారు. 2026–27 మొదటి త్రైమాసికంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు 9,92,94 7 కోట్లకు, రుణాలు 12,76,748 కోట్లకు పెరిగాయని, రుణ–డిపాజిట్ (సీడీ) నిష్పత్తి 128.58 శాతంగా నమోదైందని ఆయన వెల్లడించారు. వ్యవసాయ అనుబంధ రంగానికి ?32,268 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగానికి ?91,374 కోట్లు, గృహ రుణాలకు 1,402 కోట్లు, విద్యా రుణాలకు 134 కోట్లతో కలిపి ప్రాధాన్యతా రంగానికి మొత్తం 1,46, 096 కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు వివరించారు. అలాగే రాష్ట్రంలో 133.57 లక్షల పీఎంజేడీవై ఖాతాలు నమోదయ్యాయని, సామాజిక భద్రతా పథకాల కింద పీఎంఎస్‌బీవైలో 206.73 లక్షలు, పీఎంజేజేబీవైలో 109.52 లక్షలు, అటల్ పెన్షన్ యోజనలో 28.99 లక్షల మంది చేరారని వివరించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ, 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న "తెలంగాణ రైజింగ్ 2047" లక్ష్యానికి బ్యాంకులు పూర్తి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. కేవలం రుణ లక్ష్యాలు చేరుకోవడమే కాకుండా గ్రామీణ ఆదాయం పెంపు, మహిళా సాధికారత, ఉద్యోగ కల్పన ప్రధాన ఫలితాలుగా ఉండాలని స్పష్టం చేశారు. మూసీ రివర్‌ఫ్రంట్, ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్, మెట్రో విస్తరణ ప్రాజెక్టులతో రాష్ట్రం పెట్టుబడుల కేంద్రంగా మారుతోందని, స్వయం సహాయక సంఘాలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు తోడ్పడాలని కోరారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ, రాష్ట్ర వృద్ధి రేటును 13 శాతానికి చేర్చేలా బ్యాంకులు వార్షిక రుణ ప్రణాళికలను రూపొందించాలని కోరారు. ఆర్‌బీఐ ప్రాంతీయ డైరెక్టర్ చిన్మయ్ కుమార్ మాట్లాడుతూ, ఎంఎస్ఎంఈ క్లస్టర్ల సమగ్ర అభివృద్ధికి చర్యలు చేపట్టాలని, మహిళా బిజినెస్ కరస్పాండెంట్ల సంఖ్య పెంచాలని, అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల పరిష్కారం, రీ–కేవైసీ ప్రక్రియలను వేగవంతం చేయాలని సూచించారు. డి దివ్య, మానస గంగోత్రి కటా, బి ఉదయ్ భాస్కర్ ప్రసంగించిన ఈ సమావేశంలో ఎస్‌బీఐ డీజీఎం జ్ఞానేశ్వర్ ప్రసాద్ వందన సమర్పణ చేశారు.

# నిర్మల్ లో బిజెపి లో చేరిన పలువురు నాయకులు





**నిర్మల్ ప్రతినిధి, (సింగిడి):** నిర్మల్ పట్టణానికి చెందిన మున్నూరు కాపు మిత్ర మండలి వ్యవస్థాపన అధ్యక్షులు అడప పోశెట్టి తో పాటు ముఖ్య నాయకులు, యువకులుకిషన్, అశోక్ వర్మ, మనోహర్ వర్మ, ఆనంద్, యువరాజ్, సాయి, ఆధుముల్ల నర్సయ్య,, కందుల రాజేందర్, వేణు తో పాటు 30 మందికి పైగా యువకులు/నాయకులు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర పార్టీ కార్యాలయంలో మహేశ్వర్ రెడ్డి వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ సిద్ధాంతాలు, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి నూతనంగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, బీజేపీ ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ కందుల హరీష్, మాజీ కౌన్సిలర్ లు పోడెల్లి గణేష్, అకోజి కిశన్, నాయకులు డి శ్రీనివాస్, కొండాజి శ్రావణ్, గురిజాల రాజు, వేణు, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## మునగాల కస్తూరిబా పాఠశాలలో

# 'పోలీస్ ప్రజా భరోసా' సదస్సు



**మునగాల, (సింగిడి):** మునగాల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో బుధ వారం ఎస్ఐ ఆధ్వర్యంలో విద్యార్థినులకు 'పోలీస్ ప్రజా భరోసా' అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ దుష్ప్రభా వాలు, సైబర్ నేరాలపై అప్రమత్తత, సామాజిక మాధ్యమాల వినియో గంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని సూచించారు. మహిళలు, బాలికల రక్షణకు పోలీస్ శాఖ అందిస్తున్న సేవలను వివరించారు. అత్యవసర సమయంలో డయల్–112కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందే విధానాన్ని తెలియజేశారు. మహిళల భద్రత కోసం 'పోలీస్ అక్క' కార్యక్రమం ద్వారా సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో విడియో గ్రాపర్లకి ఉచిత కోర్సు సుశీకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**కల్వకుర్తి (సింగిడి):** కల్వకుర్తి పట్టణ కేంద్రంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కల్వకుర్తి డివిజన్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణంలోని లయన్స్ క్లబ్ భవన్ లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫోటో, వీడియో గ్రాఫర్లకు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శు భాకాంక్షలు తెలియజేసిన ఆయన, ఫోటోగ్రఫీ రంగం ప్రాముఖ్యతను వివరిస్తూ మాట్లాడారు. ఫోటోగ్రఫీ ఆవిర్భావం నుంచి నేటి ఆధునిక డిజిటల్ ఫోటోగ్రఫీ వరకు ఈ రంగం ఎన్నో మార్పులు, సాంకేతిక అభివృద్ధిని సాధించిందని తెలిపారు. ఒకప్పుడు ఒక జ్ఞాపకాన్ని ఫోటో రూపంలో భద్రపరచడమే ప్రధానంగా ఉన్న ఫోటోగ్రఫీ, నేడు ఆధునిక కెమెరా టెక్నాలజీ, వీడియో గ్రాఫీ, డ్రోన్ ఫోటోగ్రఫీ, సినిమాటోగ్రఫీ, ఫోటో--వీడియో ఎడిటింగ్, గ్రాఫిక్ డిజైనింగ్, సోషల్ మీడియా కంటెంట్ క్రియేషన్ వంటి అనేక విభాగాలతో విస్తరించిందన్నారు, ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం కెమెరా వినియో గంపై మాత్రమే కాకుండా ఆధునిక సాఫ్ట్‌వేర్, ఎడిటింగ్, డిజైనింగ్, వీడియో ప్రొడక్షన్ తదితర నైపుణ్యాలపై పట్టు సాధించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు, ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫోటో, వీడియో గ్రాఫర్లకు త్వరలో ఉచిత నైపుణ్య శిక్షణ కోర్సు కల్వకుర్తి మరియు పరిసర ప్రాంతాల్లోని ఫోటో, వీడియో గ్రాఫర్ల నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేసేందుకు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్వరలో ప్రత్యేక నైపుణ్య శిక్షణ కోర్సును ఉచితంగా ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హామీ ఇచ్చారు, ఈ కోర్సులో ఫోటో ఎడిటింగ్, వీడియో ఎడిటింగ్, గ్రాఫిక్ డిజైనింగ్, కలర్ గ్రేడింగ్, సినిమాటోగ్రఫీ, డిజిటల్ కంటెంట్ క్రియేషన్ తదితర ఆధునిక అంశాలపై ప్రాక్టికల్ శిక్షణ అందించేలా ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు, అంతే కాకుండా శిక్షణ కు అవసరమైన అధునాతన సాఫ్ట్‌వేర్‌ను సమకూర్చి, నిపుణులైన శిక్షకుల ద్వారా ఫోటో, వీడియో గ్రాఫర్లకు ప్రాక్టికల్‌గా శిక్షణ ఇప్పిస్తామని స్పష్టం చేశారు. ఈ శిక్షణ కేవలం సర్టిఫికెట్‌కు పరిమితం కాకుండా, వారి వృత్తిలో నేరుగా ఉపయోగపడేలా, ఉపాధి మరియు ఆదాయ అవకాశాలను మెరుగుపరుచుకు నే విధంగా రూపొందించనున్నట్లు తెలిపారు. కాలంతో పాటు టెక్నాలజీ మారుతోంది. టెక్నాలజీ మారుతున్న కొద్దీ మన నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలి. ఫోటోగ్రఫీని వృత్తిగా కొనసాగిస్తున్న వారికి ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించి, వారి వృత్తిపరమైన అభివృద్ధికి నా వంతు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను అని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఫోటో, వీడియో గ్రాఫర్లకు అవసరమైన ఆధునిక నైపుణ్యాలను ఉచితంగా అందించేందుకు ఐక్యత ఫౌండేషన్ ముందుకు రావడం పట్ల యూ నియన్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ, సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షు రంగినేని రవికుమార్, ఉపాధ్యక్షులు రియాజ్, ప్రధాన కార్యదర్శి నందు, కోశాధికారి వంశీ లతో పాటు వివిధ మండలాల అధ్యక్షులు ప్రతినిధులు, సభ్యులు, ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మవాడలో సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన

**పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం**
**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, బండి సంజయ్,మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్, (సింగిడి):** నగరంలోని 39వ డివిజన్ పోచమ్మవాడలో పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నా మని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరచడం ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే లక్ష్యమన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పోచమ్మవాడలో రోడ్డు, డ్రైన్ నిర్మాణం పూర్తయితే స్థానికులకు రాకపోకలు, పారిశుద్ధ్య పరంగా మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు,



కార్పొరేటర్లు మాసం గణేష్, తాటి ప్రభావతి, బండ రమణారెడ్డి, బోయినపల్లి ప్రవీణ్ రావు, దేవసాని సరస్వతి సత్యనారాయణ, గాజా రామ శివరాం, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, సహ-నియామక సభ్యుడు బల్బీర్ సింగ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, పార్టీ నాయకులు, ఈస్ట్ జోన్ నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ



**మల్లాపూర్, (సింగిడి):** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మల్లాపూర్ మండల ఫోటోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోటో గ్రాఫీ పితామహుడు లూయిస్ డాగ్యుర్ చిత్ర పటానికి నివాళులు అర్పించి ఫోటో వీడియో గ్రాఫర్స్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పలువురికి స్వీట్స్ పంపించి చేశారు. ఈ కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్స్ మండల అధ్య క్షుడు నరేష్, ఉపాధ్యక్షుడు అశోక్, కార్యదర్శి మోహన్, క్యాషియర్ నవీన్, సభ్యులు రాజేందర్, ప్రశాంత్, తిరుపతి, లక్ష్మీనారాయణ, రఘు, శివ, మహేష్, శ్రీనివాస్, మల్లేష్, వెంకటస్వామి, రాజు, మధుకర్, నాగరాజు, రాజేష్, ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు. ఫోటోగ్రఫీ రంగంలో పనిచేస్తున్న ఫోటోగ్రాఫర్ల సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు.

# గోమాతను జాతీయ మాతగా గుర్తించాలి

**కరీంనగర్‌లో ఘనంగా గోసమేత తిరంగా ర్యాలీ**
**ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్**

**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్‌లో గోమాతను జాతీయ మాతగా గుర్తించాలని కోరుతూ నమో మిషన్ వందే గోమాతరం ఆధ్వర్యంలో గురువారం గోసమేత తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించా రు. ప్రజల్లో దేశభక్తి, గోసంరక్షణ పై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని తెలంగాణ చౌక్ నుంచి ప్రారంభించారు. కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ ముఖ్య అతిథిగా హాజరై గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, సుమారు 200 మీటర్ల పొడవైన జాతీయ జెండాతో ర్యాలీని ప్రారంభించారు. తెలంగాణ చౌక్ నుంచి బస్టాండ్ వరకు సాగిన ర్యాలీ తిరిగి తెలంగాణ చౌక్ వద్ద ముగిసింది. సుమారు 600 మంది విద్యార్థులు, యువతీ యువకులు, గోమాత ట్రస్ట్ సభ్యులు, నాయకులు పాల్గొని జాతీయ జెండాలు చేతబట్టి గోమాతను జాతీయ మాతగా గుర్తించాలని నినాదాలు చేశారు.



కార్యక్రమంలో నమో మిషన్ వందే గోమాతరం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచార్య మద్విరాజ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్, ఫౌండేషన్ సభ్యులు జూపెల్లి ధీరజ్, సహ వ్యవస్థాపకులు వేణు, దీపక్, ఆదిశేషు, నవీన్, మాజీ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న మున్సిపల్ చైర్మన్

**నిరుపేద అంత్యక్రియలకు ఆర్థిక చేయూత**

**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుం ట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. పట్ట ణానికి చెందిన నిరుపేద సంద లింగయ్య అనారోగ్యంతో మృతి చెందగా అంత్యక్రియలు నిర్వహించి దహన సంస్కారలకు ఖర్చులు అందించిన మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్. ఈ సందర్భంగా ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి మనిషి ఏదో ఒక రోజు చనిపోవడం జరుగుతుందని అందరికీ సొంత ఇండ్లు ఉండవని కిరాయి నివాసంలో ఉంటున్న వారు చనిపోతే ఇంటి యజమానులు వారికి ఆశ్రయం కల్పించడం లేదని ఇది మంచి పద్ధతి కాదని ఆయన పేర్కొన్నారు. మానవత దృక్పథంతో ఆలోచించి కిరాయి ఇంట్లో ఉన్నవారు చనిపోతే ఆ ఇంటి యజమాని వారికి సహకరించాలని




కోరారు. ఈ కార్యక్రమంలో ఖండాల తిరుపతి కామిశెట్టి జయేందర్ మర్రి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# నడిరోడ్డుపై గోమాతలు.. ప్రయాణికులకు తప్పని తిప్పలు

**మున్సిపల్ అధికారులు స్పందించి**
**గోషాల ను ఏర్పాటు చేయాలి : పట్టణ ప్రజల విజ్ఞప్తి**

**జమ్మికుంట, (సింగిడి):** కరీంనగర్ జిల్లాలోనే అతి పెద్ద వ్యాపార కేంద్రమైన జమ్మికుంట పట్టణంలో ప్రతిరోజు రాత్రి సమయంలో నడిరోడ్డుపై గోమాతలు ఉండడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రతిరోజు పట్టణంలోని గాంధీ చౌరస్తా వద్ద పదుల సంఖ్యలో గోమాతలు నడిరోడ్డుపై విశ్రమిస్తూ వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. కొన్నిసార్లు రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికులు సైతం రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్లపై ఉన్న గోమాతలకు గో సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజల డిమాండ్ చేస్తున్నారు. బుధవారం రాత్రి నడిరోడ్డుపై గోమాతలు ఉండడంతో అటువైపుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో ఒక వాహనంపై ఉన్న చిన్న పిల్లలకు స్వల్ప గాయాలు అయ్యాయి. త్రుటిలో



పెను ప్రమాదం తప్పడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి గోమాతలను సంరక్షించి ప్రయాణికులకు ఇబ్బంది తలెత్తకుండా చూడాలని పట్టణ ప్రజల విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఉద్యోగుల న్యాయమైన హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమిద్దాం

**ఆగస్టు 27న కలెక్టరేట్ ఎదుట ధర్నా, సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో మహాధర్నా**
**టీఎన్‌జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి**

**కరీంనగర్, (సింగిడి):** తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ప్రకటించిన ఉద్యమ కార్యాచరణకు కరీంనగర్ జిల్లా ఉద్యోగుల జేఏసీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శులు ఏలూరు శ్రీనివాసరావు, ముజీబ్ హుస్సేన్ తదితరుల పిలుపు మేరకు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా ఆందోళనలు చేపట్టనున్నట్లు కరీంనగర్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, టీఎన్‌జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.
ఉద్యోగులకు వేతన సవరణ సంఘం అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు కరువు భత్యాలను విడుదల చేయాలని, సహాయక పింఛను విధానాన్ని రద్దు చేసి పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్



చేశారు. ఉద్యోగుల ఆరోగ్య కార్డుల్లోని లోపాలను సవరించి మెరుగైన వైద్య భద్రత కల్పించాలని కోరారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఆగస్టు 27న కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా, సెప్టెంబర్ 1న పింఛను విద్రోహ దినం సందర్భంగా నిరసన, సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించను న్నట్లు వెల్లడించారు. ఉద్యోగులు, పెన్షనర్లు, ఉద్యోగ సంఘాల నాయకులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమా లను విజయవంతం చేయాలని పిలుపుని చ్చారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, తమ న్యాయమైన హక్కుల కోసం మాత్రమే పోరాడుతున్నారని దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు, రక్షణ, పారిశుద్ధ్యం, వైద్యం, విపత్తుల సమయంలో సేవలు అందించడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని తెలిపారు. అలాంటి ఉద్యోగులకు వేతన భద్రత, ఆరోగ్య భద్రత, పింఛను భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలని కోరుతూ.. "మా మౌనం బలహీనత కాదు.. మా సహనం చేతకానితనం కాదు. మా విధేయతను దుర్వినియోగం చేయవద్దు" అని ఆయన అన్నారు. ప్రభుత్వం ఉద్యోగులను గౌరవించి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. "మేము ప్రభుత్వానికి, ప్రజలకు, అభివృద్ధికి వ్యతిరేకం కాదు. అన్యాయానికి మాత్రమే వ్యతిరేకం. మా సేవకు గౌరవం, జీతాలకు భద్రత, కుటుంబాలకు ఆరోగ్య భద్రత, వృద్ధాప్యానికి పింఛను భద్రత కావాలి" అని దారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆగస్టు 27న కరీంనగర్ కలెక్టరేట్ ధర్నా, సెప్టెంబర్ 1న పింఛను విద్రోహ దినం నిరసన, సెప్టెంబర్ 10న హైదరాబాద్ మహాధర్నాను విజయవంతం చేయాలని ఆయన ఉద్యోగులకు పిలుపునిచ్చారు.

## కాలం మారినా మధుర జ్ఞాపకాలను

# భద్రపరిచే కళ ఫోటోగ్రఫీ

**హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**
**ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు**

**జమ్మికుంట, (సింగిడి):** కాలం ఎంత వేగంగా గడిచిపోయినా తీపి మధుర జ్ఞాపకాలను పదిలంగా భద్రపరిచే అద్భుతమైన కళ ఫోటోగ్రఫీ అని, ప్రపంచాన్ని ఒక కొత్త కోణంలో సమాజానికి చూపించే శక్తి ఒక్క ఫోటోగ్రాఫర్‌కే ఉందని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ కొనియాడారు.
ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జమ్మికుంట పట్టణ పరిధిలోని డి.ఎం.ఆర్ బ్యాంకెట్ హాల్‌లో ఏర్పాటు చేసిన వేడుకలలో హుజూరాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి తో కలిసి మున్సిపల్ చైర్మన్ పాల్గొని ఫోటో గ్రాఫర్లను సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నియోజకవర్గం, పట్టణ పరిధిలోని ఫోటోగ్రాఫర్లందరికి ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఒక ఫోటో వెయ్యి జ్ఞాపకాలను, ఎన్నో భావోద్వేగాలను మన కళ్లముందు నిలుపుతుందని, మానవ జీవితంలో ప్రతీ ముఖ్య ఘట్టాన్ని పదిలపరిచే ఫోటోగ్రాఫర్ల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్



వైస్ ఛైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, స్థానిక ఎస్.ఐ, ఫోటోగ్రాఫర్స్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిన్నింటి నాగేందర్, జమ్మికుంట ప్రెసిడెంట్ ముస్తఫా, ప్రతినిధులు శివకుమార్, నాగరాజు, అనిల్ కుమార్, బిట్ల తిరుపతి, కమిటీ సభ్యులు ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంతర్జాతీయ చెస్ క్రీడాకారుడు శౌనక్‌కు బండి సంజయ్ సన్మానం

**స్పెయిన్ టోర్నీలో ప్రతిభతో 175 ఫిడే**
**రేటింగ్ పాయింట్లు సాధించిన యువ క్రీడాకారుడు**

**కరీంనగర్,(సింగిడి):** స్పెయిన్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన కరీంనగర్‌కు చెందిన యువ క్రీడాకారుడు శౌనక్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘనంగా సన్మానించారు. బుధవారం కరీంనగర్‌లోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. జూలై 2 నుంచి ఆగస్టు 1 వరకు స్పెయిన్‌లో జరిగిన టోర్నమెంట్‌లో శౌనక్ ప్రతిభ కనబరిచి 175 ఫిడే రేటింగ్ పాయింట్లు సాధించినట్లు తెలిపారు. చిన్న వయసులోనే చెస్‌లో మాస్టర్ సీఎం, ఎఫ్ఎం టైటిళ్లు సాధించడం విశేషమని బండి సంజయ్ కొనియాడారు. అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించి కరీంనగర్ కీర్తిని ఇనుమడింపజేయడం జిల్లాకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా శౌనక్ తల్లిదండ్రులు ప్రసాద్, అపూర్వతో పాటు కోచ్‌లు రామరాజు, అ-



నూప్ కుమార్‌లను బండి సంజయ్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకుడు కంకటి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఫోటోగ్రఫీ, గత చరిత్రకు సాక్ష్యం

**ఫోటో, వీడియో జర్నలిస్టుల సమస్యలను**
**పరిష్కరించాలి : కేంద్ర మంత్రి బండి సంజయ్**

**కరీంనగర్, (సింగిడి):** ఫోటో, వీడియో జర్నలిస్టులు కేవలం కెమెరాతో క్షణాలను బంధించే వారు కాదని, గత చరిత్రకు, వర్తమానానికి సాక్షులుగా నిలుస్తారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఫోటో, వీడియో జర్నలిస్టులను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ., వెయ్యి పదాలు చెప్పలేని భావాన్ని ఒక్క చిత్రం తెలియజేస్తుందని, ప్రజా సమస్యలను, ప్రభుత్వ నిర్ణయాల ప్రభావాన్ని సమాజానికి చూపించడంలో ఫోటో, వీడియో జర్నలిస్టుల పాత్ర కీలకమని అన్నారు. ఒక చిత్రం ప్రభుత్వాలను ప్రశ్నించడంతోపాటు మంచి పనులకు సాక్ష్యంగా నిలుస్తుందని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల విస్తరణ, కృత్రిమ మేధస్సు వినియోగం పెరిగిన నేపథ్యంలో ఫోటో, వీడియో జర్నలిస్టులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. వాస్తవాలను వక్రీకరించకుండా ప్రజలకు అందించడంతోపాటు చిత్రాల మార్ఫిడిపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఫోటో, వీడియో జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని బండి సంజయ్ అన్నారు.



చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటున్న వారికి ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇళ్ల స్థలాలతోపాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అర్హులైన జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కల్పించడంతోపాటు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందించేలా ఆరోగ్య కార్డులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. వారి కనీస వేతనాలు, జీవన ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

**జమ్మికుంట, (సింగిడి):** ప్రపంచ ఫోటోగ్రాఫర్స్ దినోత్సవం సందర్భంగా జమ్మికుంట పట్టణంలోని శివాలయంలో జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షు లు చిన్నింటి నాగేంద్ర ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లాఉపాధ్యక్షుల చిన్నింటి నాగేంద్ర ఆధ్వర్యంలో ఘనంగా జమ్మికుంట లోని శ్రీ విశ్వేశ్వర స్వామి ఆలయం బొమ్మల గుడిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలో జమ్మికుంట మండలంలోని లోని పలువురు ఫోటోగ్రాఫర్లు వీడియోగ్రాఫర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవ గుణాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా అసోసియేషన్‌ఉపాధ్యక్షులు మాట్లాడుతూ, సమాజానికి నిత్యం సేవనందిస్తున్న ఫోటోగ్రాఫర్లు కేవలం కళాకారులు మాత్రమే కాకుండా సామాజిక బాధ్యత కలిగి ఉంటారని తెలిపారు. ప్రతి ఏటా ఆగస్టు 19న వచ్చే ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఇలాంటి సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన అందరికీ అసోసియేషన్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షులు చిన్నింటి నాగేంద్ర. రచ్చ గణేష్. బి కే వెంకన్న. విజయగిరి రాంబాబు. బిట్ల తిరుపతి. గండి రంజిత్ కుమార్



కొక్కుల శ్రీరాములు. కోటగిరి కుమార్. పంజాల గణేష్. భాస్కర్. సత్యం. పొనగంటి రాజు. పవన్ బండి. కృష్ణ. శివ సాయి. అంబాల హరీష్. తదితరులు పాల్గొన్నారు

# వైశ్య భవన్ పునర్నిర్మాణానికి భూమిపూజ

**అత్యాధునిక వసతులతో నూతన కన్వెన్షన్ హాల్ నిర్మాణం**



**కరీంనగర్, (సింగిడి):** నగరంలోని గాంధీరోడ్‌లో ఉన్న ప్రతిష్ఠాత్మక వైశ్య భవన్‌ను అత్యాధునిక వసతులతో నూతన సమావేశ మందిరంగా పునర్నిర్మించేందుకు భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వైశ్య భవన్ ప్రాంగణానికి చేరుకున్న బండి సంజయ్, గంగుల కమలాకర్‌కు వైశ్యసేవ కేంద్రం నిర్వాహకులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి నూతన సమావేశ మందిర నిర్మాణానికి భూమిపూజ చేశారు. నిర్మాణానికి సంబంధించిన వివరాలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు ప్రజలందరికీ ఉపయోగపడేలా ఆధునిక వసతులతో సమావేశ మందిరాన్ని నిర్మించడం అభినంద నీయమన్నారు. నిర్మాణ పనులకు తనవంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైశ్యసేవ కేంద్రం అధ్యక్షుడు చిదుర సురేష్, కార్యదర్శి విద్యాసాగర్, కోశాధికారి రమేష్‌తో పాటు పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# ఫోటోగ్రఫీ ఒక గొప్ప కళ.. మధుర జ్ఞాపకాలకు శాశ్వత చిరునామా

**ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫోటోగ్రాఫర్లకు**
**అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి ఆత్మీయ సత్కారం**



**కరీంనగర్,(సింగిడి):**
ఫోటోగ్రఫీ గొప్ప కళ మాత్రమే కాకుండా, మధుర జ్ఞాపకాలను శాశ్వతంగా పదిలపరిచే అద్భుత మాధ్యమమని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో వివిధ దినపత్రికల ఫోటోగ్రాఫర్లకు నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఫోటోగ్రఫీకి సుదీర్ఘ చరిత్ర ఉందని, సాంకేతికంగా ఎన్నో మార్పులు వచ్చినప్పటికీ ఒక క్షణాన్ని శాశ్వత జ్ఞాపకంగా మలిచే దాని ప్రాధాన్యం ఎప్పటికీ తగ్గదని అన్నారు. ఒక మంచి ఛాయాచిత్రం సంఘటనను, భావోద్వేగాన్ని భవిష్యత్ తరాలకు కళ్లకు కట్టినట్లు చూపించగలదని తెలిపారు. సమాజంలో సానుకూల మార్పులకు కూడా ఫోటోగ్రఫీ దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించు కుని వివిధ పత్రికలకు చెందిన ఫోటోగ్రాఫర్లను ఆయన ఆత్మీయంగా సత్కరించారు. సన్మానం పొందిన వారిలో సుకూర్, శైలేందర్ రెడ్డి, కిరణ్, జనార్ధన్, మోసిన్, శ్రీధర్, రంజిత్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాలలన్నీ ఒకే వేదికపైకి రావడం అభినందనీయం

**వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెత్తుల రాజేంద్రపాణి**



**మంచిర్యాల, (సింగిడి):** మంచిర్యాల జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, విద్యారంగానికి సంబంధించిన సమస్యల పరి ష్కారం కోసం ఒకే వేదికపైకి రావడం శుభపరిణా మమని తెలంగాణ రాష్ట్ర ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం (ట్రస్మా) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెత్తుల రాజేంద్ర పాణి అన్నారు. విద్యా వ్యవస్థలో ఎదురయ్యే సమస్యలను సమష్టిగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు సంఘటితంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక మంచిర్యాలలోని శ్రీ జెన్ నెక్స్ట్ పాఠశాలలో ట్రస్మా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా నస్పూర్ పట్టణానికి చెందిన ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ గుంట ప్రణయ్ ట్రస్మాలో చేరారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెత్తుల రాజేంద్రపాణి సమక్షంలో ఆయనను శాలువాతో సత్కరించి సంఘంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజేంద్రపాణి మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలన్నీ ఒకే తాటిపైకి రావడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాలల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలు, విద్యార్థులకు మెరుగైన విద్య అందిం చేందుకు తీసుకోవాల్సిన చర్యలు, యాజమాన్యాల ప్రయోజనాలు వంటి అంశాలపై సంఘం నిరం తరం పనిచేస్తుందని తెలిపారు. వ్యక్తిగతంగా కాకుండా సమష్టిగా సమస్యలను చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషిస్తే మరింత ఫలితాలు సాధిం చవచ్చన్నారు. ప్రైవేటు పాఠశాలలు విద్యారం గంలో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో యాజ మాన్యాల మధ్య సమన్వయం అవసరమని సమావేశంలో పలువురు పేర్కొన్నారు. ఒక పాఠశాలకు ఎదురయ్యే సమస్య మరొక పాఠశాలకు కూడా ఎదురయ్యే అవకాశం ఉన్నందున వాటిని సంఘం ద్వారా సమష్టిగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తగా ప్రణయ్ చేరికతో నస్పూర్ ప్రాంతంలో సంఘం మరింత బలోపేతం అవుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

**కార్యవర్గ సభ్యుల హాజరు**

కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా ట్రెజరర్ దండ రామకృష్ణరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ రేగళ్ల ఉపేందర్, నస్పూర్ మండల అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి సత్యనారాయణ, ట్రెజరర్ అంబాల రాజ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ అమన్ ప్రసాద్, మంచిర్యాల మండల అధ్యక్షుడు జూలీ ఫేఖర్, ట్రెజరర్ మానస, మమత, తిరుపతి, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలి

**కలెక్టర్ కె. హరిత**



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, (సింగిడి)::** నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మొదటి విడత ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్‌తో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, గృహ నిర్మాణ శాఖ ఇంజినీర్లు, మున్సిపల్ కమిషనర్లతో ఇందిరమ్మ ఇళ్ల మొదటి విడత పురోగతి, రెండో విడత లబ్ధిదారుల జాబితాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతలో 8,851 ఇళ్లు మంజూరు కాగా, 1,100 ఇళ్ల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదని తెలిపారు. పనులు ప్రారంభం కాకపోవడానికి గల కారణాలను నివేదిక రూపంలో సమర్పించాలని, వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బేస్‌మెంట్, రూఫ్, స్లాబ్ స్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి లక్ష్య సాధనలో పురోగతి చూపాలని సూచించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అనర్హులకు చోటు లేకుండా క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులైన వారినే ఎంపిక చేయాలని, ముఖ్యంగా గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం అనేక దరఖాస్తులు వస్తున్నాయని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తించాలని తెలిపారు. గ్రామసభలు నిర్వహించి అర్హుల ఎంపికపై తీర్మానాలు తీసుకోవాలని సూచించారు. ప్రతి లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి పరిస్థితులను పరిశీలించాలని, మున్సిపాలిటీల పరిధిలో రూఫ్ బలంగా ఉండి స్లాబ్ వేసుకునేందుకు అర్హత కలిగిన వారిని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రకాష్ రావు, మేనేజర్ పుష్పలత, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, గృహ నిర్మాణ శాఖ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ ను నిషేధిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం : సర్పంచ్ నరేష్

**ప్లాస్టిక్ పై అవగాహన దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్న సర్పంచ్..**



**నిర్మల్ ప్రతినిధి, (సింగిడి):** ప్లాస్టిక్ ను నిషేధిద్దాం పర్యావ రణన్నీ కాపాడుదాం అని మండలంలోని న్యూ బొప్పారం గ్రామ సర్పంచ్ దేశెట్టి నరేష్ పిలుపునిచ్చాను. ఈ సందర్భంగా వీ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను తక్షణమే ఉపయోగించాలని కిరాణా వర్తకులకు సూచించారు. గ్రామాన్ని ప్లాస్టిక్ రైతు గ్రామంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్లాస్టిక్ ను వాడినట్లయితే జరిమానా విధిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్ కిరాణా షాప్ యజమానులు పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్‌లో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం

**కాగజ్ నగర్ (సింగిడి):** కాగజ్‌నగర్ లోని లక్ష్మీ డిజిటల్ కలర్ ల్యాబ్‌లో 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. టీ జీ పీ వి డబ్ల్యూ ఏ సంఘం ఆధ్వర్యంలో ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డ్యాగురె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తొలిసారిగా యూనియన్ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జ్ఞాపకాలను, సంస్కృతిని ప్రపంచానికి అందించే ఫోటోగ్రాఫర్ల ఐక్యత, వృత్తి గౌరవం నిలవాలని ఫోటోగ్రఫీ రంగం మరింత ఎదగాలని ఆకాంక్షించా రు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులకు మంత్రులు శ్రీకారం


**కాంగ్రెస్ శ్రేణులు దుగ్యాల సంతోష్ రావు, రౌతు సూరి గజమాలతో సత్కారం**



**సుల్తానాబాద్, (సింగిడి):** సుల్తా నాబాద్ మండలంలోని గర్రెపల్లి–పెగడపల్లి, పూసల–పెద్దాపూర్ ప్రాంతాల్లో రూ. 219.67 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు విచ్చేసిన రాష్ట్ర మంత్రులు కోమటి రెడ్డి వెంకటరెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ–పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు కాంగ్రెస్ నా యకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భం గా కాంగ్రెస్ నాయకులు దుగ్యాల సంతోష్‌రావు, రౌతు సూరి మంత్రులను గజమాలతో ఘనంగా సత్కరిం చారు. నియోజకవర్గ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించి, పలు అభి వృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్న మంత్రులకు వారు కృతజ్ఞ తలు తెలిపారు. మంత్రుల పర్యటనతో స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పగడ్బందీగా పూర్తి చేయాలి

**కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్ ప్రతినిధి, (సింగిడి):** జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా చేపడుతున్న ఓటర్ల మ్యాపింగ్, మ్యాపింగ్ కాని ఓటర్ల గుర్తింపు, ఓటర్ల వివరాల్లోని వ్యత్యాసాలు, అనామలీస్ పరిశీలనను నిర్దేశిత నిబంధనల మేరకు పూర్తి చేయాలని సూచించారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జిల్లాల వారీగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షిస్తూ, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచనల మేరకు జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత కార్యాచరణ ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ల వివరాల పరిశీలనలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్ఐఆర్‌లో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను సమగ్రంగా పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. ఓటర్ల వివరాల్లో ఏవైనా వ్యత్యాసాలు, అనామలీస్ గుర్తించినట్లయితే వాటిని నిబంధనల ప్రకారం పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టాలన్నారు. ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియ పూర్తయిన అనంతరం మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత తేదీ, సమయంలో హాజరై తమ పౌరసత్వాన్ని నిర్ధారించే సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించేలా వారికి అవసరమైన సమాచారం అందించాలని తెలిపారు. ఫారం–6, ఫారం–7, ఫారం–8 ద్వారా అందే దరఖాస్తులను నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అర్హులైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడడంతో పాటు, అనర్హులైన పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగకుండా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలు, శిక్షణ అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సిబ్బందికి ఎదురయ్యే సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ, ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో ఎస్ఐఆర్ కింద చేపట్టాల్సిన కార్యక్రమాలకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి దశకు సంబంధించిన లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రాష్ట్ర స్థాయి అధికారులకు అవసరమైన వివరాలను ఎప్పటికప్పుడు అందజేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ఓటర్ల జాబితాల ఖచ్చితత్వం, పారదర్శకతకు అత్యంత కీలకమైనందున అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఆర్వో రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, సంబంధిత అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# రూ.25 వేలతో క్రీడా అవసరాలు తీరవు

**ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి**

**మంత్రులకు పేట పెద్దపల్లి జిల్లా నాయకుల వినతి**



**సుల్తానాబాద్, (సింగిడి):** ప్రభుత్వ పాఠశాలలకు మంజూరు చేస్తున్న క్రీడా నిధులను పెంచాలని పేట పెద్దపల్లి జిల్లా అధ్యక్షు డు డాక్టర్ వేల్పుల సురేందర్, ప్రధాన కార్యదర్శి దా సరి రమేష్ కోరారు. ఈ మేరకు మంత్రులకు విన తిపత్రం అందజేశారు. విద్యార్థుల శారీరక, మాన సిక వికాసంతోపాటు క్రీడాప్రతిభనుప్రోత్సహించేం దుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం పాఠశాలలకు కే టాయిస్తున్న రూ. 25 వేల క్రీడా నిధులు ఏమాత్రం సరిపోవడం లేదని పేర్కొన్నారు. క్రీడా సామగ్రి ధర లు పెరగడంతోపాటు విద్యార్థుల సంఖ్య, క్రీడల్లో భాగస్వామ్యం పెరిగిందన్నారు. కబడ్డీ, ఖోఖో, వా లీబాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ వంటి క్రీడలకు అవసరమైన పరికరాలకొనుగోలుకు అధిక వ్యయం అవుతోందని వివరించారు.

**పోటీలకు ప్రత్యేక నిధులు కావాలి...**

పాఠశాల స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్రస్థా యి పోటీలకు వెళ్లే విద్యార్థులకు ప్రయాణం, ఆ హారం, క్రీడా దుస్తులు, పరికరాల కోసం అదనపు ఖర్చులు అవుతున్నాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థుల ప్రయాణం, భోజనం తదితర ఖర్చులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని మంత్రులను కోరారు.

**గ్రామీణ ప్రతిభను వెలికితీయాలి..**

ప్రభుత్వ పాఠశాలలకు ప్రతి ఏటా అవసరమైన క్రీడా సామగ్రి అందించేలా ప్రత్యేక క్రీడా బడ్జెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతా ల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి జిల్లా, రా ష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు మరింత ఆర్థిక సహకారం అందిం చాలని కోరారు. విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తు, క్రీడా అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రూ. 25 వేల క్రీడా నిధులను గణనీయంగాపెంచాలని డాక్టర్ వే ల్పుల సురేందర్, దాసరి రమేష్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కే. లక్ష్మణ్, పెద్దపల్లి జిల్లా ఎస్‌జీఎ ఫ్ సెక్రెటరీ, సుల్తానాబాద్ మండలం ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ తాండ్ర ప్రణయ్, వ్యాయామ ఉపాధ్యా యులు జి. వెంకటేష్, వెంకట్ పీడీ, కరీంనగర్ జి ల్లా మాజీ అధ్యక్షులు అంతడుపుల శ్రీనివాస్ పా ల్గొన్నారు.

# నిర్మల్ లో అప్పల గణేష్ చక్రవర్తిని సన్మానించిన చలనచిత్ర టీవీ అసోసియేషన్



**నిర్మల్ ప్రతినిధి, (సింగిడి):** నిర్మల్ జిల్లా చలనచిత్ర, టీవీ అసోసియేషన్‌కు చెందిన కళాకారులు మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి గారిని గౌరవపూర్వకంగా కలిసి పూలమాల వేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాకారులు తమ సమస్యలను మున్సిపల్ వైస్ చైర్మన్ గారి దృష్టికి తీసుకువచ్చారు. నిర్మల్ జిల్లా కళాకారులకు ప్రభుత్వం ద్వారా పెన్షన్లు, ఇళ్ల స్థలాలు తదితర సంక్షేమ పథకాలు అందేలా సహకరించాలని కోరారు. అలాగే కళాకారుల సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించుకునేం దుకు నిర్మల్ జిల్లాలో ప్రత్యేకంగా కళాకారుల భవనం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా అధ్యక్షులు కోటగిరి నరసయ్య చారి, ప్రధాన కార్యదర్శి తిరుక్కోవెల రవి, ఉపాధ్యక్షులు కమలాకర్, కోశాధికారి సామెర్ల రాజన్న, పడాల మోహన్ రావు, బొందిడి పురుషోత్తం, కృష్ణ వర్మ, నరేందర్, జన్ను అనిల్ తదితర కళాకారులు పాల్గొన్నారు.

## వర్క్ షెడ్‌ను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ సుధాకర్

**మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలి**

**నిర్మల్ ప్రతినిధి(సింగిడి):** వర్క్ షెడ్ ను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ సుధాకర్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో మార్కెట్ నందు వి బి జి రామ్ జి పథకం కింద ఇటీవల నిర్మించిన వర్క్ షెడ్ ను ఐకెపిపిడి విజయలక్ష్మితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశుభ్రమైన వాతావరణంలో చేపల మార్కెట్ నిర్వహించాలని సూచించారు. పిడి ని మార్కెట్ షెడ్డు వివరాలను అడిగి తెలుసుకున్నారు. షెడ్డు నిర్మాణం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.



## నూతన హాస్పిటల్ ను ప్రారంభించిన ఎమ్మెల్సీ దండే విఠల్



**కాగజ్ నగర్, (సింగిడి)::** కాగజ్‌నగర్ పట్టణంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో తిరు ఆర్యన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ సిర్పూర్ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ తో కలిసి ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాగజ్‌నగర్ పరిసర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు మరింత చేరువ కావడం అభినందనీయమని, ఆధునిక వైద్య సదుపాయాలతో ఆసుపత్రి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అన్నారు ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆసుపత్రి యాజమాన్యం ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## ధాన్యం నిల్వలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు

**వెల్లడించిన ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్**




**నిర్మల్ ప్రతినిధి, (సింగిడి):** రైతులు పండించిన ధాన్యం విలువలకు ఇబ్బందులు కలగకుండా బైంసా మండలంలోని మహగాం గ్రామంలో గోదాముల నిర్మాణానికి ప్రభుత్వం పది ఎకరాల స్థలం కేటాయించడం జరిగిందని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ వెల్లడించారు. బుధవారం హైదరాబాదులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రొసీడింగ్ ను (జిల్లా కలెక్టర్ ఉత్తర్వు కాపీని) అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విఠలేశ్వర ఆలయం వెనుక ఉన్న 218 సర్వే నంబర్ లో 10 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించడం జరిగిందని, ఈ భూమిని తెలంగాణ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ కు గోదాముల నిర్మాణం కోసం కేటాయిస్తూ ప్రతిపాదించడం జరిగిందన్నారు.. 10 ఎకరాల స్థలంలో పదివేల నుంచి 20 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న సైంటిఫిక్ గోడౌన్స్ నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. స్థలము అప్పగించిన తర్వాత నిర్మాణం ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా మహాగాం సర్పంచ్ అప్పల రాజ్యలక్ష్మి రాకేష్ మాట్లాడుతూ తమ గ్రామంలో గోదాముల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ కు కృతజ్ఞతలు చెప్పారు. ప్రభుత్వం వేగవంతంగా గోదాముల నిర్మాణ ప్రక్రియ ప్రారంభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.


## జడ్పీహెచ్ఎస్ పెట్రోల్ పంప్ పాఠశాలలో ఉపాధ్యాయుల సమావేశం



**కాగజ్ నగర్ (సింగిడి):** స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ప్రాథమిక విద్యకు పునాది అని కాగజ్ నగర్ మండల విద్యాశాఖ అధికారి వాసాల ప్రభాకర్ అన్నారు. కాగజ్ నగర్ మండలంలోని జడ్పీహెచ్ఎస్ పెట్రోల్ పంప్ పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయి పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎంఈఓ ప్రభాకర్ మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో రిసోర్స్ పర్సన్స్ అందించే బోధనాంశాలు, నూతన మెళకువలను ఉపాధ్యాయులు తరగతి గదుల్లో సమర్థవంతంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. అప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సీఎంవో కె. శ్రీనివాస్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు ఏ. ప్రమీల, ఎస్. వెంకట్రాజయ్య, రిసోర్స్ పర్సన్స్ రమేష్, జిత్తు నాయక్, సింహాచలం, శివానంద్ మరియు మండల పరిధిలోని పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# ఏకలవ్య గురుకుల పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు





**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, (సింగిడి)::** ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. బుధవారం కాగజ్‌నగర్‌లోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో నిర్వహణ కమిటీ సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏకలవ్య గురుకుల పాఠశాల గిరిజన విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు రాష్ట్ర సిలబస్ నుంచి సీబీఎస్ఈ సిలబస్‌కు మారుతున్నందున కొంత ఇబ్బంది ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఆంగ్ల మాధ్యమంలో బోధన అందించి, ఆంగ్ల భాషపై పట్టు సాధించేలా చూడాలని సూచించారు. విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా అధ్యాపకులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, మాతృభాష నుంచి ఆంగ్ల మాధ్యమానికి సులభంగా మారేందుకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లలకు అందుతున్న విద్యపై ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకోవాలని కోరారు. విద్యార్థుల ఆరోగ్యంపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అనారోగ్యంతో చదువుపై దృష్టి సారించలేకపోతున్న వారిని గుర్తించి తగిన వైద్య సహాయం అందించాలని తెలిపారు. మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన ఆహారాన్ని సకాలంలో అందించాలని సూచించారు. పాఠశాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని, విద్యాలయ అభివృద్ధికి అధికారులు, సిబ్బంది, నిర్వహణ కమిటీ సభ్యులు సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి, పాఠశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు, నిర్వహణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సిన్మా సింగిడి
Cinma Singidi

శుక్రవారం
21-8-2026



## అనుపమకు
# హ్యాట్సాఫ్ చెప్పాలి
### శంకర్ కుమార్తె అదితి ప్రశంసలు

అనుపమ పరమేశ్వరన్ ఇటీవల తన వ్యక్తిగత జీవితం, మాజీ ప్రియుడి వల్ల ఎదుర్కొన్న మానసిక క్షోభను బయటపెట్టిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. ఈ విషయంపై తాజాగా నటి అదితి శంకర్ స్పందించారు. అనుపమ ధైర్యాన్ని, నిజాయతీని ఆమె ప్రశంసించారు.

అదితి నటించిన 'వన్స్‌మోర్' ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ అంశంపై మాట్లాడారు. "అనుపమ ఇంటర్వ్యూ చూశాను. ఆమె కామెంట్స్‌పై ఒక్కొక్కరికి ఒక్కో అభిప్రాయం ఉండొచ్చు. కానీ, ఆమె ఎదుర్కొన్న ఇబ్బందిని ధైర్యంగా పంచుకున్నందుకు హ్యాట్సాఫ్ చెప్పాలి. ఆమె మాటల్లో నిజాయతీ ఉంది" అని అదితి పేర్కొన్నారు. ఎవరినీ నిందించడం, కించపరచడం అనుపమ ఉద్దేశం కాదని అదితి అభిప్రాయపడ్డారు. ఆమె పంచుకున్న అనుభవం అవగాహన కలిగించేలా ఉందన్నారు. చాలామంది పురుషులు, మహిళలు తీవ్రమైన మానసిక ఘర్షణలతో కూడిన బంధాల్లో ఉంటున్నారని.. తాము ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నామో కూడా అర్థం చేసుకోలేకపోతున్నారని అదితి వివరించారు. అనుపమలా ఓపెన్‌గా మాట్లాడటం వల్ల అలాంటి వారికి కూడా ఒక స్పష్టత వస్తుందని తెలిపారు.

పీరియడ్స్ విషయంలోనూ సిగ్గుపడేలా చేశాడు: మాజీ ప్రియుడిపై అనుపమ కామెంట్స్
మాజీ బాయ్‌ఫ్రెండ్ పేరును ప్రస్తావించకుండా అనుపమ తన వ్యక్తిగత జీవితంపై ఇటీవల మాట్లాడారు. అతడి ప్రవర్తన వల్ల ఒక నటిగా, మహిళగా తనను తాను నిందించుకునే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్ల పాటు ఆ బంధంలో నరకం చూశానని చెప్పారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ వైరల్ అవుతుండగా అభిమానులు ఆమెకు ధైర్యం చెబుతూ పోస్టులు పెడుతున్నారు

# మ్యూజికల్ డ్రామా..జగమే సంగీతం
## అమెజాన్‌లో 4నుంచి వెబ్ సీరిస్



మ్యూజికల్ డ్రామా సిరీస్ 'జగమే సంగీతం' ప్రేక్షకుల ముందుకు

టాలీవుడ్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన మ్యూజికల్ డ్రామా సిరీస్ 'జగమే సంగీతం' ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సిరీస్ ప్రపంచవ్యాప్త ప్రీమియర్ తేదీని అధికారికంగా ప్రకటించింది. కర్ణాటక సంగీత నేపథ్యంతో రూపొందిన ఈ ఒరిజినల్ సిరీస్ సెప్టెంబర్ 4 నుంచి ప్రసారం కానుంది. ప్రముఖ హిందీ సిరీస్ 'బందిష్ బాండిట్స్' స్ఫూర్తితో తెరకెక్కిన ఈ ప్రాజెక్ట్‌ను పల్నాటి సూర్య ప్రతాప్ సృష్టించి దర్శకత్వం వహించగా, సుష్మిత కొణిదెల నిర్మించారు. ప్రకాష్ రాజ్, శ్రీకాంత్, మధుబాల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో అక్షయ్ లగుసాని, సుస్మితా శెట్టి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వంగాల సూర్య మనోజ్, శ్రావణి సముద్రాల, ఎ. ఆర్. ప్రభావ్ ఈ సిరీస్‌కు కథను అందించగా, విశాల్ చంద్రశేఖర్ అందించిన సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. కర్ణాటక సంగీత సంప్రదాయాలను సమకాలీన శ్రుతులతో మేళవిస్తూ ఆయన అందించిన స్వరాలు ఈ కథకు ప్రాణం పోశాయని చెప్పవచ్చు. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా 240కి పైగా దేశాల్లో తెలుగుతో పాటు తమిళ డబ్బింగ్ వెర్షన్, ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్‌తో ప్రైమ్ వీడియోలో ఈ సిరీస్ అందుబాటులోకి రానుంది. ఈ కథ విషయానికొస్తే.. కర్ణాటక సంగీత వారసత్వాన్ని కలిగిన కుటుంబం మరియు దాని మూలాల చుట్టూ ఈ సిరీస్ తిరుగుతుంది. తన తాత గారి సంగీత వారసత్వాన్ని కొనసాగించాలనుకునే బాలు అనే యువకుడు.. కుటుంబ బంధాలు, రహస్యాలు, సాంప్రదాయ కట్టుబాట్ల మధ్య ఎలా నలిగిపోయాడనేదే ప్రధానాంశం. తన కుటుంబం నిర్మించిన ప్రతిష్టను కాపాడుకుంటూనే, తనకంటూ ప్రత్యేకమైన కళాత్మక స్వరాన్ని ఎలా కనుగొన్నాడనే భావోద్వేగ ప్రయాణాన్ని ఇందులో చూపించనున్నారు. సంగీతంలోని భావోద్వేగ శక్తిని చాటిచెప్పే హృద్యమైన కథే 'జగమే సంగీతం' అని, సంప్రదాయం, ఆశయం వంటి అంశాలను ఇది అద్భుతంగా అన్వేషిస్తుందని తెలిపారు. అలాగే నిర్మాత సుష్మిత కొణిదెల మాట్లాడుతూ.. సంగీతం కేవలం ఒక కళ మాత్రమే కాకుండా, ఆ కుటుంబంలోని ప్రేమ, సంఘర్షణలను తెలిపే భావోద్వేగ భాషగా ఎలా మారుతుందో ఈ సిరీస్ ద్వారా చూపిస్తున్నామని పేర్కొన్నారు. అసాధారణ నటీనటులతో తెరకెక్కిన ఈ సంగీత భరిత ప్రయాణాన్ని ప్రేక్షకులు తప్పకుండా ఆస్వాదిస్తారని యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.



## తల్లిదండ్రుల మధ్య సేదదీరిన
# విజయ్ దేవరకొండ
### ఫోటోను షేర్ చేసిన రష్మిక మందన్నా



టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ తన కుటుంబంతో గడిపిన మధురమైన క్షణాలకు సంబంధించిన ఒక క్యూట్ ఫోటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ పిక్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. భారీ వర్షాల కారణంగా విజయ్ తాజా సినిమా షూటింగ్ అనూహ్యంగా రద్దు కాగా, ఆ సమయాన్ని ఆయన పూర్తిగా తన కుటుంబంతో కలిసి విశ్రాంతిగా గడపాలని నిర్ణయించుకున్నారు. చిన్నతనంలో తాను ఎంతో ఇష్టపడే ప్రదేశంలో, తన తల్లిదండ్రుల మధ్య హాయిగా నిద్రపోతున్న ఒక అరుదైన ఫోటోను ఆయన తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ఈ పిక్‌కు విజయ్ క్యాప్షన్ ఇస్తూ, వర్షం కారణంగా షూటింగ్ రద్దయిందని, చిన్ననాటి ఇష్టమైన ప్రదేశంలో మధ్యాహ్నం పూట ఇలా ప్రశాంతంగా నిద్రపోవడం వల్ల తన ఎనర్జీ రీఛార్జ్ అయిందని తెలిపారు. అంతేకాకుండా, ఈ అందమైన ఫోటోను తన సతీమణి, ప్రముఖ నటి రష్మిక మందన్న తీశారంటూ ఆమెకు ప్రత్యేకంగా క్రెడిట్ ఇవ్వడం విశేషం. ఈ దంపతుల అన్యోన్యతను చూసి అభిమానులు మురిసిపోతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహ బంధంలోకి అడుగు పెట్టిన విజయ్, రష్మిక జోడీ ఆన్ స్క్రీన్‌పై కూడా మరోసారి సందడి చేయడానికి సిద్ధమవుతోంది. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పీరియాడికల్ డ్రామా 'రణబాలి' చిత్రంలో ఈ రియల్ లైఫ్ కపుల్ ఆన్ స్క్రీన్‌పై జంటగా నటిస్తున్నారు.

# మమితా బైజు ..
# మరో మూవీతో సిద్ధం

'ఇప్పుడెందుకు చంద్రముఖిలో జ్యోతికలా బిహేవ్ చేస్తున్నావు' అంటూ 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంతో ఇటీవలే తెరపై సందడి చేసి కుర్రకారుని ఆకట్టుకుంది అందాల తార మమితా బైజు. ఇప్పుడీ జోష్‌లోనే మరో ప్రేమకథతో ప్రేక్షకుల్ని అలరించడానికి రెడీగా ఉంది. ఆమె, నివిన్ పౌలీ జంటగా నటించిన చిత్రం 'బెత్లెహెం కుడుంబ యూనిట్'. 'ప్రేమలు' ఫేమ్ గిరీశ్ ఏడీ తెరకెక్కించారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు సినీప్రియుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇందులో భాగంగానే తాజాగా మరో పోస్టర్‌ను ఇన్‌స్టా వేదికగా పంచుకుంది మమిత. అందులో ఆమె కూర్చొని చిరునవ్వులు చిందిస్తూ ఆకట్టుకుంటుంది. ఫహాద్ ఫాజిల్, దిలీష్ పోతాన్ నిర్మించిన ఈ రొమాంటిక్ ప్రేమకథా చిత్రం ఈ నెల 21న థియేటర్లలోకి రావడానికి సిద్ధంగా ఉంది.

Printed,published & Owned by P. Sunitha Reddy on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Dussa Shivaprasad, PRGI.NO. TGTEL/26/A4370. Cell 8179799090